జీవితాలకు,
జీవనోపాధులకు ముప్పుగా
వాతావరణ మార్పులు

- గతేదాది కాలంలో 71శాతం మంది భారతీయులపై వడగాలుల ఎఫెక్ట్
- అంతర్జాతీయ అధ్యయనంలో వెల్లడి

7

PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 291 | విజయవాడ, ఆదివారం 25 మే 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00
Vol No | Vijayawada, Sunday 25 May 2025 | Rs

టెస్ట్ సారథిగా శుభ్‌మన్

వైస్ కెప్టెన్‌గా రిషబ్ పంత్ ● సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్‌కు చోటు
ఇంగ్లాండ్ టూర్‌కు భారత టెస్టు జట్టు ఎంపిక

8

ముందుగానే పలకరించిన నైరుతి

కేరళలో విస్తారంగా వర్షాలు - రెండు మూడు రోజుల్లో ఆంధ్రాకు - 27న అల్పపీడనం

తిరువనంతపురం, అమరావతి బ్యూరో : దేశంలో వ్యవసాయ కార్యకలాపాలకు దోహదపడే నైరుతి రుతుపవనాలు కేరళను శనివారం పలకరించాయి. సాధారణంగా జూన్ 1నాటికి రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయి. ఈసారి భారత వాతావరణ శాఖ అంచనా వేసిన దానికన్నా దాదాపు 8 రోజులు ముందస్తుగా కేరళకు రుతుపవనాలు రావడం గత 16 ఏళ్లలో ఇదే తొలిసారి. 2009లో మే 23న వచ్చాయి. ఈ ప్రభావంతో కేరళలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల వర్షాల ధాటికి వృక్షాలు సైతం నేల కూలాయి. దీంతో ట్రాఫిక్ అస్తవ్యస్థమైంది. పలు జిల్లాల్లో ఇప్పటికే రెడ్, ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. వచ్చే రెండు మూడు రోజులు ఈ అలర్ట్‌లు కొనసాగనున్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే మరో రెండు మూడు రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లోకి, మహారాష్ట్రలోకి రుతుపవనాలు ప్రవేశిస్తాయని భావిస్తున్నట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి)శనివారం తెలిపింది. ఈఏడాది సాధారణం కంటే అధికంగా వర్షపాతం నమోదయ్యే అవకాశం వుందని ఇప్పటికే వాతావరణ శాఖ వెల్లడించింది.

వాయుగుండంగా మారిన అల్పపీడనం

తూర్పు, మధ్య అరేబియా సముద్రంలో దక్షిణ కొంకణ్ తీరానికి సమీపంలో వాయుగుండం గడిచిన 6 గంటల్లో 5 కిలోమీటర్ల వేగంతో తూర్పువైపునకు నెమ్మదిగా కదులుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. వాయుగుండం రత్నగిరి సమీపంలోని దక్షిణ కొంకణ్ తీరాన్ని దాటే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఈ ప్రభావంతో పశ్చిమ తీరంలో భారీగా వర్షాలు కురిసే అవకాశం వుందని వివరించింది.

27న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం

ఈ నెల 27న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో రాష్ట్రంలో రానున్న మూడురోజులు అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. తీరం వెంబడి గంటకు 40-50 కిలోమీటర్లు వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నెల 25న అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఈ నెల 26న అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, ఏలూరు, ఎన్‌టిఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో విస్తృతంగా వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు.

యోగా డే పేరుతో ప్రజలను విశాఖకు తరలించొద్దు

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

యోగా డే పేరుతో ప్రజలను విశాఖకు తరలించొద్దని, కోవిడ్ హెచ్చరిక నేపథ్యంలో యోగాపై సర్వే ఆపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్ 21న విశాఖపట్నంలో ప్రధాన మంత్రి పాల్గొనే యోగా దినోత్సవం కోసం రాష్ట్రమంతటి నుండి ప్రజలను తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో కరోనా కేసులు నమోదవుతున్నాయని, జాగ్రత్తలు పాటించాలని, రాష్ట్ర ఆరోగ్యశాఖ హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో పెద్దయెత్తున ప్రజలను తరలించడం ద్వారా కరోనా మరింతగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని రాష్ట్రప్రభుత్వం గుర్తించాలని కోరారు. కరోనా కేసులు విశాఖ పట్నంలో కూడా నమోదయ్యాయని మంత్రి సత్య కుమార్ స్వయంగా ప్రకటించారని పేర్కొన్నారు. ఎక్కువమంది ఒకచోట చేరడం ద్వారా గతంలో జరిగిన విషాదకర పరిణామాలు ప్రజల మదిలో ఉన్నాయని అన్నారు. అంతర్జాతీయ యోగా డే కోసం రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులు ఇంటింటి సర్వే చేస్తూ పెద్ద సంఖ్యలో తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని, ప్రధాన మంత్రి మెప్పు కోసం చేసే ఇలాంటి చర్యలు ప్రజల ఆరోగ్యానికి హానికరంగా మారుతాయని తెలిపారు. కరోనా హెచ్చరిక నేపథ్యంలో సర్వే తక్షణం నిలిపేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నంబాల, సజ్జా మృతదేహాల కోసం ఛత్తీస్‌గఢ్ వెల్లండి

- పిటిషనర్లకు హైకోర్టు ఉత్తర్వులు

7

'టీం ఇండియాలా' కలిసి పనిచేద్దాం

- నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు టీం ఇండియా లాగా కలిసి పనిచేస్తే, ఏ లక్ష్య సాధన కూడా అసాధ్యం కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. శనివారంనాడిక్కడ ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన నీతి ఆయోగ్ 10వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. 'వికసిత రాజ్యం కోసం వికసిత భారత్-2047' లక్ష్యంగా ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్ల సమావేశం ప్రధాని అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ తరువాత జరుగుతున్న సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట్లాడుతూ అభివృద్ధి వేగాన్ని పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. 'వికసిత్ భారత్ ప్రతి భారతీయుడి లక్ష్యం. ప్రతి రాష్ట్రమూ వికసిత్ అయినప్పుడు, మొత్తంగా భారతదేశం వికసిత్ అవుతుంది. ఇది 140 కోట్ల మంది పౌరుల ఆకాంక్ష' అని పేర్కొన్నారు.

నీతి ఆయోగ్ సమావేశానికి హాజరైన ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, వివిధ రాష్ట్రాల సిఎంలు తదితరులు

దీర్ఘకాలిక దృష్టి

వికసిత రాజ్యం కోసం వికసిత భారత్ అనే భావనతో రాష్ట్రాలు.. జాతీయ ప్రాధాన్యతలు, స్థానిక వాస్తవాలకు అనుగుణంగా దీర్ఘకాలిక, సమగ్రమైన దార్శనిక పత్రాలను రూపొందించాలని ఈ సందర్భంగా నీతి ఆయోగ్ పిలుపునిచ్చింది. ఈ దార్శనిక పత్రాలు కాలపరిమిత లక్ష్యాలను కలిగి ఉండాలని, అవి రాష్ట్రాల భౌగోళిక, జనాభా పరమైన ప్రత్యేకతలను సద్వినియోగం చేసుకోవాలని నీతి ఆయోగ్ సూచించింది. మానవ వనరుల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి, సుస్థిరత, సాంకేతికత, మిగతా 7లో

2029 నాటికి పేదరికం లేని రాష్ట్రం

- స్వర్ణాంధ్రను సాధించేలా అడుగులు
- నీతి ఆయోగ్ సమావేశంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

స్వర్ణాంధ్ర విజన్-2047తో 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయడమే లక్ష్యంగా ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. పి-4తో ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు బలంగా సంకల్పించామని అన్నారు. వికసిత్ భారత్ 2047 సాకారంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందుందని పేర్కొన్నారు. శనివారం నాడిక్కడ ప్రగతి మైదానంలో భారత్ మండపంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ పదో గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సిఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థ 4వ నుంచి త్వరలో 3వ స్థానానికి వెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌తో ప్రతి కుటుంబానికి అందుతున్న లబ్ధిని రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్‌గా ట్రాక్ చేస్తోందన్నారు. వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమంతో నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపునకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి పారిశ్రామికవేత్త వచ్చేలా పాలసీలు తీసుకొచ్చామని, 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఇ పార్కులు, వన్ డిస్ట్రిక్ట్ వన్ పార్క్‌ను ప్రవేశపెడుతున్నామని వివరించారు.

రాష్ట్రంలో టెక్నాలజీ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను కూడా సిఎం చంద్రబాబు సమావేశంలో వివరించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా విశాఖపట్నంను అభివృద్ధి చేస్తున్నామని, విశాఖ మోడల్‌ను అమరావతి, తిరుపతి, కర్నూలుకు విస్తరించేలా కేంద్రం సహకరించాలని కోరారు. డిజిటల్ గవర్నెన్సులో గూగుల్ ఎఐ టెక్నాలజీ వినియోగిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్‌బుక్ క్రియేట్ చేస్తున్నామని వివరించారు. టాటా ఇన్నోవేషన్ హబ్, ఎఐ ఆధారిత పాలనతో రాష్ట్రం స్టార్టప్‌లకు, ఉద్యోగ సృష్టికి మార్గదర్శకంగా మారిందని అభిప్రాయపడ్డారు.

జిడిపి, పాపులేషన్ మేనేజ్‌మెంట్, టెక్నాలజీపై చర్చ

పెట్టుబడులు, తయారీ, ఎగుమతులు, ఉద్యోగ సృష్టి వంటి అంశాలపై దృష్టి పెట్టి, పిపిపి ప్రాజెక్టులకు కేంద్రం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌కు మద్దతుగా ఉండటంతో జిడిపి వృద్ధికి దోహదపడుతుందని సిఎం అన్నారు. పాపులేషన్ మేనేజ్‌మెంట్‌తో దేశంలో వృద్ధుల శాతాన్ని తగ్గించుకునే అవకాశం ఉందన్నారు. ఈ ఉద్దేశంతోనే స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన రద్దు, మాతృత్వ సెలవులు పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్ళు పూర్తి చేసుకునే నాటికి దేశ లక్ష్యాలకు అనుగుణంగా... మార్గదర్శకత్వం వహించేలా ఎపి ముందుండి నడవడానికి సిద్ధంగా ఉందని పునరుద్ఘాటించారు.

సంక్షోభ సమయంలో ధైర్యంగా నిలిచారు

ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన అమాయకులకు సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళు లర్పించారు. సాయుధ బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైందని కొనియాడారు. యుద్ధ వాతావరణం నెలకొన్న సంక్షోభ సమయంలో ప్రధాని మోడీ ధైర్యంగా.. నాయకత్వం వహించారని ప్రశంసించారు. అలాగే నీతి ఆయోగ్ సమావేశంలో సిఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ బ్లూ ప్రింట్‌పై ప్రధాని మోడీ ప్రశంసించారు. ఇతర రాష్ట్రాలు కూడా ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న సంస్కరణలను అధ్యయనం చేయాలని, సిఎం చంద్రబాబు రూపొందించిన ప్రణాళిక ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉంటుందని ప్రధాని మోడీ అన్నారు.

మత సామరస్యం, దేశ సమగ్రత కోసం..

ఐక్యంగా ఉద్యమించాలి

- పహల్గాం ఉగ్రవాదులను పట్టుకోవడంలో కేంద్రం విఫలం
- నేటి పరిస్థితుల్లో జరగాల్సింది యోగా డే కాదు.. జాతీయ సమైక్యతా సభ
- విశాఖలో సమైక్యతా యాత్రలో : వి శ్రీనివాసరావు

విశాఖ నగరంలో సాగుతున్న సమైక్యతా యాత్రలో పాల్గొన్న వి.శ్రీనివాసరావు, కె.లోకనాథం, ప్రజలు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు తీసిన ఉగ్రవాదులను పట్టుకోవడంలో కేంద్రం విఫలమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. దేశ ప్రజలంతా ఉగ్రవాదంపై పోరాడాలని, దేశంలో మత సామరస్యం, సమగ్రత కోసం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ శనివారం సమైక్యతా యాత్ర జరిగింది. భారీ జాతీయ జెండాలతో, చిన్నారుల కోలాట ప్రదర్శనతో ఆద్యంతం ఈ ర్యాలీ ఉత్తేజంగా సాగింది. భారతదేశ చిత్రపటాన్ని చేతపట్టుకుని ర్యాలీలో పాల్గొన్న ప్రజలు జివిఎంసి గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడ సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జూన్ 21న ప్రధాని మోడీ విశాఖకు యోగా డేలో పాల్గొనేందుకు వస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నెల రోజుల పాటు ఏర్పాట్లపైనే దృష్టి సారించారని, ఈ పరిస్థితుల్లో జరగాల్సింది యోగా డే కాదని, ఆ రోజును జాతీయ సమైక్యతా సభగా మార్చాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలు ఐక్యతను కోరుకుంటున్నారని తెలిపారు. పహల్గాం దాడుల్లో దేశం నష్టపోతే వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కార్మికులు తమ సమ్మెను వాయిదా వేసుకున్నారని, ఇదీ నిజమైన దేశభక్తి అంటే అనేసరికి సభికుల నుంచి పెద్ద ఎత్తున చప్పట్ల వర్షం కురిసింది. ప్రధాన మంత్రి మోడీ మాత్రం ఇంతవరకూ శ్రీనగర్‌ను సందర్శించలేదని, ఎన్నికల సభలకు మాత్రం వెళ్లారని, ఇదేం దేశభక్తి అని ప్రశ్నించారు. పహల్గాం ఉగ్రవాద దాడుల్లో విశాఖ వాసి చంద్రమౌళి మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. దేశ ప్రజలు నేడు ఎదుర్కొంటున్న ఉగ్రవాదానికి పాకిస్తాన్‌లోని మతోన్మాద ప్రభుత్వం ఒక కారణమైతే, మన దేశంలో మోడీ పాలన విచ్ఛిన్నకర పోకడలు మరో కారణమని, ఈ రెండు దేశాలనూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆడిస్తున్నాడని అన్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం పుట్టిన తెలుగుదేశం పార్టీ నేడు మతోన్మాద ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ రాష్ట్రాన్ని నాశనం చేయాలనుకోవడం సరైంది కాదని తెలిపారు. దేశం సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోందని, ఉగ్రవాదం పేరుతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలో హిందూ, ముస్లింల మధ్య విద్వేషాలను రెచ్చగొడు తోందని అన్నారు. ఒక ఉగ్రవాది ముస్లిం అయినంత మాత్రాన ముస్లిములంతా ఉగ్రవాదులు కాజాలరని తెలిపారు. పహల్గాం దాడికి పాల్పడిన వారు ఆ ప్రాంతానికి ఎలా చొరబడగలిగారో ఇంతవరకూ విచారణ చేయలేదని, సరిహద్దుల్లో ఉన్న రాష్ట్రంలోకి ఉగ్రవాదులు వచ్చేస్తే అసలు ప్రభుత్వం ఏం చేస్తోం దని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్ పేరిట తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను 22 నిమిషాల్లోనే మట్టు పెట్టామని చెపుతున్నారని, ఆ తర్వాత మిగతా 7లో

కడప జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- కారుపై పడిన లారీ
- నలుగురు దుర్మరణం

నుజ్జయిన కారు

ప్రజాశక్తి- చింతకొమ్మదిన్నె/బద్వేలు (కడప జిల్లా), అమరావతి బ్యూరో

కడప జిల్లాలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... బెంగళూరు నుండి బద్వేలు నియోజకవర్గంలోని చింతపుత్తాయపల్లెకి కారులో కొంతమంది వెళు తున్నారు. తమిళనాడులోని లిల్లీపురం నుండి హైదరాబాదుకు చక్కెర లోడుతో వెళ్తుతున్న లారీ బ్రేక్ ఫెయిలై అదుపు తప్పి ఈ కారుపై పడింది. లారీలోని చెక్కర మూటలు కూడా కారుపై పడ్డాయి. కారు నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బసినేని శ్రీకాంత్‌రెడ్డి (32), ఆయన భార్య నాగిరెడ్డి శిరీష (27), శిరీష అక్క కుమార్తె హర్షితరెడ్డి (9), కుమారుడు రిషికేశ్‌రెడ్డి (11) ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. శ్రీకాంత్‌రెడ్డి కుమార్తె త్రిషికారెడ్డి, కోవటం శశికళ, సిద్ధమూర్తి, స్వర్ణలత తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం వల్ల ఘాట్ రోడ్డులో వాహనాల రాకపోకలకు సుమారు రెండు గంటలకుపైగా అంతరాయం ఏర్పడింది. చింతకొమ్మదిన్నె పోలీసులు జెసిబి సహాయంతో దాదాపు ఒకటిన్నర గంటలపాటు శ్రమించి నుజ్జయిన కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను, క్షతగాత్రులను బయటకు తీశారు. క్షతగాత్రులను 108లో కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ దిగ్భ్రాంతి

ఈ ప్రమాదం పట్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

వారికి కనీస కృతజ్ఞత లేదు

- సినీరంగ పెద్దలపై పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'తెలుగు సినీరంగంలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం పట్ల కనీస కృతజ్ఞత లేదని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన కార్యాలయం శనివారం నాడు ఒక ప్రకటన విడుదల చేసింది. తమ డిమాండ్లు పరిష్కరించక పోతే ఒకటో తేదీ నుండి థియేటర్లు బంద్ చేస్తామంటూ ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు హెచ్చరించిన సంగతి తెలిసిందే. పవన్ కల్యాణ్ నటించిన సినిమా కూడా దాదాపుగా ఈ సమయంలోనే విడుదల కానుండటంతో ఈ ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. 'మీరు ఇచ్చిన ఈ రిటర్న్ గిఫ్ట్‌ను తగిన విధంగానే స్వీకరిస్తా...' అని ఈ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమౌతున్నా సినీ సంఘాల ప్రతినిధులు సిఎంను మర్యాదపూర్వకంగానైనా కలిశారా? అని ఆయన ప్రశ్నించారు. ఇకనుండి కూటమి ప్రభుత్వం వ్యక్తులను చూడదని, సినిమా రంగ అభివృద్ధినే చూస్తుందని తెలిపారు. పవన్ సినిమా విడుదల సందర్భంగానే సమస్యలను ముందుకు తీసుకు రావడం వెనుక కుట్ర ఉందని సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

పొగాకు కౌలు రైతు ఆత్మహత్య

- సమీపంలోనే మంత్రుల చర్చలు
- అయినా పరామర్శకు నోచుకోని మృతుని కుటుంబం

ప్రజాశక్తి- పంగులూరు (బాపట్ల జిల్లా)

పొగాకు కొనుగోలు చేయడానికి బయ్యర్లు ఎవ్వరూ ముందుకురాకపోవడంతో, అప్పులు తీర్చలేనన్న ఆందోళనకు గురైన ఒక కౌలు రైతు బలవన్మరణానికి పాల్పడిన ఉదంతమిది. బాపట్ల జిల్లా పంగులూరు మండలం జనకవరం గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఆత్మహత్యకు పాల్పడిన రైతుకు 34 సంవత్సరాలు మాత్రమే కావడంతో ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ సంఘటన వెలుగుచూసిన సమయానికి రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్ తదితరులు బాపట్ల జిల్లాలోనే పొగాకు కొనుగోలు ధరలపై బయ్యర్లతో చర్చలు నిర్వహిస్తున్నారు. చర్చలు నిర్వహిస్తున్న ప్రాంతానికి సమీపంలోనే జనకవరం గ్రామం ఉంది. అయినా, మంత్రులు ఆ గ్రామానికి వెళ్లడం కానీ, ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబ సభ్యులను పరామర్శించడంగాని. చేయకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కుటుంబ సభ్యులు చెప్పిన సమాచారం మేరకు జనకవరం గ్రామానికి చెందిన తలపనేని శ్రీనాథ్ (34) ఏడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని నల్లబర్లీ పొగాకు పంటను సాగుచేశారు. పంట సిద్ధమైనా కొనుగోలుకు బయ్యర్లు ముందుకు రాలేదు. దీంతో ఆయన తీవ్ర ఆవేదనకు గరయ్యాడు. అప్పుల వాళ్ల ఒత్తిడి పెరగడం, పండిన పంట అమ్ముడుపోకపోవడంతో తీవ్ర ఒత్తిడికి గురైనట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి పొలం వద్దకు వెళ్లిన శ్రీనాథ్ ఇంటికి తిరిగి రాలేదు. శనివారం ఉదయం ఆయన తండ్రి హరిబాబు పొలం వద్దకు వెళ్లగా శ్రీనాథ్ విగతజీవిగా పడి ఉన్నారు. పక్కన పురుగుమందు డబ్బా కనిపించింది. ఆత్మహత్య విషయం తెలియడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతునికి భార్య, ఒక కుమార్తె,, ఒక కుమారుడు ఉన్నారు.

మృతిచెందిన శ్రీనాథ్

రైతు సంఘం నాయకుల పరామర్శ

అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న యువరైతు శ్రీనాథ్ మృతదేహాన్ని ఎపి రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, సీనియర్ నాయకులు కందిమల్ల రామకోటేశ్వరరావు శనివారం సందర్శించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పొగాకు కంపెనీలు, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే శ్రీనాథ్ ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేసేందుకు కంపెనీలు ఇంతవరకూ ముందుకు రాలేదని, ప్రభుత్వం కూడా సరైన విధానం పాటించలేదని, అందువల్లే రైతులు ఆత్మహత్యలే శరణ్యం అనుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా లేదా కంపెనీల ద్వారా నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

బ్లాక్ బర్లీ పొగాకు చివరి ఆకూ కొనేవరకు ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి

7

విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు మద్దతుగా
26న కలెక్టర్లకు వినతిపత్రాలు, నిరసన ప్రదర్శనలు

- కార్మిక సంఘాల ఐక్యవేదిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల నిరవధిక సమ్మెకు మద్దతుతో పాటు తొలగించిన కాంట్రాక్టు కార్మికులందరినీ వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లకు మెమోరాండమ్‌లు అందజేయడంతోపాటు , నిరసన ప్రదర్శనలు చేపట్టాలని కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చింది. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం ఈ మేరకు తీర్మానం చేసింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇప్పటి వరకు తొలగించిన కాంట్రాక్టు కార్మికులందరినీ తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులకు కూడా సక్రమంగా జీతాలు చెల్లించడం లేదన్నారు. ఎన్నికలకు ముందు స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా రక్షిస్తామని చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, పురందేశ్వరి హామీనిచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయడం లేదన్నారు. ఇటీవల కేంద్రం ఇచ్చిన నిధులు స్టీల్‌ప్లాంట్ కార్మికుల శ్రేయస్సు కోసం, ఉద్యోగుల జీత భత్యాలు, ఖనిజాలు కొనుగోలుకు కాకుండా పాత అప్పుల చెల్లింపులు కోసం ఉపయోగిస్తున్నారని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు శాశ్వత ప్రాతిపదికన గనులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేయకపోవడమేంటని ఆయన ప్రశ్నించారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వి.ఉమామహేశ్వరరావు

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు గనులు అడగలేని వాళ్లు అనకాపల్లి వద్ద కార్పొరేట్లు ఏర్పాటు చేసే ప్రైవేటు ప్లాంట్‌కు గనులు కేటాయింపుతో పాటు ప్రభుత్వ పరంగా వనరులు కేటాయిస్తున్నారని చెప్పారు. ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు చేస్తున్న సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు సహజసంపదను దోచిపెడుతుంటే వారికి అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం తందాన తాన అంటుందోన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, సిఐటియు రాష్ట్ర నాయకులు ముజఫర్ అహమ్మద్, వివిఎల్ నరసింహులు, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు చలసాని వెంకటరామారావు, రాధాకృష్ణ, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం నాయులు దడాల సుబ్బారావు, ఎఐసిటియు రాష్ట్ర నాయకులు సుధీర్, డియుసిఐ రాష్ట్ర నాయకులు మారీదు ప్రసాద్‌బాబు, ఐఎఫ్‌టియు నాయకులు రామకృష్ణ , ఎన్‌టిఆర్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, చిత్రంలో లోకనాథం తదితరులు

కార్మికుల సహనాన్ని పరీక్షించొద్దు

- ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలి : వి శ్రీనివాసరావు
- ఐదో రోజుకు చేరిన స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సహనాన్ని పరీక్షించవద్దని, శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మికులపై దౌర్జన్యాన్ని, నిర్బంధాన్ని ప్రదర్శిస్తే ఎదురవ్వబోయే పరిస్థితులకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. అణచివేతతో ఉక్కు సమ్మెను అడ్డుకోలేరన్నారు. అక్రమ తొలగింపులను నిరసిస్తూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి ఐదో రోజుకు చేరుకుంది. విధులను బహిష్కరించిన కాంట్రాక్టు కార్మికులు కూర్మన్నపాలెంలోని ఉక్కు దీక్షా శిబిరం వద్దకు చేరుకున్నారు. అక్కడ జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికుల శ్రమను గుర్తించాలని, పెట్టుబడి కంటే శ్రమ గొప్పదని అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతారని భావించి కార్మికులంతా ఓట్లు వేయగా గెలిచిన నేతలంతా నేడు గద్దెనెక్కి మాట్లాడటం లేదన్నారు. అటువంటి వారిని కార్మికులు గద్దె దించుతారని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్‌లో 70 శాతం ఉత్పత్తి కాంట్రాక్ట్ కార్మికులపై ఆధారపడి జరుగుతోందని, వారి జోలికి వస్తే ఉత్పత్తి నిలిచిపోతుందని తెలిపారు. అందువల్ల తొలగించిన కార్మికులందరినీ వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వం వివేకంతో ఆలోచించి నిర్ణయం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్టీల్ సమ్మె విషయంలో జోక్యం చేసుకొని కార్మికుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని కోరారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకకుంటే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో నిరంకుశ, నిర్బంధ విధానాలు నానాటికీ పెరుగుతున్నాయన్నారు. ప్రధాని మోడీ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతోందని తెలిపారు. విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కోసం కేంద్రం కుట్రలు పన్నుతోందన్నారు. ప్యాకేజీ పేరిట నాటకాలు ఆడుతోందని తెలిపారు. కార్మికులకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎఐటియుసి జాతీయ నాయకులు డి.ఆదినారాయణ, హెచ్‌ఎంఎస్ నాయకులు గణపతి రెడ్డి, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యయుతంగా కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్న ఉద్యమాన్ని నివారించాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లగా ఎలాంటి స్పందనా లేదన్నారు. ఈ వైఖరి మంచిది కాదని, ఒకసారి ఉత్పత్తికి అంతరాయం కలిగితే అది తీవ్ర నష్టాన్ని మిగులుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, కాంట్రాక్టు, పర్మినెంట్ కార్మికులు, వారి కుటుంబీకులు పాల్గొన్నారు.

సిరాజ్, సమీర్‌ల విచారణ

- ఉగ్ర కోణాలపై రెండో రోజు ప్రశ్నించిన అధికారులు

ప్రజాశక్తి-విజయనగరం కంటోన్మెంట్

ఉగ్ర కుట్ర కేసులో సిరాజ్, సమీర్‌లను రెండో రోజు శనివారం పోలీసులు విచారించారు. విజయనగరంలోని పోలీసు శిక్షణా కళాశాలలో ఇద్దరినీ వేర్వేరు బ్యారక్‌లలో ఉంచి విచారణ చేశారు. యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ఐఎన్‌ఎ సెంట్రల్ ఇంటెలిజెన్స్ పోలీసులు సిరాజ్, సమీర్లకు ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. అధికారులు అడిగిన కొన్ని ప్రశ్నలకు సిరాజ్, సమీర్‌లు సమాధానం చెప్పినట్లు సమాచారం. కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి ఇష్టపడలేదని తెలిసింది. విచారణ సమయంలో అధికారులు ఎదుట నాలుగు రోజులు ఆగి ఉంటే నేనంటే ఏమిటో తెలిసేదని సిరాజ్ సమాధానం చెప్పినట్లు సమాచారం. ఉగ్ర కోణాలపై ప్రశ్నలు అడిగినప్పుడు వారు సమాధానాలను దాట వేశారని తెలిసింది. అయితే, అధికారులు మాత్రం పూర్తిస్థాయిలో ఇద్దరి నుంచి సమాచారాన్ని రప్పించే పనిలో ఉన్నారు. దేశవ్యాప్తంగా ఎక్కడెక్కడ పేలుళ్లకు కుట్రలు చేశారన్న విషయాలపై ఆరా తీయగా సిరాజ్, సమీర్లు సమాధానం చెప్పేందుకు ఇష్టపడలేదని తెలిసింది. మరో ఐదు రోజులు వీరిని విచారించనున్నారు. విచారణ సమయంలో పోలీసు శిక్షణ కళాశాల వద్ద పోలీసులు పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అనుమతి ఉన్న అధికారులను, సిబ్బందిని మాత్రమే లోపలకు అనుమతిస్తున్నారు.

జిజిహెచ్ వైద్యులకు పేర్ని నాని క్షమాపణ చెప్పాల్సిందే

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీ మంత్రి పేర్ని నాని విజయవాడ జిజిహెచ్ వైద్యులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, జిజిహెచ్ సూపరింటెండెంట్, వైద్యులకు తక్షణమే క్షమాపణలు చెప్పాలని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఆరోగ్య పరీక్షలపై పేర్ని నాని చేసిన వ్యాఖ్యలను మంత్రి ఖండించారు.

కోకో, పొగాకు కంపెనీలకు
సిఎం ఆదేశాలు పట్టవా?

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలను కోకో, పొగాకు కంపెనీలు అమలు చేయడం లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర రెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కోకో, పొగాకు, మామిడి రైతులకు నష్టం కలగకుండా ఆయా కంపెనీల ద్వారా రైతుల పంటలను కొనుగోలు చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రులు, అధికారులను గురువారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో సిఎం ఆదేశించారని తెలిపారు.

కోకో గింజల కొనుగోలుపై కంపెనీల ప్రతినిధులు, రైతులు, రైతు సంఘాలతో ఏలూరులో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో చర్చలు జరిగాయని వివరించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజలను రూ.1050లకు కొనుగోలు చేస్తున్నాయని తెలిపారు. ఇక్కడి రైతుల నుంచి అవే కోకో గింజలను రూ.450లకు మించి కొనుగోలు చేసేది లేదని కంపెనీలు తెగేసి చెప్పాయని పేర్కొన్నారు. కంపెనీల ప్రతినిధులను మంత్రి బతిమాలాడటం తప్ప నిర్దిష్టమైన ధరకు కొనుగోలు చేయాలని గట్టిగా ఆదేశించలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. అయినా కంపెనీలపై ఎటువంటి చర్యలూ తీసుకోలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, ఇలా ప్రభుత్వం ఎందుకు ఉందో స్పష్టం చేయాలని కోరారు. పొగాకు పంటను తాము కొంటామని రైతులతో పండించిన కంపెనీలు ఇప్పుడు మొహం చాటేస్తున్నాయని తెలిపారు. రైతుల నుంచి కొనుగోలు చేయాలని ప్రభుత్వంగానీ, పొగాకు బోర్డు గానీ కంపెనీలపై ఒత్తిడి చేసి ఒప్పించలేకపోతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పర్యవేక్షణలో నడవాల్సిన కంపెనీలు, కంపెనీల దయాదాక్షిణ్యాలపై ప్రభుత్వ నిర్ణయం ఆధారపడి ఉందని అన్నారు. కోకో, పొగాకు, మామిడి రైతులకు ఊరటనిచ్చేలా, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

టిడిపిలో ఆధిపత్యపోరు

- అన్నదమ్ముల దారుణ హత్య

ప్రజాశక్తి-వెల్దుర్తి (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా వెల్దుర్తి మండల పరిధిలోని గుండ్లపాడు టిడిపిలో ఆధిపత్య పోరు పతాకస్థాయికి చేరింది. బైక్‌పై వెళ్తున్న అన్నదమ్ములను అదే పార్టీకి చెందిన మరో గ్రూపు స్కార్పియో వాహనంతో ఢీకొట్టి దారుణంగా హత్య చేసింది. ఈ సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంతకాలంగా గుండ్లపాడు గ్రామంలో టిడిపిలోని రెండు గ్రూపుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన తమ్ముడు కోటేశ్వరరావు కలిసి ద్విచక్ర వాహనంపై తెలంగాణలోని నక్కల గూడెం గ్రామంలో జరిగిన బంధువుల వివాహానికి హాజరయ్యారు. అనంతరం స్వగ్రామానికి తిరిగి వస్తుండగా బోదలవీడు-మండాది గ్రామాల మధ్య అదే గ్రామానికి చెందిన తోట వెంకటరామయ్య, జవిశెట్టి శ్రీనివాసరావు మరికొంత మందితో కలిసి ద్విచక్ర వాహనాన్ని స్కార్పియో వాహనంతో బలంగా ఢీకొట్టారు. అనంతరం మారణాయుధాలతో అన్నదమ్ములను హత్య చేశారు. జిల్లా ఎస్‌పి కంచి శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి డిఎస్‌పి హనుమంతరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన వాహనం టిడిపి నేత వెంకట్రామయ్యగా పోలీసులు నిర్ధారించారు. టిడిపిలోనే రెండు గ్రూపుల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు వల్ల ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నట్లు చెప్పారు. మాచర్ల టౌన్ సిఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోటేశ్వరరావు

వెంకటేశ్వర్లు

విజయవాడలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ

- ఏర్పాటు చేయాలని కెవిపిఎస్ విజ్ఞప్తి

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

అంబేద్కర్ ఓపెన్ యూనిర్సిటీని విజయవాడలో ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కెవిపిఎస్ కోరింది. ఈ మేరకు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామికి శనివారం లేఖ రాశారు. దూర విద్యలో వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల విద్యార్థులకు సౌకర్యంగా ఉండే విజయవాడలోనే అంబేద్కర్ స్మృతి వనంలో ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు విశ్వవిద్యాలయానికి రావాలన్న విజయవాడ ప్రధాన కేంద్రంగా ఉంటుందని ఆయన సూచించారు. స్మృతి వనంలో అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేసి కావాల్సిన సదుపాయాలను, యూనివర్సిటీ కార్యాకలపాలను కొనసాగించాలని కోరారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలపై స్పష్టత ఇవ్వాలి

- ఎపి టీచర్స్ గిల్డ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలపై స్పష్టత ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌ను ఆంధ్రప్రదేశ్ గిల్డ్ కోరింది. ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ప్రస్తుత కౌన్సెలింగ్‌లో సర్వీస్ పాయింట్లు, స్టేషన్ పాయింట్లు గురించి స్పందించాలని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి చిట్టిబాబు, ఎల్‌కె చిన్నప్ప శనివారం ఒక ప్రకటనలో కోరారు. జిఒ 50 ప్రకారం 2022 మార్చి నుంచి దశలవారీ ప్రభుత్వంలో ఎయిడెడ్ ఉపాధ్యాయులు విలీనమయ్యారని తెలిపారు.

'సుప్రీం' సిట్టింగ్ జడ్జితో విచారణ

- ఎన్‌కౌంటర్‌పై సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి యాదన్న

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిపిఐ మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావుతోపాటు 26 మందిని బూటకపు ఎన్‌కౌంటర్ చేసిన ఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి యాదన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడవులు, అటవీ సంపద, భూగర్భంలోని విలువైన ఖనిజ సంపదను స్వదేశీ, విదేశీ, కార్పొరేట్ వర్గాలకు కట్టబెట్టిందన్నారు.

శరవేగంగా మహానాడు ఏర్పాట్లు

- 13 కమిటీల ఆధ్వర్యంలో పనులు
- 29న ఐదు లక్షల మందితో బహిరంగ సభ
- 25న లోకేష్, 26న చంద్రబాబు రాక

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైఎస్ఆర్ కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని పబ్బాపురం సమీపంలో 27, 28, 29న నిర్వహించనున్న టిడిపి మహానాడు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. 145 ఎకరాల సువిశాల మైదానంలో వందలాది మంది కార్మికులు రాత్రింబవళ్లు మహానాడు ఏర్పాట్ల పనుల్లో నిమగ్నమై ఉన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు సవిత, జనార్ధన్‌రెడ్డి, ఆర్థిక, హోం తదితర మంత్రుల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చురుకైన టిడిపి కేడర్‌తో కూడిన 13 కమిటీలతో నిర్వహణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. మహానాడు వేదిక ఏర్పాటుకు ఇన్‌ఛార్జులుగా స్థానిక కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవికి అప్పగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు కానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లలో భాగంగా డిజిపి హరీష్‌కుమార్‌గుప్తా, కలెక్టర్, జెసి, ఎస్‌పి, రాయలసీమ జోన్ డిఐజి కోయ ప్రవీణ్ వంటి ఉన్నతాధికారులు మహానాడు వేదిక, సిఎం బస తదితర భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

27, 28వ తేదీల్లో నిర్వహించనున్న ప్రతినిధుల సభకు 23 వేల మందిని ఆహ్వానించారు. మొదటి రెండ్రోజులు రాయలసీమ అభివృద్ధి, రాష్ట్ర సమస్యలపై చర్చించి తీర్మానాలను ఆమోదించనున్నారు. 29న భారీ బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఐదు లక్షల మంది హాజరుకు సంబంధించిన ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఈ నెల 25న టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్, 26న టిడిపి రాష్ట్ర జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రానున్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, నంద్యాల వరదరాజులరెడ్డి, అమరనాధరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులు మీడియాతో మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి వైఎస్ఆర్ కడప జిల్లాలో రాష్ట్ర మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించలేదన్నారు. ఈ ఏడాది జిల్లాలో కనీవినీ ఎరగని రీతిలో 145 ఎకరాల సువి శాల మైదానంలో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా పేరు మార్మోగనుందని తెలిపారు. జిల్లా ప్రజల మనస్తత్వాన్ని గమనిస్తే ఫ్యాక్షన్ సంస్కృతి ఉందనే ప్రచారం ఒట్టిదని, అటువంటి సంస్కృతి ఆనవాళ్లే కనిపించడం లేదని, తమను సాదరంగా ఆదరిస్తున్నారని తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా టిడిపి నాయకత్వం చురుకుగా వ్యవహరిస్తోందని పేర్కొనడం గమనార్హం.

మహానాడును వాయిదా వేయండి

- కరోనా నేపథ్యంలో జెసికి వైసిపి నాయకుల వినతి

ప్రజాశక్తి - కడప

'ప్రజల ప్రాణాలు కాపాడండి. మహానాడు కార్యక్రమాన్ని వాయిదా వేయండి. లేదంటే ఇక్కడే పెద్ద ఎత్తున కరోనా విజృంభించే పరిస్థితి, ప్రమాదం నెలకొంటుంది' అని వైఎస్ఆర్ కడప జిల్లా జెసి అతిథిసింగ్‌కు వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా వినతిపత్రం అందజేశారు. అనంతరం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కరోనా కేసులు నమోదవుతున్నాయన్న విషయం టిడిపి వారికి తెలియదా? అని ప్రశ్నించారు. ఈ పరిస్థితుల్లో మహానాడును వాయిదా వేసుకోవడం మంచిదని సూచించారు. అధికారులు కూడా కరోనా గైడ్‌లైన్స్ కూడా ఇచ్చారని గుర్తు చేశారు. ఒక సంక్షేమ పథకం, ప్రాజెక్టును కూడా రాయలసీమకు తీసుకురాలేదని, అటువంటప్పుడు ఇక్కడ మహానాడు ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, నిత్యానందరెడ్డి, పాకా సురేష్, దాసరి శివ, బిహెచ్ ఇలియాస్, షఫీ, శ్రీరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో యోగాసనాలు వేసిన మంత్రులు అనిత, డోలా

రికార్డులను తిరగరాసేలా యోగా డే వేడుకలు

- మంత్రులు అనిత, బాల వీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా జూన్ 21న విశాఖ వేదికగా తలపెట్టిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను అట్టహాసంగా నిర్వహించాలని, గత రికార్డులను తిరగరాసేలా విజయవంతం చేయాలని విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత నిర్దేశించారు. విశాఖ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసేలా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా యోగా డేలో భాగస్వామ్యం కావాలని కోరారు. యోగా డే ఏర్పాట్లపై విశాఖ కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శనివారం జరిగిన సమన్వయ కమిటీ సమావేశానికి మంత్రులు హాజరై వివిధ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

తొలుత కలెక్టర్ మాట్లాడుతూ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సాధించాలంటే భాగస్వాములంతా ఒకే వేదికపై కొనసాగాలని, కనెక్టివిటీ తెగిపోకూడదని స్పష్టం చేశారు. ఆర్‌కె బీచ్ కాళీమాత టెంపుల్ నుంచి భీమిలి వరకు సుమారు 26.5 కిలోమీటర్ల మేర కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. ప్రధాన వేదిక కాళీమాత టెంపుల్ నుంచి వైఎంసిఎ వరకు ఉంటుందని, ఇక్కడ ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రులు సూచించారు.

బీచ్ రోడ్డులో యోగాసనాలు

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా విశాఖ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం శనివారం ఉదయం సాగర తీరంలో ప్రారంభమైంది. మంత్రులు అనిత, బాల వీరాంజనేయ స్వామి, ప్రభుత్వ విప్ గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, పలు శాఖల అధికారులు ఆర్‌కె బీచ్ రోడ్డులో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ యోగా ఆరోగ్యాన్ని చేకూరుస్తుందన్నారు.

సంస్మరించుకునే వారి జాబితాను సవరించాలి

- గురజాడ, కందుకూరి, గిడుగు, జాషువా పేర్లు చేర్చాలి
- భావ ప్రకటన స్వేచ్ఛను, మతసామరస్యాన్ని కాపాడుకోవాలి
- తెలుగు మీడియాన్ని సమాంతరంగా కొనసాగించాలి
- సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంస్మరించుకునే వారి జాబితాను సవరించాలని, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం, గిడుగు రామ్మూర్తి, గుర్రం జాషువా పేర్లను ఆ జాబితాలో చేర్చాలని సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి డిమాండ్ చేశారు. కర్నూలు టిజివి కళాక్షేత్రంలో ఆయన శనివారం విలేకరులతో ముఖాముఖిగా మాట్లాడారు. ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో ఆధునిక కవయిత్రుల్లో ఒక్కరి పేరు కూడా లేదన్నారు. కవులు, కార్టూనిస్టులు, పాత్రికేయులు ఏమి రాసినా సహించలేని లక్షణం పెరిగిపోతోందని, ఇది ఆమోదించలేని పరిణామమని తెలిపారు. భావ ప్రకటన, విమర్శనాత్మక స్వేచ్ఛ మీద దాడి ఆందోళన కలిగిస్తోందన్నారు. కర్నూలులో కవి వెంకటేశ్వర్లు కవిత రాస్తే పోలీసులు నిర్బంధించారని, ఎవరి పేరూ లేకున్నా దోపిడీ, అవినీతి అంటే మాదే అని ఎందుకు అనుకుంటున్నారని, సంకెళ్ల వేయాలని ఎందుకు అనుకుంటున్నారని ప్రశ్నించారు. భావ ప్రకటన, విమర్శనాత్మక స్వేచ్ఛను, మత సామరస్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరమన్నారు. భారతదేశం భిన్న మతాలు ఉన్న దేశమని, మధ్యప్రదేశ్ మంత్రి కల్నల్ సోఫియా ఖురేషీని ఉగ్రవాదుల సోదరి అని ఎలా అంటారని ప్రశ్నించారు. ఆయనపై ఏ చర్యలూ తీసుకోలేదని, దేశం గురించి ఉన్న మాట మాట్లాడినందుకు ఆశోక యూనివర్సిటీకి చెందిన అలీఖాన్ మహమ్మద్‌పై కేసు పెట్టారన్నారు. రాష్ట్రంలో ఇంగ్లీష్ మీడియం ఎవరూ వద్దనడం లేదని, తెలుగు మీడియాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలని కోరారు. మానవ హక్కుల గురించి అమిత్ షా మాట్లాడడంతో అందరూ షాక్ అయ్యారని, రాష్ట్రంలో కొత్త న్యాయ చట్టాలను సంపూర్ణంగా అమలు చేస్తే బాగుంటుందని అమిత్ షా సమీక్ష చేశారని తెలిపారు. ఏ సినిమా విడుదల చేస్తున్నా రాజకీయ వివాదం చేస్తున్నారని, హరిహరవీరమల్లు సినిమాపై హోం శాఖ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తామని చెబుతున్నారని, ప్రభుత్వపరంగా మంత్రి ఆదేశాలు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. రంగ స్థలాన్ని, షార్ట్ ఫిల్మ్‌లను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఆడిటోరియాలను పెట్టాలని, బాలల రంగస్థలాలను కూడా ప్రోత్సహించాలని కోరారు.

కర్నూలు విలేకరులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న తెలకపల్లి రవి

హైకోర్టు బెంచి ఇప్పటికీ ఎందుకు పెట్టలేదు

కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు అందరూ ఒప్పుకున్నారని, తరువాత బెంచి పెడతామని చెప్పారని తెలకపల్లి రవి గుర్తు చేశారు. ఇప్పటి వరకూ కర్నూలులో హైకోర్టు బెంచి ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. బనకచర్లకు నీళ్ల తేవాలంటే నిధులు కావాలి కదా? అన్నారు. న్యాయ విశ్వవిద్యాలయం వేరే చోట పెట్టాలని నిర్ణయించారని, సమతుల్యత కాపాడుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఎపిజిబి ప్రధాన కార్యాలయం అమరావతికి తీసుకెళ్లాల్సిన అవసరం ఏముందని, కడపలోనే ఉంచాలని కోరారు. సాంస్కృతిక అవశేషాలను, చిహ్నాలను కాపాడుకోవాలని, బెలుం గుహలు, కేతవరం గుహలపై దృష్టి పెట్టాలని కోరారు. ముఖాముఖిలో సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, జిల్లా గౌరవాధ్యక్షులు ఎంపి బసవరాజు పాల్గొన్నారు.

4న ప్రజావంచన దినం

- సూపర్ సిక్స్ పథకాలు ఎప్పటి నుంచి అమలు చేస్తారు?
- జగన్‌పై ఆరోపణలు ఆక్షేపనీయం : మాజీ మంత్రి బొత్స

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, సూపర్ సిక్స్ పథకాలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలని, ఉచిత బస్సు పథకం విధివిధానాలు వెల్లడించాలని టిడిపి కూటమి ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రజలకిచ్చిన హామీలను టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేయనందున జూన్ నాలుగున ప్రజావంచన దినంగా పాటిస్తున్నామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు, పథకాల అమలు తీరు, టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు గురించి, ప్రజలను ఎలా మోసం చూస్తున్నారో మూడు రోజుల క్రితం మీడియా సమావేశంలో తమ పార్టీ అధ్యక్షులు జగన్ వివరించారన్నారు. ఆయన లేవనెత్తిన అంశాలు గురించి సమాధానం ఎందుకు చెప్పకుండా సంబంధం లేని విషయాలపై మాట్లాడుతూ తమ పార్టీ అధ్యక్షుడిపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మద్యం విషయంలో రేట్లు వ్యత్యాసం ఉందని, దాని గురించి టిడిపి నాయకులెవరూ సమాధానం ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో లేవని విమర్శించారు. దేశ చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా ఏప్రిల్, మే నెలల ఉపాధి వేతనాలు కార్మికులకు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. పొగాకు, ధాన్యం, టమోటా, మామిడి పంటలకు గిట్టు బాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విశాఖ రుషికొండపై ఉన్న భవనాలను మానసిక ఆస్పత్రికి ఇవ్వాలని అశోక్ గజపతి రాజు చేసిన వ్యాఖ్యలపై మీడియా ప్రతినిధులు అడిగిన ఓ ప్రశ్నకు... అశోక్ గజపతిరాజు మైండ్‌సెట్‌కు ఆ వ్యాఖ్యలు నిదర్శనమని విమర్శించారు.

ఎండియు వ్యవస్థ రద్దుతో ఆదివాసీలకు ఇక్కట్లు

- దూర ప్రాంతాలకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సిందే..
- వ్యాన్ ద్వారా సరుకులను ఇంటి వద్దకే తెచ్చి ఇవ్వాలని కోరుతున్న గిరిజనం

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి జిల్లా)

టిడిపి కూటమి సర్కారు అన్నంత పనీ చేసింది. ఎండియు వ్యవస్థ ద్వారా ఇంటింటికీ రేషన్ సరఫరాకు ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంతో మంగళం పాడేసింది. ఈ నిర్ణయంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఆదివాసీలకు రేషన్ కష్టాలు మళ్లీ మొదటకే రానున్నాయి. డిపోల నుంచి రేషన్ సరుకులను తీసుకుని, నెత్తిన పెట్టుకుని దూర ప్రాంతాల్లోని వారి గ్రామాలకు కాలినడకన వెళ్లాల్సిందే. గిరిజన ప్రాంతాల్లో రేషన్ డిపోల ద్వారా బియ్యం సరఫరా వ్యవస్థ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర స్త్రీ శిశు, సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి గత ఏడాది ప్రకటించారు. అప్పట్లో ఆమె నిర్ణయాన్ని గిరిజనులు తీవ్రంగా వ్యతిరేకించారు ఇంటింటికీ ఎండియు వాహనాల ద్వారా రేషన్ సరఫరా కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీంతో అప్పట్లో ప్రభుత్వం వెనక్కితగ్గింది. కొన్ని మాసాలపాటు ఎండియు వ్యవస్థపై మిన్నకున్న టిడిపి కూటమి ప్రభుత్వం ఇప్పుడు డిఆర్ డిపోల ద్వారానే రేషన్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టింది. వచ్చే నెల నుంచి డిపోల ద్వారా సరుకులు సరఫరాపై ప్రభుత్వం నుంచి పౌరసరఫరాల శాఖ, గిరిజన సహకార సంస్థ అధికారులకు సంకేతాలు అందాయి.

ఎండియు వ్యవస్థతో మేలు

అల్లూరి జిల్లాలోని డిఆర్ డిపోల పరిధిలో రోడ్డు సౌకర్యం ఉన్న గ్రామాలకు ఎండియు వాహనాల ద్వారా సరుకులు సరఫరా చేయడంతో చాలామంది లబ్ధిదారులకు వ్యయ ప్రయాసలు తగ్గాయి. గత నాలుగేళ్లలో ఆయా ప్రాంతాల్లోని లబ్ధిదారులు ఇంటింటికీ రేషన్ సరఫరాపై సంతృప్తి చెందారు. అయితే ఈ ఎండియు వాహనాలను నిలిపివేయనుండటంతో మళ్లీ డిపోలకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలంటే కాలినడక ప్రయాస, మోత భారం తప్పవని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఎండియు వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరఫరా చేపట్టక మునుపు డిఆర్ డిపోల ద్వారా రేషన్ సరఫరా చేసినప్పుడు తమ గ్రామాల నుంచి సుమారు ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉండే గ్రామాలకు వెళ్లి కాలినడకన రేషన్ సరుకులు మోసుకుని తెచ్చుకునేవారిమని, చాలా వ్యయ ప్రయాసలకు

ఎండియు వాహనాల నుంచి రేషన్ తీసుకుంటున్న గిరిజనులు (ఫైల్)

ఎదుర్కొనేవారిమని పలు గ్రామాల గిరిజనులు గుర్తుచేసుకుంటున్నారు. గత వైసిపి ప్రభుత్వం రేషన్ సరుకుల సరఫరాకు 2021 నుంచి ఎండియు వాహనాల సేవలను అందుబాటులోకి తేవడంతో తమకెంతో సౌలభ్యం చేకూరిందని వారు తెలిపారు. వాస్తవానికి అల్లూరి జిల్లాలోని 22 మండలాల్లో రోడ్డు సౌకర్యం ఉన్న గ్రామాలలో 2,98,092 మంది రేషన్ కార్డుదారులకు 221 మొబైల్ డిస్పెన్సివ్ యూనిట్స్ (ఎండియు) వాహనాల ద్వారా ఇంత వరకూ సరుకుల సరఫరా జరిగింది. ఇప్పుడు మళ్లీ పాత పద్ధతిలో రేషన్ సరఫరా చేస్తే పాడేరు డివిజన్‌లోని 336 డిపోలు, చింతపల్లి డివిజన్‌లోని 156 డిపోల పరిధిలో ఉండే వందలాది గ్రామాల గిరిజనులు అవస్థలు పడనున్నారు.

మాకు రేషన్ వ్యాన్‌తో తెచ్చిస్తేనే బాగు

వ్యాన్ ద్వారా రేషన్ బియ్యం తెచ్చిస్తేనే బాగుంటుంది. మా ఊరిలో 20 కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం మాకు రోడ్డు సౌకర్యం లేదు. మాకు దగ్గరలోని అల్లంపుట్టు గ్రామం వరకు వ్యాన్‌లో తెచ్చి బియ్యం ఇస్తున్నారు. ఇప్పుడు వ్యాన్లను తీసేస్తే మా ఊరి వారిమంతా ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గంపరాయి డిపోకు వెళ్లి గతంలో మాదిరిగా రేషన్ తెచ్చుకోవాలి. మాకు ఆటోకు వంద రూపాయల ఖర్చు అవుతుంది ఒక పూటంతా రేషన్ కోసం మేం పని మానుకొని కాచుకుని ఉండాలి. ప్రభుత్వం మా సమస్యను గుర్తించి వ్యాన్ ద్వారా మునుపటిలా రేషన్ సరుకులు అందించాలని కోరుతున్నాను.

కొర్రా సింహాచలం, జామిగుడ గ్రామం, గంపరాయి పంచాయతీ, పెదబయలు మండలం

కాలినడకన వెళ్లి మోసి తెచ్చుకోవాలి

ఎండియు వాహనాలు రాకుంటే మా పంచాయతీ కేంద్రం డోకులూరులో ఉన్న డిపోకు రెండు కిలోమీటర్లు మేర నడిచి వెళ్లి సరుకులు తెచ్చుకోవాలి. మా ప్రాంతంలో ఆటోలు తిరగవు. వ్యాన్ ద్వారా తెచ్చి ఇచ్చినప్పుడు మాకు ఎంతో ప్రయాస తగ్గింది. ఇప్పుడు మళ్లీ మేం బరువు మోయాల్సిందే. డిపోకెళ్లి బియ్యం తెచ్చుకోవడానికి ఒక పూట పని మానుకోవాలి.

కిల్లో ముత్తమ్మ, మర్రిపాలెం గ్రామం, డోకులూరు పంచాయతీ, పాడేరు మండలం

2, 3, 4 తేదీల్లో ధర్నాలు

- కౌలు రైతు సంఘం పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి కౌలు రైతుకూ రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూన్ 2, 3, 4 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ధర్నాలకు పిలుపునిచ్చింది. ఈ తేదీల్లో తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌలు చట్టంలో మార్పులు తీసుకొచ్చి కౌలు రైతులందరికీ అమలు చేస్తామని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో వ్యవసాయశాఖ మంత్రి ప్రకటించారని గుర్తుచేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో సొంత భూమి కలిగిన రైతుల వివరాలనే ప్రభుత్వం సేకరిస్తోందని తెలిపారు. కౌలు రైతుల వివరాలు సేకరించకపోవడంతో ప్రభుత్వ కుట్ర ఉందనే అనుమానం వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. ఈ ఏడాది వ్యవసాయ సీజన్ ముందుకు జరుగుతుందని, వర్షాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. కాబట్టి అన్నదాత సుఖీభవ నిధులు వెంటనే కౌలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. వైసిపి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించిన కూటమి ప్రభుత్వం పాత కౌలు చట్టాన్నే అమలు చేయడం చూస్తే మాటలు కోటలు దాటుతున్న ఆచరణ గడప దాటనట్టుగా ఉందని విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని గత ప్రభుత్వంలా ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు ఇచ్చి ఒసిలకు ఎగ్గొడతారా? అని ప్రశ్నించారు. ఒక భూ యజమాని దగ్గర ఉన్న కౌలు చేస్తున్న అందరికీ ఇస్తారా? ఒక్కరికే ఇస్తారా? వంటి సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్నదాత సుఖీభవకు సంబంధించిన విధి విధానాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెట్టుబడి సాయం రూ.20 వేలు ఆలస్యమవుతున్న కొద్దీ కౌలు రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తుల కబంధ హస్తాల్లో చిక్కుకుపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా కౌలు రైతులను గుర్తించి అమలు చేయాలని కోరారు.

కోనసీమలో కరోనా కేసు

- కోవిడ్ టెస్ట్‌తో కె.గంగవరంలో వెలుగులోకి

ప్రజాశక్తి - రామచంద్రపురం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కరోనా కేసు కలకలం రేపింది. కె.గంగవరం మండలం సత్యవాడ గ్రామానికి చెందిన ఓ వృద్ధుడుకి కరోనా పాజిటివ్‌గా ర్యాపిడ్ టెస్టులో నిర్ధారణ కావడంతో ఆర్‌టిపిసిఆర్ పరీక్ష కోసం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆర్‌టిపిసిఆర్ పరీక్షలోనూ కరోనా నిర్ధారణ కావడంతో వారిద్దరినీ ఐసోలేషన్ వార్డులో ఉంచి వైద్యం అందిస్తున్నారు. సత్యవాడకు చెందిన వృద్ధుడు అనారోగ్యానికి గురవ్వడంతో తన భార్యతో కలిసి ద్రాక్షారామంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి చికిత్స కోసం శుక్రవారం రాత్రి వెళ్లారు. దగ్గు, జలుబు, జ్వరం వంటి లక్షణాలు ఉండడంతో ఆస్పత్రి వైద్యులు ఆయనకు కరోనా పరీక్షలు నిర్వహించారు. ర్యాపిడ్ టెస్ట్‌లో కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో భార్యా భర్తలను కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలోని ఐసోలేషన్ వార్డులో ఉంచి వైద్యం అందిస్తున్నారు. ఆయన భార్యకు ఎటువంటి కరోనా లక్షణాలు లేవని, ఆరోగ్యంగానే ఉన్నారని వైద్యులు తెలిపారు. కరోనా కలకలం నేపథ్యంలో సత్యవాడ గ్రామంలో అధికారులు అప్రమత్తమయ్యారు. నివాస ప్రాంతంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామచంద్రపురం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ సూచించారు.

ఆ ముగ్గురు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోండి

- అడిషనల్ ఎస్‌పిని కోరిన అనంత జడ్‌పి చైర్‌పర్సన్

ప్రజాశక్తి - అనంతపురం

తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించిన టిడిపి ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్ రాజు, దగ్గుపాటి ప్రసాద్, ఇతర నాయకులపై చర్యలు తీసుకోవాలని ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్‌పి చైర్‌పర్సన్ గిరిజమ్మ కోరారు. ఈ మేరకు వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి సాకే శైలజానాథ్, కళ్యాణదుర్గం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య, వైసిపి పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డితో కలిసి శనివారం

అడిషనల్ ఎస్‌పిని కలిసి బయటకు వస్తున్న వైసిపి నాయకులు

అడిషనల్ ఎస్‌పి రమణమూర్తికి ఫిర్యాదు అందజేశారు. అనంతరం మీడియాతో గిరిజమ్మ మాట్లాడుతూ.. ఈ నెల 21న ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం సందర్భంగా మడకశిర, కళ్యాణదుర్గం, అనంతపురం ఎమ్మెల్యేలు ఎంఎస్.రాజు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి ప్రసాద్‌లు అనుమతి లేకుండా ఛాంబర్‌లోకి వచ్చి తన పట్ల, అధికారుల పట్ల దురుసుగా ప్రవర్తించారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో తన కార్యాలయంలో ఉందన్న సాకుతో అకారణంగా తన పట్ల ముగ్గురు ఎమ్మెల్యేలు దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

ఇపిఎఫ్ వడ్డీ రేటు ఖరారు

న్యూఢిల్లీ : ఇపిఎఫ్ నిల్వలపై వడ్డీ రేటును కేంద్రం ఖరారు చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 8.25 శాతంగా నోటిఫై చేసింది. ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఒ) సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ కొన్ని రోజుల క్రితం ప్రతిపాదించిన వడ్డీ రేటును యథాతథంగా కేంద్రం ఆమోదించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి కూడా ఇదే వడ్డీని చెల్లించిన సంగతి తెలిసిందే. కేంద్రం వడ్డీని నోటిఫై చేసిన నేపథ్యంలో త్వరలో ఏడు కోట్ల మంది చందాదారుల ఖాతాల్లో వడ్డీ జమకానుంది.

బ్యాలెన్స్ చెక్ ఇలా..

పిఎఫ్ వడ్డీ మీ అకౌంట్‌లో జమ అయ్యిందో లేదో చెక్ చేసుకోవడంతోపాటు ఖాతాలో నిల్వల వివరాల కోసం ఉమాంగ్ యాప్‌ను సందర్శించొచ్చు. రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌తో లాగిన్ అయ్యాక యాప్‌లో ఇపిఎఫ్ఒ సర్వీసెస్ విభాగంలోకి వెళితే యుఎఎన్, ఒటిపి ఎంటర్ చేయాలి. ఆపై బ్యాలెన్స్, పాస్‌బుక్ వంటి వివరాలు కనిపిస్తాయి. ఇపిఎఫ్ఒ పోర్టల్ www.epfindia.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి యుఎఎన్, పాస్‌వర్డ్ ఎంటర్ చేయాలి. తర్వాత మెంబర్ పాస్‌బుక్‌ను ఎంపిక చేసుకుని వివరాలు పొందొచ్చు. మీ రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్ నుంచి 9966044425 నెంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వడం ద్వారా కూడా పిఎఫ్ బ్యాలెన్స్ వివరాలు తెలుసుకోవచ్చు. ఈ నెంబర్‌కు కాల్ చేయగానే ఆటోమెటిక్‌గా కాల్ డిస్‌కనెక్ట్ అవుతుంది. కాసేపటి తర్వాత పిఎఫ్ బ్యాలెన్స్ ఎస్ఎంఎస్ రూపంలో వస్తుంది.

తిరుమలలో పారదర్శకంగా సాంకేతిక సేవలు

- 'డయల్ యువర్ ఇఒ'లో శ్యామలరావు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టిటిడిలో మరింత పారదర్శకంగా సాంకేతిక సేవలను అమలు చేయనున్నట్లు ఇఒ జె.శ్యామలరావు వెల్లడించారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శనివారం జెఇఒ వెంకన్నచౌదరితో కలిసి డయల్ యువర్ ఇఒ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 35 మంది యాత్రికులు అడిగిన పలు ప్రశ్నలకు ఇఒ సమాధానమిచ్చారు. టిటిడి అందిస్తున్న సౌకర్యాలు, చేపట్టిన సంస్కరణలను పలువురు యాత్రికులు అభినందించారు. త్వరలో టిటిడి నేత్రదాన ట్రస్టు ఏర్పాటుపై అరవింద్ కంటి ఆస్పత్రితో చర్చలు జరుపుతున్నామని కావలి నుంచి ఓ యాత్రికుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఇఒ వెల్లడించారు.

డిఎస్సీ ప్రత్యేకం-ఎస్‌ఎ/ఎస్‌జిటి

విద్యా మనోవిజ్ఞానశాస్త్రం - స్కిన్నర్ సిద్ధాంతాలు

కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

స్కిన్నర్ ప్రకారం

ప్రతిస్పందనలు/ప్రతిచర్యలు 2 రకాలు,

1. ఉద్దీపన ప్రతిస్పందనలు:

- ఉద్దీపనలు ఎదురుగా ఉండడం వల్ల జీవి ప్రతిస్పందనలు ఇస్తుంటే అలాంటి వాటిని **"ఉద్దీపనా ప్రతిస్పందనలు"** అంటారు. వీటినే "రాబట్టబడిన ప్రతిస్పందనలు" (నిర్గమాలు) అంటారు.

ఉదా :

పావ్‌లోవ్ ప్రయోగం

నోట్ : ప్రయోగంలో ఆహారం అనే ఉద్దీపన ఎదురుగా కనిపించడం వల్లనే కుక్కలో లాలాజలం అనే ప్రతిస్పందన కనిపించింది.

2. నిరుద్దీపన ప్రతిస్పందనలు:

- ఉద్దీపన ఎటదురుగా లేకపోయినా కూడా జీవి ప్రతిస్పందనలు ఇస్తున్నట్లయితే అలాంటి వాటిని "నిరుద్దీపన ప్రతిస్పందనలు" అంటారు. వీటినే "వదిలివేయబడిన ప్రతిస్పందనలు (ఉద్గమాలు)" అంటారు.
- స్కిన్నర్ ఈ నిరుద్దీవనా ప్రతిస్పందనల ఆధారంగా తన సిద్ధాంతాన్ని ప్రకటించారు.

"ఉద్దీవన ఎదురుగా లేకపోయినా కూడా జీవి కొన్ని ప్రతిస్పందనలు ఇస్తూ ఉంటుంది. అయితే ఆ ప్రతిస్పందనలలో ఉపయోగకరమైన ప్రతిస్పందన (మంచి ప్రవర్తన) కనబరచినపుడు వెంటనే తగిన ఉద్దీపనను (బహుమతి లేదా అభినందన) పునర్బలనంగా అందిస్తే ప్రతిస్పందనకు, ఉద్దీపనకు మధ్య సంసర్గం ఏర్పడి ఆ ప్రతిస్పందనతో కూడిన ప్రవర్తన బలపడి అది ఒక కార్యసాధక ప్రవర్తనగా మలచబడుతుంది. అని స్కిన్నర్ నిరూపించారు.

స్పిన్నర్ ప్రయోగ వివరణ:

- ఈ ప్రయోగ నిరూపణకుగాను స్కిన్నర్ ఒక ప్రత్యేక పరికరంతో కూడిన పేటికను తయారుచేసుకుని అందులో సహజ ఉద్దీపనైన ఆహారం కనిపించకుండా ఉంచి మీటను నొక్కినపుడు మాత్రమే ఆహారం బయటకు వచ్చే విధంగా ఏర్పాటు చేశాడు. దీనికి "స్కిన్నర్ బాక్స్" అని పేరు పెట్టాడు. ఇందులో ఎలుక/పావురం ఆ పరికరంకు ఉన్న మీటను నొక్కినప్పుడల్లా పునర్బలన ఉద్దీపనైన ఆహారం అందేటట్లు చూడటం ద్వారా ఆ చర్యను ఆ జీవులు అనేకసార్లు చేసి మీటను నొక్కి ఆహారాన్ని పొందే స్వయంచాలక అభ్యసనాన్ని చేయగలిగాయి. ఈ ప్రవర్తననే "కార్యసాధక ప్రవర్తన" అంటారని సిన్నర్ పేర్కొన్నాడు. ఈ నిబంధనలలో ప్రతిస్పందనకు ప్రాధాన్యత ఉండడం వల్ల దీనిని R-type నిబంధనం అని అన్నారు.

Note:

- ఎందుకంటే ఇక్కడ ఆ రకమైన మీటను నొక్కే ప్రతిస్పందన ఉంటేనే ఆహారమనే ఉద్దీపన పునర్బలనంగా లభిస్తుంది.

ఈ ప్రయోగంలో:

మీట నిబంధిత ఉద్దీపన
మీటను నొక్కడం నిబంధిత ప్రతిస్పందన
ఆహారం సహజ ఉద్దీపన
ఆహారం తినడం సహజ ప్రతిస్పందన

- ఈ ప్రయోగంలో మీటను నొక్కే ప్రతిస్పందనను కనబర్చినప్పుడల్లా సహజ ఉద్దీపనైన ఆహారం లభిస్తూ ఉండేది. తద్వారా ప్రతిస్పందనకు ఉద్దీపనకు మధ్య సంసర్గం ఏర్పడింది. (R-S సంసర్గం) ఆ మీటను నొక్కే కార్యసాధక ప్రవర్తన ఎలుకలలో/పావురాళ్లలో

బలపడిపోయింది.

- అనగా నిరుద్దీపనా ప్రతిస్పందనలలో కోరుకున్న ప్రతిస్పందన కనిపించినపుడు తగిన ఉద్దీపనతో పునర్బలనం చెయ్యటం ద్వారా ఆ ప్రవర్తన బలపడితే దానిని "కార్యసాధక నిబంధనా అభ్యసనం" అంటారు.

Hint : శిశువుల్లో ఏదైనా మంచి ప్రవర్తన కనబడినపుడు వెంటనే ఏదేని సహజ ఉద్దీపనతో పునర్బలనం చేస్తే ఆ ప్రవర్తన బలపడి అది క్రమేపి ఒక అలవాటుగా మారిపోతే



అది "కార్యసాధక నిబంధనా అభ్యసనం" అవుతుంది.

-ఉదా:

అనువర్తనాలు:

1. అంధుడైన వృద్ధుడిని రోడ్డు దాటించిన విద్యార్థిని ఉపాధ్యాయుడు వెంటనే అభినందించాడు. దానిని నిబంధనం చేసుకొన్న విద్యార్థి అలాంటి మంచి పనులను మళ్లీ మళ్లీ చేస్తూ దానిని ఒక అలవాటుగా చేసుకున్నాడు. ఈ ప్రవర్తనను వివరించే అభ్యసనా సిద్ధాంతం- కార్యసాధక నిబంధనా సిద్ధాంతం
2. ఈనాడు మ్యాగజైన్లో అంకెలను కలిపితే బొమ్మ వచ్చే సమస్యను పూర్తిచేసి 5 సం॥ల పిల్లవాడు దానిని తన నాన్నకు చూపించగా ఆయన పిల్లవాడిని అభినందించి రూ.1 బహుమతిగా ఇచ్చాడు. దానిని నిబంధనం చేసుకున్న పిల్లవాడు అలాంటి బొమ్మలను తరచుగా గీస్తూ నాన్న నుండి అభినందనలను పొందుతూ క్రమంగా బొమ్మలు గీయటం ఒక అలవాటుగా మార్చుకున్నాడు. దీనిని వివరించే అభ్యసనా సిద్ధాంతం- కార్యసాధక నిబంధనా సిద్ధాంతం.

Note: ఒక ఉద్యోగి ఒక నెలలో సేల్స్ ఎక్కువగా చేసినపుడు యాజమాన్యం ఇచ్చే ఇన్సెంటివ్స్ అలానే ఒక ఉపాధ్యాయుడు బోధనలో మంచి ప్రదర్శనను ఇచ్చినప్పుడు గవర్నమెంట్ ఇచ్చే అవార్డులు వారిలో కార్యసాధక ప్రవర్తనను బలపరుస్తాయి.

కార్యసాధక నిబంధనంలో

1. జీవి క్రియాత్మకము
2. వదిలివేయబడిన ప్రతిస్పందనలు (ఉద్గమాలు) ఉంటాయి.
3. ప్రతిస్పందనకు - ఫలితానికి (ఉద్దీపన) మధ్య సంసర్గం ఏర్పడుతుంది. (R-S సంసర్గము).
4. ప్రతిస్పందనకు ప్రాధన్యత ఉంటుంది. కనుక దీనిని R-type నిబంధనం అంటారు.
5. నిబంధనము థారన్ డైక్ ప్రతిపాదించిన ఫలిత నియమంపై ఆధారపడి ఉంటుంది.

పునర్బలనము:

స్కిన్నర్ ప్రకారం పునర్బలనాలు 2 రకాలు..

1. ధనాత్మక/అనుకూల పునర్బలనములు

- విద్యార్థి యొక్క మంచి ప్రవర్తనను ప్రోత్సహించడానికి ప్రవేశపెట్టే పునర్బలనాలనే "ధనాత్మక పునర్బలనాలు" అంటారు.

ఉదా : గ్రేడులు, ర్యాంకులు, అవార్డులు, రివార్డులు, బహుమతులు, పొగడ్త మొ॥వి.

2. ఋణాత్మక / ప్రతికూల పునర్బలనాలు:

- విద్యార్థి యొక్క చెడ్డ ప్రవర్తనను తొలగించడానికి లేదా అణచివేయడానికి ప్రవేశపెట్టే పునర్బలనాలను "ఋణాత్మక పునర్బలనాలు" అంటారు.

ఉదా :

శిక్షలు, దండనలు, విమర్శలు, తిట్టడం మొ॥వి.

అభ్యసనా స్థితిని బట్టి, అభ్యాసకుల వయస్సును బట్టి పునర్బలనాలను ప్రవేశపెట్టాలని దానికి సంబంధించి సిన్నర్ **4 రకాల పునర్బలన నియమాలను ప్రతిపాదించాడు. అవి**

1. నిరంతర పునర్బలన నియమం
2. స్థిరకాల పునర్బలన నియమం
3. స్థిర నిష్పత్తి పునర్బలన నియమం / స్థిర అంతర పునర్బలన నియమం
4. చరశీలతా పునర్బలన నియమం

Note: స్కిన్నర్ ప్రయోగంలో పునర్బలన ఉద్దీపనలను- స్వతంత్ర చరం అని, ప్రతిస్పందనా రేటును పరతంత్ర చరం అని అంటారు.

1. నిరంతర పునర్బలన నియమం:

- అభ్యసనా సన్నివేశంలో పాల్గొన్న విద్యార్థికి సరైన ప్రతిస్పందన ఇచ్చినప్పుడల్లా ప్రతిసారీ ఏదో ఒక ఉద్దీపనను పునర్బలనంగా అందిస్తూ ఉండాలి అని ఈ నియమం వివరిస్తుంది.

ఉదా: బాటియా ప్రజ్ఞామాపనిలో పాల్గొన్న విద్యార్థికి చక్కగా తయారుచేసిన ప్రతి నమూనాకు ఉపాధ్యాయుడు ఏదో ఒక బహుమతిని ఇస్తూ ఉన్నాడు. ఈ చర్య స్కిన్నర్ యొక్క ఏ పునర్బలన నియమాన్ని బలపరుస్తుంది - నిరంతర పునర్బలన నియమం

2. స్థిరకాల పునర్బలన నియమం :

- అభ్యసన సన్నివేశంలో పాల్గొన్న విద్యార్థికి సరైన అన్ని ప్రతిస్పందనలకి కాకుండా నిర్ణీత కాలవ్యవధికి ఒక్కసారి ఏదో ఒక ఉద్దీపనను పునర్బలనంగా అందిస్తూ ఉండాలని ఈ నియమం వివరిస్తుంది.

ఉదా : భాటియా ప్రజ్ఞామాపనిలో పాల్గొన్న విద్యార్థికి నమూనాలు చక్కగా తయారు చేస్తున్నపుడు ప్రతి 15 ని॥కి ఒకసారి విద్యార్థిని ఉపాధ్యాయుడు అభినందిస్తూ ఉన్నాడు. ఇందులో ఉపాధ్యాయుడి చర్యను వివరించు పునర్బలన నియమం - స్థిరకాల పునర్బలన నియమం

3. స్థిర నిష్పత్తి/స్థిర అంతర పునర్బలన నియమం :

- అభ్యసనా సన్నివేశంలో పాల్గొన్న విద్యార్థికి సరైన అన్ని ప్రతిస్పందనలకు కాకుండా నిర్ణీత సంఖ్యలో చేసిన ప్రతిస్పందనలకు ఏదో ఒక ఉద్దీపనను పునర్బలనంగా అందిస్తూ ఉండాలని ఈ నియమం వివరిస్తుంది.

ఉదా : భాటియా ప్రజ్ఞా మాపనిలో పాల్గొన్న విద్యార్థికి సరిగా తయారుచేసిన ప్రతి 5 నమూనాలకు ఒకసారి ఉపాధ్యాయుడు విద్యార్థిని అభినందిస్తున్నాడు. ఇందులో ఉపాధ్యాయుడి చర్యను ఏ పునర్బలన నియమాన్ని బలపరుస్తుంది- స్థిర నిష్పత్తి/స్థిర అంతర పునర్బలన నియమం

4. చరశీలతా పునర్బలన నియమం :

- అభ్యసనా సన్నివేశంలో పాల్గొన్న విద్యార్థికి అస్థిర కాల వ్యవధుల్లోలలో, అస్థిర ప్రతిస్పందనల సంఖ్యకు ఏదో ఒక ఉద్దీపనను పునర్బలనంగా అందిస్తూ ఉండాలని ఈ నియమం వివరిస్తుంది.

ఉదా : భాటియా ప్రజ్ఞా మాపనిలో పాల్గొన్న విద్యార్థికి అన్ని -నమూనాలు చక్కగా తయారు చేస్తున్నప్పటికి ఎప్పుడో ఒక్కసారి మాత్రమే ఉపాధ్యాయుడు విద్యార్థిని అభినందిస్తున్నాడు. దీనిని వివరించే పునర్బలన నియమం చరశీలతా పునర్బలన నియమం

కార్యక్రమయుత అభ్యసనం:

- కార్యసాధక నిబంధన ఫలితంగా స్కిన్నర్ బోధనలో ప్రవేశపెట్టిన నూతన పద్ధతే **"కార్యక్రమయుత అభ్యసనం".**
- ఈ అభ్యసనంలో భాగంగా బోధించాల్సిన విషయాన్ని చిన్న భాగాలుగా విడగొట్టి వివిధ చట్రాల్లో (frames) అమరుస్తారు. దీనిలో అభ్యాసకుడే స్వయంగా అభ్యసనా అంశాలను అర్థం చేసుకుని నేర్చుకోవాల్సివుంది. (స్వీయ అభ్యసనం)
- ఇందులో ఉపాధ్యాయుడు కేవలం సలహాదారుడు, పర్యవేక్షకుడు మాత్రమే (బోధకుడు కాదు)

కార్యక్రమయుత అభ్యసనంలో

1. స్వీయ అభ్యసనం జరుగుతుంది.
2 విద్యార్థి కేంద్రీకృత అభ్యసనం జరుగుతుంది.
3. అభ్యాసకుడు క్రియాత్మకంగా పాల్గొంటాడు.
4. తక్షణ మూల్యాంకనం జరుగుతుంది.
5. తక్షణ ఫలితం ఉంటుంది
6. వైయక్తిక భేదాలకు ప్రాధాన్యత ఉంటుంది

Note: బోధనా యంత్రాలను మొదట అమెరికాకు చెందిన J.L. ప్రెస్సీ అనే శాస్త్రవేత్త రూపొందించారు. కాని వాటిని సాంకేతికంగా అభివృద్ధి పరచి తన కార్యక్రమయుత అభ్యసనంలో భాగంగా స్కిన్నర్ ఉపయోగించుకున్నారు.

శాస్త్రీయ నిబంధనం

1. రష్యాకు చెందిన పావ్‌లోవ్ ప్రతిపాదించారు
2. ప్రయోగ జీవి-కుక్క
3. అసహజ ఉద్దీపనకి, సహజ ఉద్దీపనికి మధ్య సంసర్గం ఏర్పాటవుతుంది
4. S-type నిబంధనం/ ఉద్దీపనా ప్రాధాన్యతా నిబంధనం
5. నిబంధన "సామీప్యతా నియమం"పై ఆధారపడివుంటుంది
6. జీవి నిష్క్రియాత్మకం
7. ప్రతి స్పందన లేకపోయినా ఉద్దీపన అందించబడుతుంది
8. ఉద్దీపన ప్రతి చర్యలు/రాబట్టబడిన ప్రతిస్పందనలుంటాయి

కార్యసాధక నిబంధనలు

1. అమెరికాకు చెందిన స్కిన్నర్ ప్రతిపాదించారు
2. ప్రయోగ జీవులు-ఎలుకలు/పావురాళ్లు
3. ప్రతి స్పందనలకి, ఫలితం (ఉద్దీపన)కు మధ్య సంసర్గం ఏర్పాటవుతుంది.
4. R-type నిబంధనం/ప్రతి స్పందనా ప్రాధాన్యత నిబంధనం
5. నిబంధన "ఫలిత నియమం"పై ఆధారపడివుంటుంది
6. జీవి క్రియాత్మకం
7. ప్రతి స్పందన ఉంటేనే ఉద్దీపన లభిస్తుంది
8. నిరుద్దీపనా ప్రతిచర్యలు/వదిలివేయబడిన ప్రతిస్పందనలు ఉంటాయి.

యత్నదోష అభ్యసన సిద్ధాంతం

ఇతర పేర్లు:

1. సంధాన సిద్ధాంతం
2. బంధ సిద్ధాంతం
3. S-R సిద్ధాంతం
4. ప్రేరణ ప్రాధాన్యతా సిద్ధాంతం
5. విజయ పథావరణ రీతి అభ్యసనము.

- యత్న-దోష అభ్యసనా సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు.- E.L. **థారన్‌డైక్ (అమెరికా)**

Note : వీరిని "జంతు మనోవిజ్ఞాన శాస్త్ర పితామహుడు" (Father of Animal Psychology)గా పిలుచుకుంటారు.

- వీరు ప్రజ్ఞపై, అభ్యసనంపై విస్తృతమైన ప్రయోగాలు చేశారు.

వీరు రచించిన గ్రంథాలు :

1. యానిమల్ ఇంటెలిజెన్స్-యాన్ ఎక్స్ పర్మెంటల్ స్టడీస్
2. మెజర్‌మెంట్ ఆఫ్ ఇంటెలిజెన్స్
3. సైకాలజీ ఆఫ్ లెర్నింగ్

యత్న-దోష అభ్యసనం:

- ఏదైనా ఒక క్రొత్త విషయం నేర్చుకోవడం ఒక్కసారిగా కష్టసాధ్యం అని అనేక ప్రయత్నాలు చేయాలనీ, ప్రయత్నాలు పెరిగే కొద్దీ దోష ప్రయత్నాలు లేదా తప్పు ప్రయత్నాలు తగ్గిపోతుంటాయి. చివరకు ఖచ్చితమైన ప్రయత్నంను వ్యక్తి తెలుసుకోగలుగుతాడు. అప్పటి నుండి ఆ కత్యాన్ని ఎటువంటి తప్పులు లేకుండానే ఒక్క ప్రయత్నంతోనే ఖచ్చితంగా చెయ్యగలుగుతాడు. ఇలా అనేక యత్నాలు- దోషాలు ద్వారా జరిగే అభ్యసనాన్నే **"యత్నదోష అభ్యసనం"** అని అంటారు.

రేపు : నిరంతర సమగ్ర మూల్యాంకనం

సంపాదకీయం

డోలీ యానం

'అడవి/ ఆకుపచ్చని నీడల్లో/ భారత దేశం/ తన మొదటి పాట పాడుకుంది/ అడవి/ నేల లోతుగా పాతుకున్న/ చెట్ల వేళ్లని నిశ్శబ్ద తపస్సులోంచి/ భారత దేశ జీవన విధానం ప్రాణాలు పోసుకుంది' అంటారు కవి అద్దేపల్లి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లయినా రహదారి అడగని గిరిజన ప్రాంతాల్లో... ప్రాణాలను భుజాలపై మోస్తున్నారు. అత్యవసర వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లాలంటే అంబులెన్స్ వుండదు. రోడ్డు మార్గం అసలే వుండదు. నిండు గర్భిణీ అయినా, పసిపాప అయినా పండు ముదుసలి అయినా, వారి ప్రాణాలు గాల్లో దీపంలా మిణుకుమిణుకు మనాల్సిందే. అత్యవసర వైద్యానికి రోగుల్ని, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, వద్ధులు, చిన్నపిల్లలను తరడలించడానికి డోలీలే దిక్కు. సరైన రహదారి సౌకర్యం లేక, అత్యవసర సమయాల్లో వైద్యం కోసం మైళ్ల కొద్దీ దూరం డోలీల్లో మోసుకెళ్లాల్సిన దుస్థితి. మార్గ మధ్యంలోనే మృతి చెందిన సంఘటనలూ కోకొల్లలు. 'డోలీ డోలీ/ నన్ను ముద్దాడిన అమృతం తెర/ ఇక ఈ డోలీలోనే/ విగతజీవిగా మిగలిపోతానేమో../ ఈ ప్రయాణంలో/ తల్లిగా ముద్ర గాంచడానికి/ తల్లి బంధంకి దూరమైతే కారణమెవ్రూ../ చెప్పండి' అంటారో కవి. ఈ తల్లి ప్రశ్నకు సమాధానం దొరికేదెప్పుడు?

సాంకేతిక విజ్ఞానం పెరిగి, చంద్రమండలానికి సైతం వెళ్లొస్తున్న రోజుల్లో కూడా గిరిజన గ్రామాలు రోడ్డు వసతిలేక ప్రాణాలు ఫణంగా పెట్టాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో కొన్నిచోట్ల కేవలం కాలిబాట మాత్రమే వుంటుంది. కొన్నిసార్లు మోటార్ బైక్ కూడా వెళ్లడం కష్టమే. దారంతా వాగులు వంకలు, రాళ్లు, ఎత్తుపల్లాలు. అలాంటి చోట అనారోగ్యంతో బాధపడే మనిషిని డోలీలో భుజాలపై మోస్తూ వెళ్లడం ఒక దుస్సాహసం. అలాంటిది.. పార్వతీపురం మన్యం, అల్లూరి, అనకాపల్లి, అరకు, తదితర జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులకు వైద్యం పెద్ద సవాలు. తాజాగా అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలోని కొండ శిఖర పివిటిజి గ్రామానికి చెందిన మహిళను అంబులెన్స్ ఎక్కించడానికే ఏకంగా తొమ్మిది కిలోమీటర్లు మోసుకొచ్చారు. అనారోగ్యంతో వున్న ఈ మహిళను ఇటీవలి కాలంలో మూడుసార్లు ఇలా డోలీ కట్టి మోసుకొచ్చారు. గత నెలలో విజయనగరం జిల్లాలోని రెగపుణ్యగిరి నుంచి డోలీలో మోసుకెళుతున్న గర్భిణీ... మార్గ మధ్యంలోనే బిడ్డకు జన్మనిచ్చింది. ఇలాంటి సంఘటనలు, గ్రామాలు అనేకం వున్నాయి. 'అతి బలహీనులకిచ్చే సౌకర్యాల ఆధారంగా సమాజ అభివృద్ధి స్థాయిని కొలవాలి' అంటారు గాంధీజీ. ఈ దేశంలోని ప్రతి పౌరుడికి వైద్యం ప్రాథమిక హక్కు. కానీ, గిరిజన ప్రజలకు మాత్రం అది దుర్భిణీ వేసి చూసినా కనిపించనంత దూరం. 'ప్రతి మనిషికి సమానమైన ఆరోగ్య సేవలు అందించడం మన సమాజపు నైతిక ప్రమాణం' అంటారు డబ్లుహెచ్‌వో డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్. ఆర్భాటంగా జరుపుకునే అమృతోత్సవాలు, గిరిజనోత్సవాలు డోలీ మోత లేకుండా ఒక్క చావునైనా ఆపగలిగిందా? అంటే తెల్లమొహం వేయాల్సిందే. రాకెట్ ప్రయోగాల్లో సెంచరీ చేసిన దేశంలో... కొండ గుండెకు చికిత్స చేసే నైతికత కొరవడింది.

దశాబ్దాలుగా అధికార పీఠాలపై కూర్చున్న ప్రతి ఒక్కరూ 'అభివృద్ధి లక్ష్యం... పథకాలు సిద్ధం' అంటూనే వున్నారు. డోలీయానం సాగుతూనే వుంది. ఏళ్లకేళ్లు గడచిపోతూనే వున్నాయి. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది గిరిజన ప్రాంతాల అభివద్ధి. ఎక్కడైనా ఒకటి అరా శంకుస్థాపనలు జరిగినా... ఆచరణలో గజం రోడ్డు కూడా నిర్మాణమైన దాఖలా ఒక్కటీ కనబడదు. ఇటీవల ఉపముఖ్యమంత్రి చేసిన శంకుస్థాపనే దీనికి నిదర్శనం. అద్భుత కట్టడాల రాజధానే కాదు... అట్టడుగు వర్గాల అభివృద్ధి కూడా అజెండాగా వుండాలి. గిరిజనుల ఓట్లపై వున్న శ్రద్ధ, వారి అభివృద్ధిపై లేదని చెప్పడానికి నిత్యం సాగుతున్న 'డోలీ యానం' కంటే నగ్న సాక్ష్యాలు ఇంకేముంటాయి. 'ఇది అంతర్జ్వాల/ మనిషనే అగ్గిపుల్లని ఏ రోడ్డుమీద గీసినా భగ్గున మండే/ సమాజ బాధామయ వాతావరణం/ గుండెల్లో రాజుకుంటున్న మహాజ్వాల' అంటారు కవి అద్దేపల్లి. డోలీ యానమన్నది గిరిజన జీవితాల్లో వేదనాభరిత నిట్టూర్పు. అది పాలనా విఫలతను ప్రతిబింబించే నిశ్శబ్ద అరుపు. ఈ నిశ్శబ్ద గళాన్ని ప్రభుత్వం వినాలి. బస్సులు, అంబులెన్స్‌ల కంటే ముందు...జనజీవన స్రవంతిలో భాగమయ్యేందుకు అవసరమైన రహదారులు నిర్మించాలి. వైద్య సౌకర్యాలు అందించాలి.

మహనీయుల మాట

భారతదేశం వైవిధ్యభరితమైనది. ఇలాంటి దేశంలో జాతీయాభివృద్ధి సాధించే క్రమంలో వివిధ జాతుల మధ్య సమైక్యత, సామరస్యం ఎంతగానో అవసరం. అందువల్ల మన సంస్కృతి యొక్క మిశ్రమ స్వభావం గురించి ప్రబోధించడం సమాజానికి రాజకీయంగా అవసరం.

- అస్ఘర్ అలీ ఇంజనీర్,
ప్రసిద్ధ రచయిత, సామాజిక కార్యకర్త.

బెడిసికొట్టిన మోడియా హడావుడి

బాధ్యతా రాహిత్యంతో అవాస్తవాలను, అసత్యాలను ప్రచారంలో పెట్టిన తీరుకు ప్రపంచం విస్తుపోతున్నది. భస్మాసుర హస్తంలా ఇది చివరకు తనను సృష్టించిన నరేంద్ర మోడీ సర్కారుకే ఇరకాటంగా పరిణమించింది. మోడీకి ఈ మీడియానే అతి పెద్ద ప్రతికూలాంశంగా మారిందని అల్‌జజీర్ సమగ్ర కథనాలు, చర్చలు ప్రచారం చేసింది. న్యూయార్క్ టైమ్స్ ఈ విషయం పతాక శీర్షికతో ప్రచురించింది. దేశంలో కూడా వైర్ న్యూస్ వంటి వెబ్‌సైట్లు ఫోటోలు, కథనాలు ఇచ్చాయి. ఉద్రిక్తత తారాస్థాయికి చేరిన, యుద్ధ మేఘాలు అలుముకున్న, దాడులు జరుగుతున్న ఒక పూర్వ రంగంలో మీడియా ఎంత బాధ్యతా రహితంగా వ్యవహరించిందో తెలుసుకుంటే దిగ్భ్రాంతి కలుగుతుంది.



తెలకపల్లి రవి

భారతీయ మీడియా దాదాపు మోడీయా గా మారిపోయిందన్న విమర్శ చాలా కాలంగా ఉంది కూడా. కీలక అంశాల్లో సైతం వాస్తవాల పరిశీలన, లోతైన అధ్యయనం లేకుండా కేవలం కేంద్ర పాలక పక్షమైన బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ లు చేసే ప్రచారాన్ని మోత మోగించడం బడా మీడియాకు పరిపాటిగా మారింది. ప్రధానమంత్రి మోడీ పైన, ఆయన మంత్రివర్గ సహచరుల పైన, ఆయనకు సన్నిహితులైన కార్పొరేట్ అధినేతలపైన వచ్చే ఆరోపణలను ముక్తసరిగా ముగించటం బిజెపి వ్యతిరేక లౌకిక, ప్రాంతీయ పార్టీలకు సంబంధించిన ప్రతి అంశం భూతద్దంలో చెప్పడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో అన్ని వ్యవస్థలను అపహస్యం చేయడానికి కూడా బడా మీడియా వెనుకాడటం లేదు. కరోనా సమయంలో అయితే ఇది పరాకాష్టకు చేరింది. ప్రభుత్వానికి భజన చేసే మీడియాను నెత్తిన పెట్టుకోవడం ఒకటైతే విమర్శించే వారిని నిర్బంధాలపాలు చేయడం, నిషేధించడం, వేధింపులకు గురిచేయటం నిత్యకృత్యమైంది. న్యూస్ క్లిక్, వైర్ న్యూస్ లతో సహ అనేక ప్రాంతీయ మీడియాలు, నిర్భయంగా పని చేసే సంపాదకులు, జర్నలిస్టులు, రచయితలు, అధ్యాపకులు నిఘా నేత్రానికి అక్రమ కేసులకు గురికావాల్సి వచ్చింది. రాజీవ్ గాంధీ హయాంలో బోఫోర్స్ కుంభకోణం వంటిది వస్తే నెలల తరబడి కథనాలు ఇచ్చిన మీడియా అతని కంపెనీ...అక్రమ విద్యుత్ ఒప్పందాల గురించి, అమెరికా సంస్థలు, అధికార వ్యవస్థల వివరాలు బయటపెట్టిన కేసుల లోతుపాతుల్లోకి పోకుండా పైపై వార్తలతో సరిపెట్టింది. అదే ఆంధ్రప్రదేశ్‌కు వస్తే ఇక్కడి వైసిపి, టిడిపి పరస్పరం తిట్టుకోడానికి తప్ప అసలు సమస్య వివరాల్లోకి పోకపోవడం, బలపరిచే మీడియా కూడా అలాగే వ్యవహరించడం చూస్తున్నాం. దేశం, రాష్ట్రాలకు సంబంధించిన ఈ కథలన్నీ అలా ఉంచితే ఇటీవల జరిగిన టెర్రరిస్ట్ హత్యాకాండ, భారత పాకిస్తాన్ సాయుధ సంఘర్షణ, నేపథ్యంలో భారతీయ మీడియా మరీ దారుణంగా తయారైంది. కాల్పుల విరమణ తర్వాత దేశంలోనే కాక అంతర్జాతీయంగా కూడా దాని పాత్రపై వివరమైన అధ్యయనాలు జరుగుతున్నాయి. సంచలన కథనాలు వెలువడుతున్నాయి.

యుద్ధం కోసం బులపాటం

బాధ్యతా రాహిత్యంతో అవాస్తవాలను, అసత్యాలను ప్రచారంలో పెట్టిన తీరుకు ప్రపంచం విస్తుపోతున్నది. భస్మాసుర హస్తంలా ఇది చివరకు తనను సృష్టించిన నరేంద్ర మోడీ సర్కారుకే ఇరకాటంగా పరిణమించింది. మోడీకి ఈ మీడియానే అతి పెద్ద ప్రతికూలాంశంగా మారిందని అల్‌జజీర్ సమగ్ర కథనాలు, చర్చలు ప్రచారం చేసింది. న్యూయార్క్ టైమ్స్ ఈ విషయం పతాక శీర్షికతో ప్రచురించింది. దేశంలో కూడా వైర్ న్యూస్ వంటి వెబ్‌సైట్లు ఫోటోలు, కథనాలు ఇచ్చాయి. ఉద్రిక్తత తారాస్థాయికి చేరిన, యుద్ధ మేఘాలు అలుముకున్న, దాడులు జరుగుతున్న ఒక పూర్వ రంగంలో మీడియా ఎంత బాధ్యతా రహితంగా వ్యవహరించిందో తెలుసుకుంటే దిగ్భ్రాంతి కలుగుతుంది. కేవలం నాలుగు రోజుల పరాకాష్టల్లో సాగిన ఈ సాయుధ సంఘర్షణపై కథనాలు ఎలా నడిచాయో వాస్తవాలు ఏమిటో వెనక్కు తిరిగి చూసుకోవడం ఇప్పుడు అందరికీ సాధ్యమే. తెలుగుతో సహా ప్రాంతీయ మీడియా కూడా ఇదే వరవడిలో సాగింది కనుక ఎవరైనా ఈ అంశం స్వయంగా పరిశీలించవచ్చు. కాకపోతే జాతీయ మీడియాలో వచ్చిన వార్తలను తాము ప్రసారం చేశామని ప్రాంతీయ మీడియాలు సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ కోట్ల మంది ప్రజలు వీక్షించే ప్రాంతీయ మీడియా బాధ్యత కూడా తక్కువ కాదు. ఒక విధంగా సామాన్య ప్రజలను చేరేది అదే గనుక మరింత ఎక్కువ బాధ్యత కూడా ఉంటుంది.

అసత్యాలపై రాజ్‌దీప్ క్షమాపణ

భారత్ పాకిస్తాన్ ఘర్షణపై మీడియా అనుసరించిన కథనాల శైలి బయటి దేశం మీదకాక స్వదేశం మీదనే దృష్టి పెట్టినట్లు సాగిందని విమర్శకుల విశ్లేషణ. అంటే దేశంలో వీక్షకులను సంచలన కథనాలతో ఆకట్టుకొని రేటింగ్ పెంచుకోవడం మతాలవారీ విద్వేషాలు పెంచి మైనార్టీలపై ద్వేషం రెచ్చగొట్టడం అనే రెండు లక్షణాలు ఇక్కడ కనిపిస్తాయి. సాధారణంగా సోషల్ మీడియానే ఇందుకు కారణమని చెప్పడం జరుగుతుంది. కానీ ఈ ఘర్షణ సమయంలో ప్రధాన మీడియా అన్నది కూడా ఇందుకు మినహాయింపు కాకపోవడం ఆందోళనకరం. ఆర్ణబ్ గోస్వామి రిపబ్లిక్ టీవీ వంటివి టీవీ స్టూడియోలను యుద్ధ రంగాలుగా మార్చేశాయి. తుపాకుల బొమ్మలు, ఆయుధాలు, చెట్లు నమూనాలతో మరింత ఉద్రిక్తతకు కారణమయ్యాయి. దాడులపై నిరాధారమైన కథనాలిచ్చాయి. ఇది ఎంతవరకు పోయింది? ఏ స్థాయిలో సాగింది? అంటే సీనియర్ సంపాదకుడైన రాజ్‌దీప్ సర్దేశాయ్ ఆధారం లేని కొన్ని కథనాలు చెప్పినందుకు క్షమాపణలు చెప్పుకోవాల్సి వచ్చింది. ఆర్ణబ్ గోస్వామి అందుకు సిద్ధపడలేదు కానీ ఘోరంగా రెచ్చిపోయి వ్యవహరించారు. ఇక్కడ చెప్పుకోవాల్సింది ఏమంటే పాకిస్తాన్ మీడియా కూడా అందుకు ఏమాత్రం తీసిపోని విధంగా అసత్య కథనాలతో ఆవేశం పెంచడానికి పనిచేసింది. ఆ మీడియాని గనుక నమ్మినట్లయితే ఢిల్లీపై దాడి జరిగిందని భావించాల్సి వచ్చేది.

ఆర్ణబ్ గోస్వామి కథనాల ప్రకారం 400 డ్రోన్లను భారత సైన్యం ఒక్క దెబ్బతో పేల్చివేసింది. పాకిస్తాన్‌లో సైనిక కుట్రే జరిగిపోయింది. దాడి కకావికలం చేసింది. ఐఎన్ఎస్ విక్రాంత్ బయల్దేరి కరాచీ రేవును ధ్వంసం చేసింది. ఇండియా న్యూస్ టీవీ కథనం ప్రకారం లాహోర్ ధ్వంసమైంది. ఎన్.డి టివి కథనం ప్రకారం ట్యాంకులు కూల్చివేయబడ్డాయి. 17 జె.ఎఫ్ విమానాలను, ఎఫ్ 16 విమానాలను పాకిస్తాన్ నుంచి భారత సైన్యం పట్టుకున్నదని ఇండియా టుడే కథనం ప్రసారం చేసింది. ఆజ్ తక్ చానల్‌లో అంజనా మిశ్రా, శ్వేతా కశ్యప్ ఆవేశపూరితమైన కథనాలు ఇవ్వటమే కాకుండా పాకిస్తాన్ సూసైడ్ దళాలు సైన్యంపై దాడికి కుట్ర పన్నాయని ప్రసారమైంది. ఎ.బి.పి, జీ న్యూస్ లు పాక్ సైనిక దళాల ప్రధాన అధికారి మునీర్‌ను తొలగించేసినట్టు ప్రసారం చేసింది. 450 మంది ప్రైవేట్ సైన్యం దాడి చేస్తున్నట్లుగా అజయ్ శర్మ కథనం ఇచ్చారు. ఉదాహరణలు చెప్పాలంటే స్థలాభావం అడ్డొస్తుంది. ఇలాంటి కథనాలతో రాజస్థాన్ సరిహద్దుల్లో ప్రజలు చాలా ఆందోళన చెందారని కూడా తర్వాత బయటకు వచ్చింది. ఈ వివరాలన్నింటి నిజానిజాలను ఆల్ట్ న్యూస్, క్వింట్ వంటివి బయటపెట్టాయి. పంజాబ్ కాంగ్రెస్ నాయకుడు రాజీవ్ శర్మ ఈ అసత్య కథనాల సుదీర్ఘ జాబితాను తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు అభిషేక్ మాలిక్ వివరమైన విశ్లేషణ రాశారు. న్యూయార్క్ టైమ్స్‌లో అనుప్రీత దాస్, ప్రగతి రుచి లోతుగా పరిశీలించారు. దక్షిణాసియాలో అసత్య సమాచార యంత్రాంగంపై పరిశోధన చేసే అమెరికన్ యూనివర్శిటీకి చెందిన డా॥ సుమిత్ర బద్రీనాథ్ ఇది ఒక పెద్ద బెడదగా తయారైందని నివేదించారు. ఈ అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే కథనాలు ఎంత దూరం వెళ్లాయంటే చివరకు రక్షణ శాఖ కూడా ఆందోళన చెంది ఇలాంటి వాటిని విరమించాలని ఆదేశించింది. సైనిక దళాల కదలికలు, ఆయుధ ప్రయోగాలను అధికారికంగా అనుమతిస్తేనే ప్రసారం చేయాలి కానీ కేవలం ఇతర వనరుల ఆధారంగా కథనాలు ఇవ్వరాదని హెచ్చరించింది. ఎందుకంటే సైనిక దళాల కదలికల గురించి, విమానాల గురించి, దాడుల ఫలితాల గురించి భారతీయ మీడియాలో వచ్చే కథనాలు పాకిస్తాన్ ప్రచార దాడికి సాధనాలవుతాయి కనుక ఈ ప్రకటన చేయవలసి వచ్చింది. అయినప్పటికీ ఇప్పటివరకు కూడా ఇలాంటి కథనాలు పూర్తిగా ఆగిపోయాయని చెప్పలేము.

సత్యాలకే శిక్ష - కట్టు కథలకు బహుమానం

మోడీ ప్రభుత్వ వైఖరి కూడా ఈ పరిస్థితికి ఒక ప్రధాన కారణం. ఆపరేషన్ సిందూర్ మొదలైనప్పటి నుంచి రైల్వే టికెట్లపై ఆ పేరుతో మోడీ బొమ్మలు ముద్రిస్తున్న ప్రస్తుత సమయం దాకా ఈ పరిణామాలను రాజకీయ ప్రచారానికి వాడుకోవటం అన్నది ఒక వ్యూహంగా తయారైంది. తొలి దశలో ఈ ధోరణులను ప్రోత్సహించడం వల్ల అవి తర్వాత అదుపు తప్పిపోయాయి. నాలుగు రోజుల్లోనే కాల్పుల విరమణ జరిగాక ఇదంతా ఒక రహస్యంగా తయారయింది. ఈ నాలుగు రోజుల్లోనూ సంఘపరివార్ నేతలు క్రమ పద్ధతిలో కథనాలు వదులుతూ వచ్చారు. చానళ్లలో, పత్రికల్లో రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. ఒక విధంగా మతతత్వ రాజకీయాలతో మతపరమైన విభజన పెంచే విద్వేష వాదనలు చేశారు. సోషల్ మీడియాకు, ప్రధాన మీడియాకు అసత్య సమాచారాలు రావడానికి కొందరు కారకులయ్యారు. తమాషా ఏమంటే కేంద్రం ఇలాంటి శక్తులను అదుపు చేయడానికి బదులు...వాస్తవాలను బాధ్యతాయుతంగా అందిస్తున్న వైర్ వంటి పత్రికలపై...మూత బూచి వేయడానికి ప్రయత్నించింది. మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ సైనిక దళాల తరఫున మాట్లాడిన సోఫియా ఖురేషిని టెర్రరిస్టుల సోదరి అని దుర్భాషలాడితే హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా క్షమాపణలు చెప్పమని ఆదేశిస్తే, బిజెపి నాయకులు, ప్రభుత్వాల నేతలు ఒక చర్య కూడా తీసుకోలేదు. కానీ అలీఖాన్ మహమ్మద్ వంటి ప్రొఫెసర్లను నిష్కారణంగా అరెస్టు చేసిన తర్వాత వారికి సుప్రీంకోర్టులో బెయిల్ వచ్చింది. కేంద్రంగానీ బిజెపి నాయకులు కానీ ఇంత అసంబద్ధంగా వ్యవహరించడానికి బలమైన కారణాలే ఉన్నాయి. ఈ ఘర్షణను విపరీతంగా ప్రచారం చేయడం వల్ల వారు ఆశించిన రాజకీయ ప్రయోజనం కలగలేదు. పైగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యంతో హఠాత్తుగా విరమించారన్న విమర్శ కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది.

ఇప్పుడు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి తాము ట్రంప్ కు ఈ విషయాలు చెప్పలేదని పార్లమెంటరీ ప్రతినిధి వర్గాలకు వివరణ ఇస్తున్నారు. ముందుగా పాకిస్తాన్ డిజిఎంఓ తమను సంప్రదించాకే కాల్పులు విరమణ జరిగిందని ఆయన అంటున్నారు. అదే నిజమైతే ఇంత ఘర్షణ తర్వాత బేషరతుగా కాల్పుల విరమణకు మోడీ ప్రభుత్వం అంగీకరించిందని భావించాలా? శాంతి పునరుద్ధరణ మంచిదే అయినప్పటికీ ఉగ్రవాదులను అప్పగించడం వంటి కనీసమైన షరతులు కూడా పెట్టలేదా? అణ్వాయుధ నిల్వలున్న 'కిరణా హిల్స్' ముఖద్వారాన్ని మిస్సైల్స్ ఢీకొట్టడం వంటి వార్తలు చాలా వచ్చాయి కానీ ఇప్పుడు విక్రమ్ మిస్రీ ఏ దశలోనూ పాకిస్తాన్ అణ్వాయుధ వినియోగం గురించి చెప్పలేదని ఎంపీలకు వివరించారు. అంటే ఇరు దేశాల్లోనూ ప్రసారమైన రెచ్చగొట్టే కథనాలు కేవలం కల్పితాలని అర్థం కావడం లేదా? ఉద్రిక్తత తగ్గాక ఈ సంచలనాలు చేయటం వేరు. సరిహద్దులు రగిలిపోతున్న సమయంలో నిరాధారమైన కథనాలు చలామణి చేయడం వేరు. ఈ విషయంలో బడా మీడియా వ్యవహరించిన తీరు దేశానికి తలవంపులు తేవడమే కాక గతంలో ఉన్న మీడియా ప్రతిష్టను మరింత దిగజార్చింది. భారతీయ మీడియా ఇలా వ్యవహరించటం మామూలు అయిపోయిందని అంతర్జాతీయ సంస్థలు తేల్చివేశాయి.

బెడిసి కొట్టిన హడావుడి

ప్రకృతిలో కుక్క తోక తరహాలో కొన్ని వంకరగానే వుంటాయి. ఈ మీడియా సంస్థలూ, మోడీ భజన బృందాలు కూడా అందుకు నకళ్లలాగా వ్యవహరించడం హాస్యాస్పదం. సాయుధ ఘర్షణలో అసత్య ప్రచారాలు, విరమణతో విన్యాసాలు చేశాయి సరే. ఇప్పుడు దేశం కోసం అన్ని పార్టీలూ విదేశాలలో దౌత్య ప్రచార బృందాలలో కలిసి వస్తే ఇదీ మోడీ ఘనతగా మీడియా చిత్రిస్తున్నది. మొదటే చెప్పినా వినకుండా యుద్ధ హడావుడి తర్వాత దౌత్య మార్గం వైపు తిరగవలసి వచ్చిందనేది వాస్తవం. ఇందులోనూ శశిథరూర్ వంటి భజనమూర్తుల కక్కుర్తి వేషాలకే అధిక ప్రచారం ఇస్తూ మోడీ సర్కారు చిన్న బుద్ధిని దాచిపెడుతోంది. మొత్తానికి ఇప్పుడు దేశంలో ఇతర పార్టీలపైనా విశ్వగురుడే గెలిచాడని బడా మీడియా హైప్ సీజన్-2 పెంచబోతోంది. తథాస్తు, మరి. తర్వాత అదీ చూద్దాం! ★

ఆపరేషన్ సిందూర్ మొదలైనప్పటి నుంచి రైల్వే టికెట్లపై ఆ పేరుతో మోడీ బొమ్మలు ముద్రిస్తున్న ప్రస్తుత సమయం దాకా ... ఈ పరిణామాలను రాజకీయ ప్రచారానికి వాడుకోవటం అన్నది ఒక వ్యూహంగా తయారైంది. తొలి దశలో ఈ ధోరణులను ప్రోత్సహించడం వల్ల అవి తర్వాత అదుపు తప్పిపోయాయి. నాలుగు రోజుల్లోనే కాల్పుల విరమణ జరిగాక ఇదంతా ఒక రహస్యంగా తయారయింది. ఈ నాలుగు రోజుల్లోనూ సంఘపరివార్ నేతలు క్రమ పద్ధతిలో కథనాలు వదులుతూ వచ్చారు. చానళ్లలో, పత్రికల్లో రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. ఒక విధంగా మతతత్వ రాజకీయాలతో మతపరమైన విభజన పెంచే విద్వేష వాదనలు చేశారు. సోషల్ మీడియాకు, ప్రధాన మీడియాకు అసత్య సమాచారాలు రావడానికి కొందరు కారకులయ్యారు. తమాషా ఏమంటే కేంద్రం ఇలాంటి శక్తులను అదుపు చేయడానికి బదులు...వాస్తవాలను బాధ్యతాయుతంగా అందిస్తున్న 'వైర్' వంటి పత్రికలపై... మూత బూచి వేయడానికి ప్రయత్నించింది.

రాజస్థాన్ 'కోట'లో ఆత్మహత్యలు ఆపలేమా?

రాజస్థాన్ నడిబొడ్డున ఉన్న కోట నగరం దశాబ్దాలుగా లక్షలాది యువత ఆశయాల నిలయంగా మారింది. దేశ 'కోచింగ్ రాజధాని'గా పేరొందిన ఈ నగరంలో 2023లో 26 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోగా, ఈ ఏడాది ఇప్పటికే 14 ఆత్మహత్యలు నమోదయ్యాయి. ఇది జాతీయ స్థాయిలో ఆందోళన రేకెత్తించి, సుప్రీంకోర్టు తీవ్ర విమర్శలు చేసే వరకూ వెళ్లింది.

సుప్రీంకోర్టు ప్రశ్నలు

భారత సుప్రీంకోర్టు కోటలో విద్యార్థుల ఆత్మహత్యల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ మే 23న రాజస్థాన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. "ఈ పిల్లలు ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు? కోటలో మాత్రమే ఎందుకు? రాష్ట్ర ప్రభుత్వంగా మీరేం చేస్తున్నారు?" వంటి పలు ప్రశ్నలను సంధించింది. అనేక చర్యలు ప్రకటించినప్పటికీ, విద్యార్థుల బలవన్మరణాలు నిరంతరంగా చోటు చేసుకోవడం సుప్రీంకోర్టు జోక్యానికి దారితీసింది.

కోట-ఆశయాల కేంద్రం

ఐఐటి, ఎయిమ్స్ వంటి దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మక ప్రవేశ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్న ఆలోచన నుండి 'కోట' ఉద్భవించింది. మాజీ ఇంజనీర్ వి.కె. బన్సాల్‌ను కోట కోచింగ్ పరిశ్రమ పితామహుడిగా పరిగణిస్తారు. ఆయన విజయం బన్సాల్ క్లాసెస్ స్థాపనకు దారితీసింది. ఇది ఇతరులకు నమూనాగా మారింది.

కోచింగ్ కేంద్రాలు-ఒత్తిడి

తాజా నివేదికల ప్రకారం, కోటలో 250కి పైగా నమోదిత కోచింగ్ సంస్థలు ఉన్నాయి. నమోదు కాని, చిన్నా చితకా కేంద్రాలకు లెక్కే లేదు. అగ్రశ్రేణి కోచింగ్ కేంద్రాలు ఆధునిక తరగతి గదులు, గ్రంథాలయాలు, హాస్టల్ సౌకర్యాలు అందిస్తున్నప్పటికీ, విద్యార్థుల జీవన పరిస్థితులలో చాలా తేడాలుంటాయి. విద్యార్థులు ప్రైవేట్ హాస్టళ్లలో లేదా పేయింగ్ గెస్ట్ వసతులలో నివసిస్తున్నారు. విద్యా విషయాలపై మాత్రమే దృష్టి ఉంటుంది.

విద్యార్థుల్లో ఒత్తిడి ...

కోట విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. రోజుకు 12-18 గంటల తీవ్రమైన అధ్యయన షెడ్యూళ్లు, వారపు పరీక్షలు, నిరంతర ర్యాంకింగ్, నిరంతర పోటీ, పనితీరు ఆందోళన వాతావరణాన్ని సృష్టిస్తాయి. మధ్యతరగతి కుటుంబాల నుండి వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులు కోట కోచింగ్‌లో తమ జీవితకాల పొదుపును పెట్టుబడిగా పెడతారు. తమ పిల్లలు విజయం సాధించాలన్న ఒత్తిడి ఉంటుంది. మొదటిసారి ఇంటికి దూరంగా, కుటుంబం, పరిచయస్తులకు దూరంగా ఉండటం తీవ్రమైన ఒంటరితనం, ఇంటిపై బెంగకు దారితీస్తుంది. కోచింగ్ పరిశ్రమ లాభాల ఆధారిత నమూనా విద్యార్థుల శ్రేయస్సును విస్మరిస్తుంది. ఈ పరీక్షలలో వైఫల్యం జీవితంలో వైఫల్యానికి సమానమనే నమ్మకం నిరాశ నిస్సహాయ భావాలకు దారితీస్తుంది.

కోచింగ్ సంస్థలకు స్పష్టమైన నిబంధనలు, జవాబుదారీతనం అవసరం. ప్రస్తుత కొత్త మార్గదర్శకాలను కఠినంగా అమలు చేయాలి. నిబంధనలను పాటించని వారికి గణనీయమైన జరిమానాలు విధించాలి. హామీతో కూడిన విజయాన్ని వాగ్దానం చేసే తప్పుదారి పట్టించే ప్రకటనలను నిషేధించాలి. తరగతి పరిమాణాలను పరిమితం చేయాలి. ఆరోగ్యకరమైన విద్యార్థి-కౌన్సిలర్ నిష్పత్తిని తప్పనిసరి చేయాలి. విద్యార్థి శ్రేయస్సుకు ప్రాధాన్యతనిచ్చే మరింత మానవీయ అభ్యాస వాతావరణాన్ని ప్రోత్సహించాలి. తమకు సరిపోదని భావించే విద్యార్థులకు సులభమైన నిష్క్రమణ ఎంపికలు, పూర్తి, సకాలంలో రీఫండ్‌లను నిర్ధారించాలి.

విషాదానికి మూల కారణాలు

ఆత్మహత్యల పెరుగుదలకు కారణాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. నిరంతర మూల్యాంకనాలు, ర్యాంకుల బహిరంగ ప్రదర్శనలు ప్రమాణాలను అందుకోలేకపోతామనే భయాన్ని పెంచుతాయి. కుటుంబ మద్దతు లేకపోవడం, గంటల తరబడి ఒంటరిగా చదువుకోవడం వల్ల ఏకాంతం ఒంటరితనం పెరుగుతాయి. మానసిక ఆరోగ్య సమస్యలకు సహాయం కోరడానికి సామాజిక చిన్నచూపు, తల్లిదండ్రుల అపార్థాల కారణంగా సంకోచం ఉంటుంది. కఠినమైన షెడ్యూళ్ల కారణంగా విశ్రాంతి, వినోదం, భావోద్వేగ ప్రక్రియకు చాలా తక్కువ సమయాన్ని ఇవ్వడంతో అలసట కలుగుతుంది. ఆదేశాలు ఉన్నప్పటికీ, అర్హత కలిగిన కౌన్సిలర్లు, వైద్యుల లభ్యత సరిపోవడం లేదు.

ఇప్పటివరకు తీసుకున్న చర్యలు

విద్యార్థుల ఆత్మహత్యల నేపథ్యంలో రాజస్థాన్ ప్రభుత్వం, కోచింగ్ సంస్థలు వివిధ చర్యలను అమలు చేశాయి. కోచింగ్ కేంద్రాలకు కొత్త మార్గదర్శకాలు జారీ అయ్యాయి. వీటిలో తప్పనిసరి వారపు సెలవులు, పరీక్షల సమయ నియంత్రణ, పనితీరు ఆధారంగా విద్యార్థులను విభజించకపోవడం, తప్పనిసరి కౌన్సిలింగ్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు. మానసిక ఆరోగ్య మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, కోచింగ్ కేంద్రాలలో వృత్తిపరమైన మానసిక వైద్యులు, కౌన్సిలర్లను తప్పనిసరిగా నియమిస్తున్నారు. ప్రమాదంలో ఉన్న విద్యార్థులను గుర్తించడానికి సిబ్బందికి గేట్ కీపర్ శిక్షణ నిర్వహిస్తున్నారు. హాస్టళ్లకు "ఆత్మహత్య-నిరోధక" సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇందులో సీలింగ్ ఫ్యాన్‌లకు స్ప్రింగ్-లోడెడ్ పరికరాలు, బాల్కనీలలో లాబీలలో ఆత్మహత్య ప్రయత్నాలను భౌతికంగా నిరోధించడానికి వలలను అమర్చడం వంటివి ఉన్నాయి. పర్యవేక్షణలో భాగంగా, హాస్టల్ వార్డెన్ల ద్వారా విద్యార్థులను తనిఖీ చేయడానికి "దర్వాజే పే దస్తక్" వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. మహిళా విద్యార్థుల భద్రత కోసం పోలీసుల "కాలికా స్క్వాడ్" కూడా పనిచేస్తుంది. ప్రభుత్వ చట్ట పరంగా, ఈ చర్యలు ప్రశంసనీయమైనప్పటికీ...అమలులో తరతమ తేడాల వల్ల...తీవ్రమైన పోటీ, అవాస్తవ అంచనాలు, ఒత్తిడిని నడిపించే వాణిజ్యీకరణ వంటి సమస్యలను పరిష్కరించవనే విమర్శ వినిపిస్తోంది.

ముందుకెళ్లే మార్గం

కోటలో ఆత్మహత్యలను నిరోధించాలంటే వ్యవస్థాగత విద్యా సంస్కరణలు చేపట్టాలి. ఇందులో జె.ఇ.ఇ, నీట్ వంటి వాటి ఏకైక దృష్టిని తగ్గించడం, వృత్తి శిక్షణ, నైపుణ్య ఆధారిత విద్య, చిన్న వయస్సు నుండే ప్రత్యామ్నాయ వృత్తి మార్గాలను ప్రోత్సహించడం వంటివి ఉంటాయి. బట్టీ పట్టడం కాకుండా సామాజిక-భావోద్వేగ అభ్యాసం, విమర్శనాత్మక ఆలోచన, జీవిత నైపుణ్యాలను పాఠ్య ప్రణాళికలో చేర్చడం ద్వారా సమగ్ర అభ్యాసాన్ని ప్రోత్సహించాలి. పరీక్షా నిర్మాణాలను, గ్రేడింగ్ విధానాలను తిరిగి మూల్యాంకనం చేసి విద్యార్థులపై భారాన్ని తగ్గించాలి.

తల్లిదండ్రులు, సమాజం ఆలోచనలను మార్చడం అత్యవసరం. విజయం విస్తృత నిర్వచనాన్ని ప్రోత్సహించాలి, తద్వారా ప్రతి బిడ్డ వారి పరీక్ష ఫలితాలతో సంబంధం లేకుండా విలువైనదిగా భావించే సంస్కృతిని పెంపొందించవచ్చు.

మానసిక ఆరోగ్య మౌలిక సదుపాయాల పట్ల అవగాహన కల్పించాలి. అర్హత కలిగిన మనస్తత్వవేత్తలు, మనోవ్యాధి వైద్యులు, కౌన్సిలర్లను విద్యార్థులందరికీ తగినంత సంఖ్యలో సులభంగా అందుబాటులో ఉండేలా చూడాలి.

కోచింగ్ సంస్థలకు స్పష్టమైన నిబంధనలు, జవాబుదారీతనం అవసరం. ప్రస్తుత కొత్త మార్గదర్శకాలను కఠినంగా అమలు చేయాలి, నిబంధనలను పాటించని వారికి గణనీయమైన జరిమానాలు విధించాలి. హామీతో కూడిన విజయాన్ని వాగ్దానం చేసే తప్పుదారి పట్టించే ప్రకటనలను నిషేధించాలి. తరగతి పరిమాణాలను పరిమితం చేయాలి, ఆరోగ్యకరమైన విద్యార్థి-కౌన్సిలర్ నిష్పత్తిని తప్పనిసరి చేయాలి, శ్రేయస్సుకు ప్రాధాన్యతనిచ్చే మరింత మానవీయ అభ్యాస వాతావరణాన్ని ప్రోత్సహించాలి. తమకు సరిపోదని భావించే విద్యార్థులకు సులభమైన నిష్క్రమణ ఎంపికలు, పూర్తి, సకాలంలో రీఫండ్‌లను నిర్ధారించాలి.

కమ్యూనిటీ మద్దతును పెంపొందించడం ద్వారా సానుకూల వాతావరణం సృష్టించవచ్చు. విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకోవడానికి, క్రీడలు, కళలు ఇతర పాఠ్యేతర కార్యకలాపాలకు తగిన స్థలాలను కేటాయించి, అవకాశాలను అందించాలి.

- జనక మోహన రావు దుంగ,
సెల్ : 8247045230

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governorpet, Vijayawada – 520002 (A.P.)

E-Procurement Short Tender Notice

NIT No. 35/MAU61-ADMN0IS(INPN)/6/2025-IS **Dated: 24-05-2025**

Name of Work : APCRDA-" Providing Active + Passive Networking Services @ AP Secretariat Departments, Amaravati" - Estimate Contract Value: **Rs.9,06,625/-** (Excl. of all taxes).
The bid can be downloaded on AP e-procurement portal from **26.05.2025 to 03.06.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **03.06.2025 up to 15.00 Hrs,** Technical bid opening **03.06.2025 @16.00Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.**

Sd/- Addl.Commissioner, APCRDA, Vijayawada

విజయంతో ముగించిన ఢిల్లీ

● ఉత్కంఠపోరులో ఓడిన పంజాబ్

జైపూర్: ఐపిఎల్-2025ని ఢిల్లీ క్యాపిటల్స్ విజయంతో ముగించింది. ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కు దూరమైన ఢిల్లీ.. అగ్రస్థానంపై కన్నేసిన పంజాబ్ కింగ్స్‌ను షాకిచ్చింది. జైపూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్‌పై ఢిల్లీ ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఢిల్లీ 4 వికెట్లు కోల్పోయి 3 బంతులు మిగిలుండగా చేదించింది. సమీర్ రిజ్వీ (58బీ 25 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు అర్ధ శతకం బాదాడు. కరుణ్ నాయర్ (44బీ 27 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. ఓపెనర్లు కెఎల్ రాహుల్ (35బీ 21 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), ఫాఫ్ డుప్లెసిస్ (23బీ 15 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) శుభారంభం అందించగా.. సెదిఖుల్లా అటల్ (22, 16 బంతుల్లో 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించాడు. పంజాబ్ బౌలర్లలో హర్‌ప్రీత్ బ్రార్ 2, మార్కో యాన్సెన్, ప్రవీణ్ దూబె ఒక్కో వికెట్ తీశారు.

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ భారీ స్కోరు చేసింది. ప్రియాంశ్ ఆర్య (6) నిరాశపర్చినా.. జోష్ ఇంగ్లిస్ (32బీ 12 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (28బీ 18 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (53బీ 34 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ శతకం బాదగా.. చివర్లో స్టొయినిస్ (44బీ 16 బంతుల్లో3 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. నేహల్ వధేరా (16), శశాంక్ సింగ్ (11) పరుగులు చేశారు. ఢిల్లీ బౌలర్లలో ముస్తాఫిజుర్ 3, కుల్దీప్ యాదవ్ 2, విప్రాజ్ నిగమ్ 2, ముకేశ్ కుమార్ ఒక వికెట్ పడగొట్టారు.

మానసిక వికలాంగురాలిపై అత్యాచారం

● జైలు గార్డుల ఘాతుకం

గౌహతి: మానసిక వికలాంగురాలైన యువతిని జైలు గార్డులు క్వార్టర్లలోకి ఈడ్చుకెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఉదంతం వెలుగుచూసింది. అస్సాంలోని శ్రీభూమి జిల్లాలో శనివారం తెల్లవారుజామున 1.30 గంటలకు రోడ్డుపై ఒంటరిగా ఉన్న మానసిక వికలాంగురాలైన మహిళను ఇద్దరు జైలు గార్డులు చూశారు. తమ క్వార్టర్‌లోకి లాక్కెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ సమాచారం తెలుసుకున్న పెట్రోలింగ్ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. జైలు వార్డర్లు హరేశ్వర్ కలిత, గజేంద్ర కలితను నిందితులుగా గుర్తించారు. గౌహతిలోని పంజాబరి, బోరాగావ్ ప్రాంతాలకు చెందిన వారిద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌పి తెలిపారు. బాధితురాలిని హాస్పిటల్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మీడియాకు వెల్లడించారు.

తుంగభద్ర డ్యామ్ గేట్లు మార్పు

● 32 గేట్లకు రూ.41 కోట్లతో టెండర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కృష్ణానదికి కీలకమైన తుంగభద్ర డ్యామ్ గేట్ల మార్పుపై ప్రభుత్వం దృష్టి సారించింది. దీనికోసం 32 గేట్లకు రూ.41,42,24,000తో షార్ట్ టెండర్లను ఆహ్వానించింది. ప్రస్తుతం శ్రీశైలం పై భాగంలో తుంగభద్ర డ్యామ్ అత్యంత కీలకమైంది. దీనికి 33 క్రస్ట్ గేట్లు ఉన్నాయి. కొద్దికాలం క్రితం ఒకగేటు కొట్టుకుపోవడంతో ప్రఖ్యాత ఇంజినీరు కన్నయ్యానాయుడు సూచనల మేరకు ఒకగేటును అమర్చారు. మిగిలిన 32 గేట్లు కూడా సరిగ్గా లేవని, నిర్వహణ దెబ్బతిందని అప్పట్లో కన్నయ్యానాయుడు ప్రభుత్వానికి సూచించారు. దీంతో వాటిని మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల ఇరిగేషన్ ప్రాజెక్టుల ఆధునీకరణ, రిపేర్లలో భాగంగా తుంగభద్ర గేట్లను మార్చాలని ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. ఈ నెల 28 చివరి తేదీగా పేర్కొంది. వీటితోపాటు అవసరం అయినప్పుడు అత్యవసర రిపేర్లు చేసేందుకు వీలుగా క్రేన్లు, విద్యుత్ పరికరాలు, డీజిల్ జనరేటర్లు ఇలా అన్ని పనులకూ తుంగభద్ర బోర్డు టెండర్లను ఆహ్వానించింది. వీటిని ఈ సీజన్లోనే పూర్తి చేయాలని నిర్ణయించింది. వీటితోపాటు డ్యామ్ సిబ్బంది నివాసం ఉండేందుకు వీలుగా క్వార్టర్లను కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. వీటికి కూడా టెండర్లను ఆహ్వానించింది.

విద్యుదాఘాతానికి ముగ్గురు మృతి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని బెంజిసర్కిల్ సమీపంలో శనివారం విషాదం చోటు చేసుకుంది. విద్యుదాఘాతానికి గురై దంపతులతోపాటు బంధువు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని మూడంతస్తుల భవనంలో సలాది ప్రసాద్ (61), సలాది వెంకట హేమవాణి (54) దంపతులు నివాసం ఉంటున్నారు. ఉదయం 8.20 గంటల సమయంలో భార్య హేమావాణి ఇంట్లోని స్విచ్‌బోర్డు నుండి ప్లెగ్ తీసేందుకు ప్రయత్నించగా విద్యుత్ షాక్‌కు గురై పడిపోయారు. ఆ సమయంలో అక్కడే ఉన్న భర్త ప్రసాద్ ఆమెను కాపాడే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అతనూ ప్రమాదానికి గురయ్యారు. వీరిద్దరిని చూసిన ప్రసాద్ సోదరి తరవలి ముత్యావల్లి (53) వారిని కాపాడే ప్రయత్నం చేసే క్రమంలో ఆమె కూడా విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ముగ్గురూ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఈ సంఘటనను గమనించిన స్థానికులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మతుడు ప్రసాదరావు స్వస్థలం రాజమహేంద్రవరంగా గుర్తించారు. మతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సీడ్ యాక్సెస్ రోడ్డు టు కరకట్ట

● రూ.60 లక్షలతో రోడ్డు నిర్మాణం

● కరకట్ట విస్తరణకు తొలి అడుగు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డు నుండి కరకట్టకు కనెక్టివిటీ విషయంలో సిఆర్‌డిఎ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం సీడ్ యాక్సెస్ రోడ్డు నిలిచిపోయిన దగ్గర నుండి కరకట్ట వరకూ రోడ్డును విస్తరించనుంది. దీనికోసం ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. ఈ నెల 26లోపు దరఖాస్తులకు అవకాశం కల్పించింది. ప్రస్తుతం ఉన్న సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభం నుండి బిఎంఎన్ ఆక్వా జంక్షన్ వరకూ కరకట్టకు దక్షిణ భాగంలో కొత్తగా రోడ్డు నిర్మించనున్నారు. ప్రస్తుతం విజయవాడకు, అమరావతికి అనుసంధానమైన సీడ్ యాక్సెస్ రోడ్డును వెంకటపాలెంలోని ప్రకృతి ఆశ్రమం వరకూ నిర్మించారు. అక్కడ నుండి పెనుమాక రెవెన్యూ పరిధి ఉండటం, రైతులు పూలింగుకు భూములు ఇచ్చేందుకు నిరాకరించడంతో రోడ్డును అంతటితో నిలిపేశారు. ప్రస్తుతం కరకట్టమీద సింగిల్‌లైను రోడ్డుపైనే ప్రయాణాలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి కూడా అదే రోడ్డులో వెళ్లాల్సి వస్తోంది. ఇటీవల కాలంలో దీనిపై ట్రాఫిక్ పెరిగింది. రోడ్డు విస్తరణలో భాగంగా పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ పెనుమాక, ఉండవల్లి పరిధిలో భూములివ్వాల్సిన రైతులతో చర్చలు జరిపారు. కరకట్ట విస్తరించాల్సిన ప్రాంతంలో కొంతమంది ముందుకు వచ్చినా ఇంకా భూములు ఇవ్వాల్సిన రైతులూ ఉన్నారు. తాత్కాలికంగా అయినా రోడ్డును విస్తరించాలనే ఉద్దేశంతో కరకట్టకు ఆనుకుని గతంలో నిర్మించిన మట్టిరోడ్డును తారురోడ్డుగా మార్చి కరకట్టను విస్తరించాలని సిఆర్‌డిఎ నిర్ణయించింది. దీనిలో భాగంగా రూ.60 లక్షలతో టెండర్లను ఆహ్వానించింది. ఈ రోడ్డును వెంకటపాలెంలో సీడ్ యాక్సెస్ రోడ్డు ఆగిపోయిన చోట నుండి కరకట్ట దక్షిణ భాగంలో ఆక్వా కంపెనీ వరకూ నిర్మించనున్నట్లు సిఆర్‌డిఎ అధికారులు తెలిపారు. మరోవైపు ఆక్వా కంపెనీ నుండి ఉండవల్లిలో ఇరిగేషన్ వర్కుషాప్ వరకూ ఎలివేటెడ్ కారిడార్ రూపంలో రోడ్డును విస్తరించేందుకు అవసరమైన ప్రణాళికను అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిద్ధం చేస్తోంది.

సినీ పరిశ్రమ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం...

● పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

సినీ పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శనివారం రాజమహేంద్రవరంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడారు. సినీ పరిశ్రమకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వివరించారు.. జూన్ 1వ తేదీ నుంచి సినిమా థియేటర్ల బంద్ చేయబోతున్నారన్న విషయం కొన్ని రోజులుగా ప్రచారంలోకి వచ్చిందన్నారు. దీనిపై విచారణ నిర్వహిస్తామన్నారు. చిత్ర పరిశ్రమకు ఉపయోగపడే విధానాలను అవలంబించేందుకు వీలుగా ఉంటుందన్న ఉద్దేశంతో ఈ విచారణను నిర్వహిస్తున్నామన్నారు.దీనిపై హోం శాఖ సెక్రటరీ కుమార్ విశ్వజిత్‌తో చర్చించానన్నారు. ఈ అంశంపై లోతుగా విచారణ చేయాలని ఆదేశించానని తెలిపారు. తద్వారా అసలు విషయం వెలుగులోకి వస్తుందని, అనంతరం తమ చర్యలుంటాయన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సినీ పరిశ్రమకు చెందిన పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలను ఆరా తీసి పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటివరకు సినీ పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య అనుకూల వాతావరణం ఉన్నప్పటికీ ఆకస్మికంగా థియేటర్ల బంద్ అనే అంశం తెరపైకి ఎందుకు వచ్చిందో అర్థం కావడం లేదన్నారు. దీని వెనుక ఉన్న కారణాలను ఆరా తీస్తున్నామన్నారు. జూన్ 12న పవన్ కళ్యాణ్ హరిహరవీరమల్లు చిత్రం విడుదలవుతున్న సందర్భంలో ఈ రకమైన వాతావరణం ఎందుకు వచ్చిందో తెలియడం లేదన్నారు. ఇది ఎంత మాత్రం సరికాదన్నారు.

ప్రతి నియోజకవర్గంలో స్టేడియం

● రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

ప్రతి నియోజకవర్గంలో స్టేడియం ఏర్పాటు చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగా కర్నూలు నగరంలో క్రికెట్ స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి వర్యులు టిజి. భరత్ పేర్కొన్నారు. శనివారం కర్నూలు మండలం మునగాలపాడు గ్రామం బాల సాయిబాబా స్కూల్ పక్కన ఉన్న ఎసిఎ క్రికెట్ గ్రౌండ్‌ను రాష్ట్ర మంత్రి టిజి. భరత్, విజయవాడ ఎంపీ ,ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కేశినేని శివనాథ్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ గ్రౌండ్ విస్తీర్ణం ఎంత ఉంది, లెవెలింగ్ పనులు, ఫెన్సింగ్ పనుల పురోగతి గురించి మంత్రి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంచి ఆర్కిటెక్ట్ తో, అవసరమైన సౌకర్యాలతో, మంచి డిజైన్‌లతో స్టేడియంను అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఎసిఎ ప్రతినిధులకు సూచించారు. కేశినేని శివనాథ్ మాట్లాడుతూ గ్రౌండ్ ప్రణాళికను జూన్ 7 నాటికి రూపొందించాలన్నారు.అనంతరం అభివృద్ధి పనులు ప్రారంభించి, త్వరితగతిన గ్రౌండ్ నిర్మాణం పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ గ్రౌండ్ ను రోవర్‌తో సర్వే చేయించి నివేదికను రేపటి లోపు ఇవ్వాలని కలెక్టర్ కర్నూలు మండలం తహశీల్దారు ను ఆదేశించారు. అనంతరం మంత్రి, కలెక్టర్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలించారు. ట్యాంక్ ఎదురుగా ఉన్న భూమిని ఆక్రమణకు గురి కాకుండా చూసుకోవాలని మంత్రి మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆ భూమిని ఎకోపార్క్‌లా అభివృద్ధి చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి దండుమూడి శ్రీనివాస్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, కర్నూల్ ఆర్‌డిఓ సందీప్, కర్నూలు మండల తహశీల్దార్ రమేష్ బాబు, కర్నూలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
బ్రాంచి ఆఫీస్:13/1/10, 1వ అంతస్తు, మెయిన్ రోడ్డు, మాచర్ల, గుంటూరు-522426.

స్వాధీనత ప్రకటన

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో మెస్సర్స్ శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్) యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం మరియు సెక్షన్ 13(12) ప్రకారం, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 3 తో కలిపి, ది.**07-10-2024**న ఒక డిమాండ్ నోటీసు జారీ చేశారు. ఈ నోటీసు ద్వారా ఋణగ్రహీత **శ్రీమతి మాదాసు భారతి మరియు హామీదారు షేక్ మొహిద్దీన్** ను **ది.07-10-2024** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.1,32,36,509/- (అక్షరాలా ఒక్క కోటి ముప్పై రెండు లక్షల ముప్పై ఆరు వేల ఐదు వందల తొమ్మిది రూపాయలు మాత్రమే)** చెల్లించమని కోరారు. అలాగే, నోటీసు అందిన 60 రోజులలోపు చట్టంలోని 13(2) సెక్షన్ క్రింద తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు మరియు వ్యయాలను కూడా చెల్లించమని కోరారు.

ఋణగ్రహీత మరియు హామీదారు మొత్తం చెల్లించడంలో విఫలమవడంతో, ఋణగ్రహీత/హామీదారులకు మరియు సాధారణ ప్రజలకు ఈ నోటీసు ద్వారా తెలియజేయడమేమిటంటే, అధీకృత అధికారి **ది.23-05-2025**న సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూల్ 8 నందు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 ప్రకారం క్రింద వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు.

ఋణగ్రహీత/హామీదారులు, ప్రత్యేకించి సాధారణ ప్రజలు ఈ ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరపరాదని దీని ద్వారా హెచ్చరించడమైనది. ఈ ఆస్తితో చేసే ఏదైనా లావాదేవీ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో మెస్సర్స్ శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)కి **ది.07-10-2024** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.1,32,36,509/- (అక్షరాలా ఒక్క కోటి ముప్పై రెండు లక్షల ముప్పై ఆరు వేల ఐదు వందల తొమ్మిది రూపాయలు మాత్రమే)** మొత్తానికి లోబడి ఉంటుంది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలను ఋణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది.

ఆస్తి వివరాలు (4241/2010 & 4081/2010)

ఋణగ్రహీత శ్రీమతి మాదాసు భారతికి చెందిన ఆస్తి (సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 4081/2010).
పల్నాడు జిల్లా (గతంలో గుంటూరు జిల్లా) – మాచర్ల సబ్ డివిజన్, మాచర్ల మున్సిపల్ ఏరియాలోని బ్లాక్ నెం.14, డోర్ నెం. 14-2-413 దగ్గర, డి.నెం.1092, 1158/3ఎ & 1159/ఎ క్రింద ఉన్న మొత్తం ఎకరా 4-44 సెంట్లలలో 677.6 చదరపు గజాల ఖాళీ స్థలం. **భూమికి హద్దులు: తూర్పు:** 30 లింకుల వెడల్పు బజార్ 79 లింకులు, **దక్షిణం:** ఎ. బ్రహ్మారెడ్డి ఆస్తి 180 లింకులు, **పడమర:** 30 లింకుల వెడల్పు బజార్ 77 లింకులు, **ఉత్తరం:** గుమ్మడి వాణికి చెందిన ఆస్తి 180 లింకులు. ఈ హద్దుల మధ్య 677.6 చదరపు గజాల విస్తీర్ణంలోని ఖాళీ స్థలం ఉంది.

తేది: 23.05.2025 **అధీకృత అధికారి**
ప్రదేశం : మాచర్ల శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

బ్యాంక్ ఆఫ్ బరోడా Bank of Baroda
మంగళగిరి బ్రాంచి
గుడి రోడ్డు, కొత్త ఆర్.టి.సి బస్‌స్టాండ్ ఎదురుగా, మంగళగిరి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522503.
ఫోన్: 08645234188, 234199. E-Mail: mangun@bankofbaroda.com

అమ్మకానికి ముందు నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 (SARFAESI Act-2002) లోని రూల్ 8(6) లోని నిబంధనల ప్రకారం జారీ చేయబడినది.

... మంగళగిరి రెవెన్యూ గ్రామం, పాత అసెస్మెంట్ నెం. 1370, కొత్త అసెస్మెంట్ నెం. 1023011370, పాత డోర్.నెం. 11-589, కొత్త డోర్.నెం.11-582, డి.నెం.180/1 వద్ద నెలకొల్పబడిన ఆర్.సి.సి దాబా ఇల్లు మరియు ఏసిసి షీట్లతో పాటు 2369-0 చ.గ.ల విస్తీర్ణంలో ఉన్న మొత్తం భూమి ఈ దిగువ హద్దులలో **తూర్పు:** మున్సిపల్ రోడ్డు-164.00 అ.లు, **దక్షిణం:** చెంచు వెంకట లక్ష్మీ నారాయణ గారి భూమి -113.00 అ.లు, **పడమర:** నాథూరాం చెరువుకట్ట రోడ్డు-164.00 అ.లు, **ఉత్తరం:** వెంకటేశ్వర్లు గారి భూమి-147.00 అ.లు.

సౌకర్యాల వివరములు	డిమాండ్ నోటీసు తేదీ:	స్వాధీనత నోటీసు తేదీ:	స్వాధీనత నోటీసు ప్రచురించిన తేదీ:
క్యాష్ క్రెడిట్ 54120500001536	30-04-2024	25-07-2024	27-07-2024

చెల్లించాల్సిన బకాయి మొత్తం: రూ.4,07,61,308.56 (అక్షరాలా నాలుగు కోట్ల ఏడు లక్షల అరవై ఒక్క వేల మూడు వందల ఎనిమిది రూపాయల యాభై ఆరు పైసలు మాత్రమే) **ది.30.04.2024** నాటికి + **ది. 01.05.2024** నుండి వర్తించని వడ్డీ మరియు ఇతర ఛార్జీలు ఏవైనా ఉంటే చెల్లించే వరకు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైనా ఇతర న్యాయ పరిధిలో బ్యాంక్‌కు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా పక్షపాతం లేకుండా ఈ నోటీసు జారీ చేయటమైనది.

తేది: 15-05-2025 **చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి**
ప్రదేశము: గుంటూరు **బ్యాంక్ ఆఫ్ బరోడా**

బ్యాంక్ ఆఫ్ బరోడా Bank of Baroda
మంగళగిరి బ్రాంచి
గుడి రోడ్డు, కొత్త ఆర్.టి.సి బస్‌స్టాండ్ ఎదురుగా, మంగళగిరి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522503.
ఫోన్: 08645234188, 234199. E-Mail: mangun@bankofbaroda.com

అమ్మకానికి ముందు నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 (SARFAESI Act-2002) లోని రూల్ 8(6) లోని నిబంధనల ప్రకారం జారీ చేయబడినది.

... ఆస్తి-70 అ.లు, **పడమర:** రోడ్డు-90 అ.లు, **ఉత్తరం:** మహమ్మద్ ఇర్ఫాన్ గారి ఆస్తి-70 అ.లు. పై హద్దులలో 700 చ.గ.లు లేదా 585.291 విస్తీర్ణం చ.మీ.లలో అవిభక్త మరియు పేర్కొనబడని వాటా 35 చ.గ.లు లేదా 29.26 చ.మీ.లు. షెడ్యూల్-బి: షెడ్యూల్-ఏలో నిర్మించిన "అమూల్య అపార్ట్‌మెంట్స్" పేరు మరియు శైలిలో మూడవ అంతస్తు, ఫ్లాట్ నెం.1 నివాస భవనంకు హద్దులు: **తూర్పు:** కామన్ కారిడార్, **దక్షిణం:** లిఫ్ట్ మరియు శూన్యాకాశము, **పడమర:** శూన్యాకాశము, **ఉత్తరం:** శూన్యాకాశము. పైన వివరించిన హద్దులలో 970 చ.అ.ల ప్లింత్ ఏరియా, అన్ని సౌకర్యాలతో పాటు, కామన్ ఏరియా వాటిపై సులభ హక్కులతో సహా 3వ అంతస్తులో ఫ్లాట్ నెం.1.

సౌకర్యాల వివరములు	డిమాండ్ నోటీసు తేదీ:	స్వాధీనత నోటీసు తేదీ:	స్వాధీనత నోటీసు ప్రచురించిన తేదీ:
క్యాష్ క్రెడిట్ 54120500001529	10-05-2024	25-07-2024	27-07-2024

చెల్లించాల్సిన బకాయి మొత్తం: రూ.5,01,31,782.96 (అక్షరాలా ఐదు కోట్ల ఒక్క లక్ష ముప్పై ఒక్క వేల ఏడు వందల ఎనభై రెండు రూపాయల తొంభై ఆరు పైసలు మాత్రమే) **ది.10.05.2025** నాటికి + **ది. 11.05.2025** నుండి వర్తించని వడ్డీ మరియు ఇతర ఛార్జీలు ఏవైనా ఉంటే చెల్లించే వరకు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైనా ఇతర న్యాయ పరిధిలో బ్యాంక్‌కు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా పక్షపాతం లేకుండా ఈ నోటీసు జారీ చేయటమైనది.

తేది: 15-05-2025 **చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి**
ప్రదేశము: గుంటూరు **బ్యాంక్ ఆఫ్ బరోడా**

HDFC BANK **హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్**
బ్రాంచ్: బ్లాక్-బి, 3వ అంతస్తు, మీనాక్షి టెక్ పార్క్, గచ్చిబౌలి, హైదరాబాద్-500081
Tel No: 18002100018/040-66588491- CIN L65920MH1994PLC080618 Website: www.hdfcbank.com

డిమాండ్ నోటీసు

ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం) యొక్క సెక్షన్ 13(2) క్రింద.

ఏదైతే క్రింది సంతకందారు **హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్** (ఇటీవలి హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్ అనునది తేది.17 మార్చి 2023నాటి ఉత్తర్వుల ఆధారంగా గౌరవఎన్‌సిఎల్‌టి-ముంబయి వారి ఆమోదంతో స్కీమ్ ఆఫ్ అమాల్గమేషన్ యొక్క విర్చ్యూ ద్వారా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమాల్గమేషన్ చేయబడినది) **(హెచ్‌డిఎఫ్‌సి)** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం) యొక్క సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి, సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసులు జారీచేసి, ఇందు జాబితాలోని రుణగ్రహీతలు/ చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులను దిగువ ఇచ్చిన వివరాల ప్రకారం, సదరు నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా సదరు డిమాండ్ నోటీసుల్లో పేర్కొనబడిన మొత్తాలను చెల్లించవలసిందిగా కోరబడినది. సదరు రుణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధుల గతంలో తెలిసిన చిరునామాల ఆవరణల వద్ద నోటీసు అతికించుట జరిగింది. సదరు నోటీసుల కాపీలు క్రింది సంతకందారు వద్ద అందుబాటులో ఉంటాయి మరియు సదరు రుణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులు అవసరమైనచో, క్రింది సంతకందారు నుండి ఏదేని పనిదినమున పనివేళల్లో సదరు కాపీలను సేకరించవచ్చును.
పై దానిననుసరించి, ఇందుమూలంగా మరోసారి సదరు రుణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులకు ప్రకటన ఇవ్వడమేమనగా, ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 60 రోజుల్లోగా ఇందు దిగువ వారి పేర్లకు ఎదురుగా పేర్కొనబడిన మొత్తాలను కాలం(సి)లో దిగువ పేర్కొనబడిన సదరు తేదీ నుండి చెల్లించు తేదీ/రియలైజేషన్ వరకు సదరు డిమాండ్ నోటీసుల్లో వివరించినట్లు వార్షికానికి 18%తో తదుపరి వడ్డీతోపాటు సదరు రుణగ్రహీతలచే నిర్వహించబడిన ఏవేని రుణఒప్పందం మరియు ఇతర పత్రాలు/వ్రాతలుతో చదువుకోగలరు. రుణాన్ని తిరిగిచెల్లించుటకుగాను హామీగా సదరు రుణగ్రహీతలచేత దిగువ సెక్యూర్డ్ అసెట్స్‌ను **హెచ్‌డిఎఫ్‌సి** వారికి తాకట్టుపెట్టబడినవి. సెక్యూర్డ్అసెట్స్‌ను విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలను రుణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

క్ర. సం.	రుణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/ చట్టబద్ధ ప్రతినిధుల పేరు	మొత్తాలు బాకీపడిన బకాయిలు	డిమాండ్ నోటీసు తేది	సెక్యూర్డ్ అసెట్స్/ స్థిరాస్తులకు సంబంధించిన వివరణ
(a)	(b)	(C)	(d)	(e)
1	శ్రీ ఎం.వి. ఆదినారాయణ మూర్తి (రుణగ్రహీత)	28-ఫిబ్రవరి-2025 నాటికి **రూ.32,82,528/-** (రూపాయలు ముప్పై ఒండు లక్షల ఎనభై రెండు వేల ఐదు వందల ఇరవై ఎనిమిది మాత్రమే)	28-APR-2025	ఎస్.వి.నగర్, ఎస్ నాగారం గ్రామం & గ్రామపంచాయతీ, కీసర మండలం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ రాష్ట్రం పరిధిలోని సర్వే నెం.లు304/1 & 309 లోని 1190.66 చ.గ.లకుగాను 37.00 చ.గ.ల విస్తీర్ణపు విడదీయలేని స్థల భాగంతో పాటుగా రామ్మడి ఏరియాలు మరియు కార్ పార్కింగ్‌తోకలిపి 1050 చ.గ.లు లేదా 97.55 చ.మీ.ల నిర్మితమైన ఏరియా కలిగిన **"తిరమల్ హైట్స్"** యొక్క గ్రౌండ్ ఫ ఫ్లోర్‌లోని నివాస ఫ్లాట్ నెం.జి-5 మొత్తం భాగం మరియు దీని సరిహద్దులు: **ఫ్లాట్ సరిహద్దులు: ఉత్తరం:** ఫ్లాట్ నెం.జి-6, **దక్షిణం:** విజయ హాస్పిటల్, **తూర్పు:** ఫ్లాట్ నెం.జి-4 & కారిడార్, **పడమర:** ఓపెన్ స్పేస్ & ఇతరుల ఫ్లాట్లు. **స్థలానికి సరిహద్దులు: ఉత్తరం:** రోడ్డు & చందూలాల్ పటేల్ బహిరంగ స్థలం, **దక్షిణం:** విజయ హాస్పిటల్ ఖాళీ స్థలం, **తూర్పు:** పొరుగువారి ఖాళీ స్థలం, **పడమర:** పొరుగువారి ఖాళీ స్థలం.
2	శ్రీమతి సిహెచ్ ఎన్ వి శివ కుమార్ (రుణగ్రహీత) శ్రీమతి సిహెచ్ విజయ లక్ష్మి (సహ-రుణగ్రహీత)	28-ఫిబ్రవరి-2025 నాటికి **రూ.31,61,825/-** (రూపాయలు ముప్పై ఒక లక్షల అరవై ఒక వేల ఎనిమిది వందల ఇరవై ఐదు మాత్రమే)	28-APR-2025	బ్లాక్ నెం.7, సుబాష్ నగర్, జీడిమెట్ల గ్రామం, కుత్బుల్లాపూర్ మండలం, ఆర్.ఆర్.జిల్లా (ఇప్పుడు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా) తెలంగాణ రాష్ట్రం పరిధిలోని సర్వే నెం.316/ ఏఏ, 317, 318, 319 మరియు 320/ఏఏలోని ఎక 2.07 గంటలు లేదా 10,527 చ.గ.ల విస్తీర్ణపు స్థలంలో నిర్మించిన సెల్లార్, సబ్-సెల్లార్, గ్రౌడ్ + 5 పై అంతస్తులు కలిగియున్న **"మారుతి సన్ సిటీ"** గా తెలిసిన నివాస బిల్డింగ్ కాంప్లెక్స్‌లోని 10,527 చ.గ.ల పూర్తి విస్తీర్ణం నుండి (యుడిఎస్ కార్ పార్కింగ్‌తోకలిపి) 36.75 చ.గ.ల విస్తీర్ణపు విడదీయలేని స్థల భాగంతోపాటుగా (రామ్మడి ఏరియాతోకలిపి) 1490.27 చ.గ.లు లేదా 138.45 చ.మీ.ల విస్తీర్ణపు నిర్మితమైన ఏరియాతో రెండవ అంతస్తు (డోర్ నెం.07025/2/213), పిటిఐఎన్ నెం.12504072474లోని ఫ్లాట్ నెం.213 మొత్తం భాగం మరియు ఈ క్రింది విధంగా సరిహద్దులు: **ఉత్తరం వైపు:** ఓపెన్ టు స్కై & ఫ్లాట్ నెం.211, **దక్షిణం వైపు:** ఓపెన్ టు స్కై & ఫ్లాట్ నెం. 215, **తూర్పువైపు:** కారిడార్ మరియు ఫ్లాట్ నెం.214, **పడమర వైపు:** ఓపెన్ టు స్కై.

ఒకవేళ సదరు రుణగ్రహీతలు చెల్లించు/రియలైజేషన్ తేదీ వరకు వర్తించబడు వార్షికానికి 18% తదుపరి వడ్డీ, ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు, చార్జీలు మొ॥వాటితో పై చెప్పినట్లు **హెచ్‌డిఎఫ్‌సి** వారికి చెల్లించుటలో విఫలం చెందినట్లైతే, **హెచ్‌డిఎఫ్‌సి** యొక్క ఖర్చులు& కన్సిక్వెన్సెస్‌గా సదరు రుణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధుల పూర్తి బాధ్యతపైననే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) మరియు వర్తించదు రూల్స్ క్రింద పై సెక్యూర్డ్ అసెట్స్/స్థిరాస్తుల పై చర్యలు తీసుకొంటుంది.
సదరు రుణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులు సదరు చట్టం క్రింద **హెచ్‌డిఎఫ్‌సి** యొక్క వ్రాతపూర్వక మందస్తు అనుమతిలేనిదే అమ్మకం, లీజు లేదా ఇతర విధానాల ద్వారా పై చెప్పిన సెక్యూర్డ్ అసెట్స్/స్థిరాస్తులను బదిలీచేయలేరు. ఈ చట్టం లేదా దాని క్రింద రూపొందించిన రూల్స్ యొక్క నియమాలలో ఎవరైనా ఉల్లంగించినట్లైతే, చట్టం క్రింద ఇవ్వబడినట్లుగా జైలు శిక్ష మరియు/లేదా జరిమానాకు బాధ్యులగుదురు.

తేది: 22 మే, 2025 హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తరపున
ప్రదేశం: హైదరాబాద్ సం/-
అధీకృత అధికారి
రిజిస్టర్డు ఆఫీసు: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్ (వెస్ట్), ముంబయి-400020.

సీఎం పర్యటనకు పటిష్ట పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఈనెల 24వ తేదీ నుండి 26వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లా శాంతిపురం మండలంలో నూతనంగా నిర్మించిన తన సొంత ఇంటి గృహప్రవేశానికి విచ్చేయుచున్న నేపథ్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పి మణికంఠ చందోలు పరిశీలించారు. భద్రతాపరమైన చర్యలను పటిష్టంగా నిర్వహించాలని ఈ పర్యటనలో భాగంగా ఎటువంటి అసమర్ధత కనబరచరాదని తెలిపారు. అలాగే సిఎం తిరుగు ప్రయాణం అయ్యే వరకూ ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా గట్టి బందోబస్తు భద్రత కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బందోబస్తు అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తూ రూట్ మ్యాప్‌ను ప్రదర్శించి సిఎం పర్యటనను గురించి క్షుణ్ణంగా వివరించారు. సిఎం ఇల్లు, పరిసర ప్రాంతాలు, హెలిప్యాడ్, రోడ్డు మార్గాన కుప్పం చేరుకుంటారు కనుక రోడ్డు మార్గాన బందోబస్తులో ఉన్న సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉంటూ ఏవైనా అనుమానాస్పద వాహనాలు ఉన్న లేదా వ్యక్తులు సంచరిస్తున్న వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలో గల సీతంపేట బాలికల, బాలుర, పెద్దమడి బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదట సంవత్సరం ప్రవేశానికి శనివారం సీతంపేట ఐటిడిఎ సమీపంలో ఉన్న బాలుర గురుకుల కళాశాల ప్రాంగణంలో పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మెరిట్ మార్కులు వచ్చిన విద్యార్థులకు ప్రవేశ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పదవ తరగతిలో వచ్చిన మార్కులు మెరిట్ ఆధారంగా సీట్లు బర్తీ చేయాలని గురుకుల ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు.

పిడుగుపాటుకు యువకుడు మృతి

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం పెద్దకేసినాయుడు పేటకు చెందిన మోర్చి లక్ష్మీపతి (21) టెక్కలిలో పిడుగు పాటుకు గురై మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టెక్కలి వై కూడలి సమీపంలో మూలపేట పోర్టుకు రహదారి నిర్మాణానికి చెందిన ప్రొక్లెయినర్‌లో కొద్ది రోజులుగా హెల్పర్‌గా పని చేస్తున్నాడు. శనివారం సాయంత్రం అకస్మాత్తుగా వాతావరణం మారి గాలులు వీచాయి. ఈ క్రమంలో అక్కడే ప్రొక్లెయినర్‌లో విధులు నిర్వహిస్తున్న లక్ష్మీపతికి సమీపంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. టెక్కలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎవరి పాత్ర ఎంత ?

- సిఐడికి అచ్యుతాపురం సైబర్ నేరాల కేసు
- నేర మూలాలపై లోతైన విచారణ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం కేంద్రంగా కొంతకాలం నుంచి జరుగుతున్న అంతర్జాతీయ సైబర్ నేరాల మూలాలను ఛేదించేందుకు కేసు దర్యాపును క్రైమ్ ఇన్విస్టిగేషన్ డిపార్టుమెంట్ (సిఐడి)కి ప్రభుత్వం అప్పగించింది. కొంతమంది స్థానికుల సహకారం మొదలుకొని అంతర్జాతీ స్థాయి వరకూ.. అమెరికా సహా పలు దేశాలతో సంబధాలు కలిగిన ఈ నేర ముఠా రహస్య కార్యకలాపాలపై లోతైన విచారణ చేయాల్సివుండడంతో ఈ కేసును సిఐడికి అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. జాతీయ, అంతర్జాతీయ దర్యాప్తు సంస్థల సాయం తీసుకొని ఈ నేర పునాదులు ఇక్కడ ఎప్పుడు పడ్డాయి? దీనికి ప్రధాన సూత్రధారులెవరు? ఇందులో భాగస్వాములెవరు? తోడ్పడుతున్నదెవరు? సైబర్ నేరంలో ఎవరిపాత్ర ఎంత ? స్థానికులు ఎవరెవరు సహకరిస్తూ వస్తున్నారు ? స్థానిక పోలీసులు ఈ నేర ముఠాను ఎందుకు గుర్తించలేకపోయారు ? గుర్తించినా తెలియనట్లు వున్నారా? అనే పలు కోణాల నుంచి దర్యాపు చేసేందుకు ఈ కేసును సిఐడికి బదలాయించాలని ప్రభుత్వం భావించినట్లు తెలిసింది.

అచ్యుతాపురం మండలం, భోగాపురం పవన్ రెసిడెన్సీలో ఫ్లాట్లను ఆద్దెకు తీసుకొని నకిలీ కాల్ సెంటర్లతో నేరాలకు పాల్పడిన 33 మందిని పోలీసులు ఇటీవల అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కాల్ సెంటర్ ద్వారా నెలకు కోట్ల రూపాయల కార్యకలాపాలు జరిగాయి. ఎస్‌పి తుహిన్‌సిన్హాకు అందిన సమాచారంతో పరవాడ డిఎస్‌పి విష్ణుస్వరూప్ నేతృత్వంలో జరిగిన పోలీసు సోదాలతో పలువురు పట్టుబడ్డారు. అదుపులోకి తీసుకొని విచారించడంతో నేర రహస్య వ్యవహారం బయటపడింది. గుజరాత్, అసోం, నాగాలండ్, మేఘాలయలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలని చెప్పి ఇక్కడ సైబర్ నేరాలను వారితో చేయించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ నేరాలకు మహారాష్ట్ర, రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు ప్రధాన సూత్రదారులుగా గుర్తించారు. అంతర్జాతీయ స్థాయిలో సంబంధాలు కలిగిన ఈ నేర ముఠా మూలాలను పట్టుకొనేందుకు కేసు దర్యాపును సిఐడికి ప్రభుత్వం అప్పగించింది.

ఆదివాసీలకు ఆరోగ్య సేవలందేనా?

- ఆరేళ్లుగా సేవలు కరువు
- మరో పది రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం
- ఏటా ఆగని విద్యార్థుల మరణాలు
- మంత్రి హామీ అమలు ఎప్పుడో?

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 55 ఆశ్రమ పాఠశాలలు, సీతంపేట ఐటిడిఎ పరిధిలో43 ఆశ్రమ పాఠశాలల్లో వేలాదిమంది విద్యార్థులు చదువుతున్నారు. నిత్యం విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతూ సమీపంలోని ఆసుపత్రులకు వెళ్లడం పరిపాటిగా మారింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు వైద్యం కోసం వస్తున్న వారిలో ఎక్కువమంది విద్యార్థులు కనిపిస్తున్నారు. ఏటా జూన్ నుంచి కురుస్తున్న వర్షాలకు విద్యార్థులు వ్యాధులు బారిన పడుతున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందక ప్రతి ఏడాది పదుల సంఖ్యలో మరణాలు జరుగుతున్నాయి. అయినా పాలక ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు వీటి నివారణా చర్యలు చేపట్టడంలో శ్రద్ధ వహించడం లేదు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు స్థానికంగా వైద్యం అందించే ఆరోగ్య సిబ్బంది లేకపోవడంతో సకాలంలో వైద్యం అందక విద్యార్థులు మరణిస్తున్నారని పలుమార్లు గిరిజన సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విద్యార్థులకు పౌష్టికాహారం అందడంలేదని, విద్యార్థుల్లో రక్తహీనత ఎక్కువగా కనిపిస్తుందని గిరిజన విద్యార్థి సంఘాల నాయకులు అంటున్నారు. ప్రతి ఏటా మన్యం జిల్లాలో వందలాది మంది విద్యార్థులు అనారోగ్యానికి గురై ఆస్పత్రుల్లో చేరడం పరిపాటిగా మారుతుంది. ఎంతో ఆసక్తితో చదువుకోడానికి వచ్చిన విద్యార్థులు అనారోగ్యానికి గురవ్వడంతో చదువుకు దూరమవుతున్నారు. చదువుకోడానికి వచ్చిన విద్యార్థులు ఏదో ఒక కారణం చేత పసిప్రాయంలోనే

మృత్యు ఒడికి చేరుతూనే ఉన్నారు. విద్యార్థులు మరణించిన సందర్భాల్లో మాత్రమే జిల్లాస్థాయి, ఐటిడిఎ అధికారులు ఆశ్రమ పాఠశాలల పరిశీలన వరకే పరిమితం కావడం కనిపిస్తోంది.

గతంలో అయితే నెల రోజుల్లో నాలుగైదు ఆశ్రమ పాఠశాలలను డిడి, పిఒ స్థాయి అధికారులు సందర్శించే సందర్భాలు ఉండేవి. విద్యార్థుల మరణాలు అరికట్టడం, మరణాలకు గల కారణాలు వంటి వాటిపై విశ్లేషణ చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా కొరవడింది. దీంతో విద్యార్థులు ఏడాది పొడవునా ఏదో ఒకచోట చనిపోతూనే ఉన్నారని గిరిజన సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. ఇక నుంచి విద్యార్థుల మరణాలు నివారణకు, సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి ఆరోగ్య కార్యకర్తలను తక్షణమే నియమించాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉంది.

రక్షణ కరువు

ఎంతో ఆశతో, ఆసక్తితో చదువుకోడానికి వస్తున్న విద్యార్థులు ఆరోగ్యానికి రక్షణ కరువైంది. అనారోగ్యం వాటిల్లితే స్థానికంగా వైద్య సేవలందించే ఆరోగ్య కార్యకర్తలు లేకపోవడం విచారకరం. గత కొన్నేళ్లుగా ఈ సమస్య ఉన్నా పాలక ప్రభుత్వాలు పట్టించుకునే పాపాన పోలేదు. ఈ విద్యా సంవత్సరం నాటికైనా ఆదివాసీ ఆరోగ్య కార్యకర్తలను నియమించాలి.

మండంగి రమణ,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి.

కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్‌ను.. 3వ కాంటూరుకు కుదించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

ప్రజాశక్తి - నరసాపురం

కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్‌ను మూడో కాంటూరుకు కుదించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అల్లూరి సత్యనారాయణరాజు సాంస్కృతిక కేంద్రంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథి బలరాం మాట్లాడుతూ... కొల్లేరు ప్రాంతంలో ఎకో సెన్సిటివ్ జోన్‌ను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. దీంతో పూర్వ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు వంద గ్రామాలు, 15 మండలాలపై ప్రభావం పడనుందన్నారు. లక్షలాది మంది ప్రజలు అనేక విధాలుగా నష్టపోతారన్నారు. ప్రస్తుత పశ్చిమగోదావరి జిల్లాలో ఆకివీడు, ఉండి, కాళ్ల, గణపవరం, పెంటపాడు వంటి మండలాల్లో సుమారు 40 గ్రామాల్లో ప్రజలు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. గతంలో అసెంబ్లీలో హామీ ఇచ్చిన విధంగా కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్‌ను మూడో కాంటూరుకు కుదించాలని డిమాండ్ చేశారు. అయితే ఆ హామీకి విరుద్ధంగా ఎకో సెన్సిటివ్ జోన్‌ను పదో కాంటూరుకు చేర్చుతామని, 10 కిలోమీటర్లు పెంచుతామని అంటున్నారన్నారు. దీనివల్ల కొల్లేరు ప్రజలు, మత్స్యకారులు, సొసైటీలు, జిరాయితీదారులు నష్టపోతారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఎకో సెన్సిటివ్ జోన్‌ను తక్షణం మూడో కాంటూరుకు కుదించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన చర్యలను ఉపసంహరించుకోకపోతే ప్రజలందరినీ ఐక్యం చేసి ఉద్యమిస్తామని బలరాం హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంటు అమ్మకం తక్షణం ఆపాలని బలరాం డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రాణత్యాగాలతో పోరాడి సాధించుకున్న అతి పెద్ద ప్రభుత్వ రంగ పరిశ్రమ అన్నారు. ఒకవైపు వేల కోట్ల రూపాయలు ప్యాకేజీ ప్రకటించామని చెబుతూనే మరోవైపు కాంట్రాక్టు, పర్మినెంట్ కార్మికులను అక్రమంగా తొలగించడం, ఖాళీలను భర్తీ చేయకపోవడం, సొంత బొగ్గు గనులను కేటాయించకపోవడం, పోర్టుకు అనుమతి ఇవ్వకపోవడం, నిధులు కేటాయించకపోవడం అంటే ఆచరణలో అన్ని విధాలా విశాఖ ఉక్కును అమ్మడానికి ప్రయత్నించడమేనని అన్నారు.

విశాఖ ఉక్కును ప్రజలందరూ ఐక్యంగా పోరాడి కాపాడుకోవాలని బలరాం పిలుపునిచ్చారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యావసరాల పంపిణీలో ఎండియు వ్యవస్థను రద్దు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, దీంతోపాటు రేషన్ షాపుల వద్ద కూడా సరుకుల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రజాపంపిణీ నిర్వహణలో లోపాలు సరిదిద్ది, ఎండియు వ్యవస్థను మరింత మెరుగుపర్చాలని, అవినీతికి తావు లేకుండా ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేయాలని కోరారు.

పోలవరం నిర్వాసితుల పునరావాస పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి- పాడేరు (అల్లూరి జిల్లా)

పోలవరం ప్రాజెక్టు నిర్మాసితుల పునరావాస పనులను వేగవంతం చేయాలని అల్లూరి జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన అల్లూరి కలెక్టరేట్ నుండి తహశీల్దార్లు, ఎంపిడిఒలు, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలవరం పునరావాస పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ వారం రోజుల్లో పునరావాస కాలనీలకు 12 గ్రామాలను తరలించాలని సూచించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణల స్వాదీనంపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. జిల్లా, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. బంజరు, ప్రభుత్వ, నీటి పారుదల భూములు, చెరువులు ఆక్రమణలను ఈ నెల 31లోపు గుర్తించి రిపోర్టులు సమర్పించాలని ఆదేశించారు. ఆక్రమణదారులకు ఫారం 7 నోటీస్ జారీ చేయాలని సూచించారు. స్పీకింగ్ ఆర్డర్ జారీ చేశాక ఎన్ని రోజుల్లో తొలగిస్తారని తహశీల్దార్లను ప్రశ్నించారు. ఎల్‌టిఆర్ చట్టం ప్రకారం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలను ఎం. బుక్ నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ, పోలవరం ప్రాజెక్టు పరిపాలనాధికారి వి. అభిషేక్, సబ్ కలెక్టర్లు శౌర్యమన్ పటేల్ కల్పశ్రీ, చింతూరు పి ఓ అపూర్వ భరత్, డి ఆర్ ఓ కె.పద్మలత పాల్గొన్నారు.

ఎన్నికలు సులభతరం దిశగా సాఫ్ట్‌వేర్

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల ప్రక్రియను సులభతరం చేసేందుకుగాను ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధిచేసే దిశగా ప్రణాళికలు చేపడుతున్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని పేర్కొన్నారు. శనివారం ఆమె జివిఎంసి అధికారులతో కలిసి జివిఎంసి ప్రధాన కార్యాలయంలోగల సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో జరగబోయే ఎన్నికలలో ఓటర్ల నమోదు, ఓటర్ల లిస్ట్ తయారీ, సంబంధిత పోలింగ్ స్టేషన్లు, పోటీ చేయు అభ్యర్థుల వివరాలు, నామినేషన్ల జాబితా, ఎన్నికలకు సంబంధించిన తదితర ప్రక్రియలను సులభతరం చేసేందుకుగాను ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నామని, అందుకు సంబంధించిన వివరాలతో కూడిన సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను వివరించి వాటిపై మరిన్ని అవగాహనాపరమైన సలహాలను, సూచనలను తీసుకునేందుకు ఈ సమావేశాన్ని తొలుత జివిఎంసిలో ఏర్పాటు చేశామని అన్నారు. తాజా సాఫ్ట్‌వేర్‌లోని అంశాలను ఆమె పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. 1200 మందికి ఒక పోలింగ్ స్టేషన్ తయారీ, వివరాలు, రూట్ మ్యాప్ కేటాయింపు, ఓటర్ లిస్ట్ తయారీ, ఓటరు, పోటీచేయు అభ్యర్థులు స్వయంగా తమ పేరును తెలుసుకోవడం, ఓటరు డోర్ నెంబర్ సవరణ, ఓటరు వేకెన్సీ, చనిపోయిన, డిస్ క్వాలిఫై వివరాలు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలు, పోలింగ్ స్టేషన్ల వివరాలు, పోటీ చేయు అభ్యర్థుల పేర్లు, రిజర్వేషన్లు, ఎన్నికల గుర్తుల కేటాయింపు తదితర ఎన్నికలకు సంబంధించిన నిర్వహణ వివరాలన్నీ నూతన సాఫ్ట్‌వేర్‌లో సులభతరంగా ఉండనున్నాయన్నారు. తద్వారా ఎన్నికలు నిర్వహించు అధికారులకు, సిబ్బందికి సమయం వృథాకాకుండా ఉంటుందన్నారు. అనంతరం సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన అప్లికేషన్ పూర్తి వివరాలను స్టేట్ ఎలక్షన్ కమిషన్ సెక్షన్ ఆఫీసర్ కెఎన్.కుమార్ పిపిటి ద్వారా అధికారులకు వివరించారు. కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డివి.రమణమూర్తి, ఎస్ఎస్.వర్మ, అందరు జోనల్ కమిషనర్లు, డిసిఆర్ ఎస్.శ్రీనివాస్, పర్యవేక్షక ఇంజినీర్ కృష్ణారావు, సిటీ ప్లానర్ ధనుంజయరెడ్డి, డిసిపి రామ్మోహనరావు పాల్గొన్నారు.

15శాతం అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలి

- 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆర్థికాభివృద్ధి 15శాతం లక్ష్యంగా పనిచేయాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని పథకాలు రూపొందించాలని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. అనకాపల్లి కలెక్టరు కార్యాలయంలో శనివారం కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌తో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో దినకర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో ఇప్పుడున్న సవాళ్లను అధిగమించి విజయవంతంగా "వికసిత అనకాపల్లి జిల్లా"గా రూపుదిద్దడమే లక్ష్యంతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఉపాధిహామీపథకంలో పనిదినాలు కల్పన, మెటీరియల్ కాంపోనెంట్ లో లక్ష్యాన్నిమించి పనిచేసినందుకు అధికార యంత్రాంగాన్ని అభినందించారు. 2019 - 24 మధ్య జరిగిన అవకతవకలు, ప్రస్తుత అమలు తీరు, ప్రతి గ్రామ పరిధిలోని ప్రతి గృహానికి సురక్షిత తాగునీరు ఇచ్చే సంకల్పంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జల్ జీవన్ మిషన్ అమలు తీరు, గ్రామీణసడక్ యోజన, లాక్ పతి దీదీ, గరీబ్ కళ్యాణ్ అన్నయోజన, పీఎంసూర్యఘర్, కుసుమ్, పీఎంఆవాసయోజన, పీఎం విశ్వకర్మ యోజన, పీఎం స్వనిధి వంటి కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుతో పాటు, పర్యాటక రంగం అభివృద్ధి, ఆరోగ్యం కోసం చెక్కర స్థానంలో వినియోగించే విధంగా తాటి బెల్లం - ఆర్గానిక్ బెల్లం ఉత్పత్తికి అనకాపల్లి బ్రాండ్ ఇమేజ్ కల్పన దిశగా కార్యచరాణ తదితర అంశాలపైన జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంటు కార్పొరేషను ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఎపి స్టేట్ హౌసింగు కార్పొరేషను ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, కొప్పులవెలమ కార్పొరేషను ఛైర్మన్ పి.వి.జి. కుమార్, ఎపి గవర కార్పొరేషను ఛైర్మన్ మల్ల సురేంద్ర, కొప్పుల వెలమ కార్పొరేషను డైరెక్టరు ఈర్లె శ్రీరామ్మూర్తి, డిఆర్ఒ వై. సత్యనారాయణ రావు, హౌసింగు ప్రోజెక్టు డైరెక్టరు వై. శ్రీనివాస్, డ్వామా ప్రోజెక్టు డైరెక్టరు ఆర్. పూర్ణిమాదేవి అధికారులు పాల్గొన్నారు.

ప్రయివేటు దోపిడీ!

- ఆరోగ్య శ్రీ ఉన్నా అదనపు వసూళ్లే
- నాలుగు ఆసుపత్రులకు జరిమానా

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలోని కొన్ని ప్రయివేటు ఆసుపత్రుల్లో దోపిడీ రాజ్యమేలుతోంది. ఎవరికైనా ఆరోగ్య బాగోలేదని పోతే ఆస్తులు అమ్ముకునే పరిస్థితులు నెలకొన్నాయి. అది కూడా వైద్యం సక్రమంగా అందించే పరిస్థితుల్లేక ప్రాణాల మీదకు కూడా వస్తున్నాయి. జిల్లాలోని ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీ అంశం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ ఇటీవల చర్చకు రావడం గమనార్హం.

తప్పుడు వైద్యంతో ప్రాణాల మీదకు..

అనంతపురం నగరంలో ఉండే ఒక వ్యక్తి బైకులో వెళ్తూ కిందపడి కాలుకు చిన్నపాటి ఫ్యాక్చర్ అయింది. సదరు వ్యక్తి నగరంలోని ఒక ప్రయివేటు నర్సింగ్ హోంలో ఆపరేషన్ నిమిత్తం వెళ్లాడు. అక్కడి వైద్యులు బెంగళూరు నుంచి నిపుణులొచ్చి వైద్యం అందిస్తారని చెప్పడంతో వైద్యం చేయించుకునేందుకు ఆయన అంగీకరించాడు. బెంగుళూరు నుంచి వస్తారని చెప్పిన నిపుణుడు రాకపోవడంతో వారి ఆసుపత్రిలో పని చేస్తున్న వారే శస్త్ర చికిత్స చేశారు. ఆ శస్త్ర చికిత్స వికటించి సదరు వ్యక్తి ప్రాణాల మీదకొచ్చింది. కుటుంబ సభ్యులు వెంటనే హుటాహుటిన బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్సలు చేయించుకుని ఆయన ప్రాణాలతో బతికి బయటపడ్డాడు. వికటించిన వైద్యాన్ని సరిచేయడానికి రూ.20 లక్షల వరకు ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొదట చికిత్సలు చేసిన అనంతలోని కార్పొరేట్ ఆసుపత్రి మాత్రం తమకేమీ సంబంధం లేదన్నట్టుగా మిన్నకుండిపోవడం గమనార్హం.

గుండె జబ్బు లేకున్నా గుండె ఆపరేషన్..!

శెట్టూరు మండలానికి చెందిన ఒక యువకుడు చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లగా వెంటనే గుండెకు శస్త్రచికిత్స చేయాలని అక్కడి వైద్యులు చెప్పారు. అనుమానం వచ్చి వాళ్లు ఆ ఆసుపత్రిలో కాకుండా బెంగళూరులోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు.. సదరు వ్యక్తికి ఎటువంటి గుండె జబ్బులేదని తేల్చారు. అయితే అనంతలోని కార్పొరేట్ ఆసుపత్రి మాత్రం ఏమీ లేకున్నా ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేసి డబ్బులు దండుకునేందుకు సిద్ధపడినట్టు ఆరోపణలున్నాయి.

మొక్కుబడి జరిమానాలతో సరి

పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందివ్వాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కోట్లు ఖర్చు పెట్టి ఆరోగ్య శ్రీని అమలు చేస్తోంది. అనంతపురం నగరంలోని ప్రయివేటు, కార్పొరేట్ ఆసుపత్రులు మాత్రం ప్రభుత్వమిచ్చే డబ్బులు సరిపోవు... మంచి వైద్యమందివ్వాలి.. అదనంగా డబ్బులు పెట్టుకోవాలని రోగులకు చెబుతున్నారు. రోగులు విధిలేని పరిస్థితుల్లో డబ్బులు చెల్లిస్తున్నారు. ఈ రకంగా చెల్లించి ఆరోపణలొచ్చిన వాటిపై వైద్యఆరోగ్యశాఖ తనిఖీల్లోనూ తేలింది. ఇలా తనిఖీలు నిర్వహించి డిస్ట్రిక్టు డిసిప్లనరీ కమిటీ తేల్చినవే నాలుగు ఆసుపత్రులున్నాయి. ఇందులో సాయిరత్న ఆసుపత్రి రోగి నుంచి ఎనిమిది వేలు అదనంగా వసూలు చేసినట్టు తనిఖీలో తేలడంతో రూ.80 వేలు జరిమానా విధించారు. ఇక కిమ్స్ సవేరా ఆసుపత్రి అదనంగా ఐదు వేలు వసూలు చేసినందుకు రూ.25 వేలు జరిమానా విధించారు. ఎస్ఆర్ ఆసుపత్రి ఆరు వేలు అదనంగా వసూలు చేసినందుకు రూ.30 వేలు జరిమానా విధించారు. ఇలా ఉన్నతాధికారులు సాధారణ జరిమానాలు వేసి సరిపెట్టేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వైద్యం పేరుతో దోపిడీ చేస్తున్న కార్పొరేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పాకిస్తాన్ కాల్పుల్లో పూంచ్‌లో మరణించిన 13 ఏళ్ల విద్యార్థి విహాన్ భార్గవ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాహుల్‌గాంధీ

పూంఛ్ ప్రాంతంలో రాహుల్ పర్యటన

పూంచ్ : లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పూంఛ్ ప్రాంతంలో పర్యటించారు. ఇటీవల భారత్-పాకిస్తాన్ మధ్య ఘర్షణ నేపథ్యంలో పాక్ కాల్పులు, దాడులతో జమ్ముకాశ్మీర్ సరిహద్దు గ్రామాలు దెబ్బతిన్నాయి. పాక్ దాడుల కారణంగా పూంఛ్ ప్రాంతంలోని ప్రజలు ఎక్కువగా ప్రభావితమయ్యారు. అనేక గృహాలు దెబ్బతిన్నాయి.

ఈ క్రమంలోనే బాధిత కుటుంబాలను కలుసుకునేందుకు రాహుల్ శనివారం అక్కడ పర్యటించారు. పూంఛ్‌లోని బాధితులను కలిసి వారి నుంచి సమాచారం అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న గృహాలను పరిశీలించారు. ఈ పర్యటన సందర్భంగా ఆ ప్రాంతంలోని ఒక పాఠశాలకు రాహుల్ వెళ్లి అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. తన పర్యటనకు సంబంధించిన వీడియోను రాహుల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇక, పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి అనంతరం రాహుల్ జమ్ముకాశ్మీర్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. ఉగ్రదాడి బాధితులను కలిసి వారికి భరోసా ఇచ్చారు.

పరువు నష్టం కేసులో నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ

పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీపై జార్ఖండ్‌లోని చైబాసాలోని ఎంపి-ఎమ్మెల్యే కోర్టు తాజాగా రాహుల్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. 2018లో బెంగళూరులో జరిగిన విలేకరుల సమావేశంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఓ హత్య కేసులో నిందితుడని ఆరోపించారు. ఈ ఆరోపణలపై బిజెపి నేత ప్రతాప్ కటియార్ 2018 జులై 9న చైబాసాలోని చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసు దాఖలు చేశారు. జార్ఖండ్ హైకోర్టు ఆదేశాల మేరకు 2020 ఫిబ్రవరిలో రాంచీలోని ఎంపి-ఎమ్మెల్యే కోర్టుకు బదిలీ చేసింది. ఆ తర్వాత ఈ కేసు చైబాసాలోని ఎంపి-ఎమ్మెల్యే కోర్టుకు చేరింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపునివ్వాలని కోరుతూ రాహుల్ తరపున న్యాయవాది చేసిన విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించింది. రాహుల్‌గాంధీ జూన్ 26న స్వయంగా కోర్టు ఎదుట హాజరుకావాలని ఆదేశించింది.

ప్రభుత్వ భూములను పేదలకు ఇవ్వాలి

- వ్యకాసం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- పెద్దపంజాణి: ప్రభుత్వ భూములను అనుభవంలో ఉన్న రైతులకే పంచాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని బొమ్మలకుంట గ్రామంలో ఆయన పర్యటించి పేదలు ఎదుర్కొంటున్న భూ సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గత 50 సంవత్సరాలు నుంచి 100 మంది రైతులు సుమారుగా 87 ఎకరాలు సాగులో ఉన్నారని, ఈ భూములకు 1992న పోరాటాల ఫలితంగా అప్పటి ఎమ్మార్వో దాదాపు సగం మందికి పాసు బుక్కులు ఇచ్చారు కానీ అప్పుడు పెద్దపంజాణి గ్రామరెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న వ్యక్తి తన పలుకుబడిన ఉపయోగించి తప్పుడు రికార్డులను సృష్టించి ఆ భూములు మొత్తం తనవని సిసిఎల్ కోర్టులో కేసు వేశారని తెలిపారు. ప్రజలంతా దాదాపు 20 సంవత్సరాలుగా ఈ భూములు తమవని నెల్లూరు కలెక్టరేట్లో, ట్రిబనల్, సీసీఎల్ లోనా హైకోర్టులో, జిల్లా కోర్టులో ఈ భూములు పేదలకు చెందినట్లు తీర్పులిచారని కానీ స్థానిక రెవెన్యూ అధికారులు ఆ భూములను స్వాధీనం చేసుకొని అర్హులైన పేదలకు ఇవ్వకుండా చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు జిల్లా రెవెన్యూ అధికారులు ఇకనైనా స్పందించి పట్టాలు కలిగిన వారికి జూన్ 10వ తేదీ లోపు ఆన్లైన్ చేసి వారికి భూమిపై హక్కులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నామన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించకుంటే జూలై పదో తేదీ నాటికి గతంలో అర్హులైన కూలీలకు భూములు స్వాధీనం చేయకుంటే భూములు ఆక్రమించుకుంటామని ప్రభుత్వాలు జిల్లా రెవెన్యూ యంత్రాంగం పేదలకు న్యాయం చేయాలని కోరారు. వ్యకాసం జిల్లా అధ్యక్ష కార్యదర్శి చిరంజీవిమ్మ, ఓబుల్ రాజు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అన్నూరు ఈశ్వర్, వ్యకాసం డివిజన్ నాయకులు పాకాల సుబ్రహ్మణ్యం, అమర నారాయణ పాల్గొన్నారు.

చీపురుపల్లిలో దొంగల బీభత్సం

- అడ్డొచ్చిన ఇద్దరు మహిళలపై దాడి.. ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి- చీపురుపల్లి

చీపురుపల్లి పట్టణంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఇంటిలో భారీ చోరీ జరిగింది. శనివారం తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటనలో ఇద్దరు వృద్ధ మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దోపిడీ సంఘటన పట్టణంలో సంచలనం సృష్టించింది. పట్టణానికి చెందిన వారణాసి సురేష్ ఇంట్లో తమ కుటుంబ సభ్యులైన వారణాసి కస్తూరి, వైశ్యరాజు చిట్టితల్లి నిద్రిస్తుండగా శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని దుండగులు ఇంటి వెనుక భాగం నుండి లోపలకు చొరబడి దోపిడీకి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఆ మహిళలు వారిని అడ్డుకోవడానికి ప్రతిఘటించారు. అయితే మారణ ఆయుధాలతో వచ్చిన దుండగులు వారిపైన విచక్షణ రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో మహిళలు అస్వస్థతకు గురి కావడంతో దుండగులు తమ పనిని పూర్తిచేసుకుని వెళ్లిపోయారు. శనివారం తెల్లవారుజామున పాలు పోయడానికి వచ్చిన పాల వ్యాపారి ఇద్దరు ఆ ఇద్దరు మహిళలు గాయపడి ఇంటిలో రక్తపు మడుగులో పడి ఉండటాన్ని చూసి సమీప బంధువులకు సమాచారం అందజేశారు. అనంతరం చీపురుపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ప్రత్యేకించి మారణ ఆయుధాలతో దాడి చేయడం వల్ల తలకు బలమైన గాయాలు అయ్యాయని, దీంతో వారు అపస్మారక స్థితిలోకి చేరుకున్నట్లు వివరించారు. దుండగుల ముఠా ఇతర రాష్ట్రాలకు చెందిన వారై ఉంటారని స్థానిక పోలీస్ అధికారులు నిర్ధారించుకొని దర్యాప్తు ప్రారంభించారు. దోపిడీ జరిగిన ఇంటికి సంబంధించి ఇంటి యజమాని వారణాసి సురేష్ వారం రోజుల కిందట సరస్వతి పుష్కరాల కోసం తీర్థ యాత్రలకు తన భార్యతో కలసి వెళ్లారు.



ధర్నా చేస్తున్న రైతులు

ధాన్యం సొమ్ములు చెల్లించాలని రైతుల ధర్నా

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్ (తూర్పుగోదావరి జిల్లా)

కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన సొమ్ములను వెంటనే చెల్లించాలని, రైతల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని శనివారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులోని డి.ముప్పవరం సెంటర్ వద్ద రైతన్నలు రోడ్డుపై బైటాయించి ధర్నా చేశారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని, బకాయిలు వెంటనే చెల్లించాలని నినదించారు. డి.ముప్పవరంతో పాటూ చుట్టుపక్కల గ్రామాలు చెందిన రైతులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. జెసి, ఆర్‌డిఒ వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వారి ఆందోళనతో భారీగా వాహనాలు స్తంభించాయి. అకాల వర్షాలతో ఎంతో నష్టపోయామన్నారు. తరువాత అనుమతులు లేవంటూ 8,600 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయలేదన్నారు. వీటిని కొనుగోలు కేంద్రాల వద్ద పెట్టుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి కూడా నేటికీ డబ్బులు జమేయలేదని తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ కె.వీరబాబు అక్కడి చేరుకుని రైతులతో మాట్లాడారు. అయినప్పటికి రైతులు కదల్లేదు. సంబంధిత అధికారులు వచ్చి సమాధానం చెప్పేవరకూ విరమించేది లేదని స్పష్టం చేశారు. దీంతో కొవ్వూరు ఎడిఎ చంద్రశేఖర్, ఎఎస్ఒ నాగాంజనేయులు, ఎఒ జి.సత్యనారాయణ అక్కడికి చేరుకున్నారు. రైతులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. త్వరలోనే డబ్బులు జమయ్యేలా చూస్తామని, ప్రతి ధాన్యం గింజను కొంటామని హామీ ఇచ్చారు. దీంత రైతులు ఆందోళనను విరమించారు.

విజయ్ షా వ్యాఖ్యలపై సిట్ విచారణ ప్రారంభం

భోపాల్ : మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) విచారణ ప్రారంభించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ సిట్‌లో సాగర్ జోన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ప్రమోద్ వర్మ, స్పెషల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ కల్యాణ్ చక్రవర్తి, డిండోరి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వాహినీ సింగ్ సభ్యులుగా ఉన్నారు. ఇండోర్ జిల్లా మహౌ సమీపంలోని రాయ్కుండా గ్రామంలో మంత్రి విజయ్ షా ఈ నెల 12న ఆర్మీ అధికారి కల్నల్ సోఫియా ఖురేషిని 'ఉగ్రవాదుల సోదరి' అంటూ చేసిన వ్యాఖ్యలపై హైకోర్టు, సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై ప్రజలు, సాక్షులతో సిట్ అధికారులు పరిశీలిస్తున్నట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి.

భోపాల్ రేప్ కేసుపై మత విద్వేషాలను రెచ్చగొట్టేలా కథనాలు

హిందీ పత్రికలపై హైకోర్టులో పిటిషన్

భోపాల్ : మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టే రీతిలో వార్తలను ఇస్తున్నారంటూ రెండు హిందీ దినపత్రికలపై, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంపై రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ముస్లింలను అప్రతిష్టపాల్జేసేలా 'లవ్ జీహాద్' వంటి పదాలను ఉపయోగిస్తున్నారని పేర్కొంది. ఇటీవల వెలుగులోకి వచ్చిన భోపాల్ అత్యాచారం, బ్లాక్ మెయిల్ కుంభకోణంపై వార్తలను ఇస్తూ ఆ పత్రికలు ఈ రకమైన వ్యాఖ్యలు చేసినట్లు ఆ పిటిషన్ పేర్కొంది. ఒక ప్రైవేటు కాలేజీకి చెందిన ఆరుగురు యువతులపై అత్యాచారానికి పాల్పడి, తర్వాత వారిని వీడియోల ద్వారా బ్లాక్‌మెయిల్ చేసిన ఘటనపై పోలీసులు ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేశారు. ఆ రెండు పత్రికల సంపాదకులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని రిట్ పిటిషన్ కోరింది. మీడియా ఇచ్చే ఇలాంటి విచ్ఛిన్నకరమైన, మతోన్మాద కవరేజీలను నివారిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించాలని కోరింది. భోపాల్ వాసి ఒకరు ఈ పిటిషన్‌ను ఈ నెల 19న దాఖలు చేశారు. ఆయన తన పేరును అజ్ఞాతంగానే వుంచాలనుకుంటున్నారని ఆయన తరపు న్యాయవాది దీపక్ బుందేల్ పేర్కొన్నారు.

నిన్న ఆపిల్... నేడు శామ్‌సంగ్

- భారత్‌లో ఫోన్ తయారు చేస్తే టారిఫ్ తప్పదు
- ట్రంప్ హెచ్చరిక

ఓవల్ : భారత్‌లో తయారైన ఐఫోన్లను అమెరికాలో ఎక్కడ విక్రయించినా ఇరవై ఐదు శాతం సుంకం విధిస్తానని ఆపిల్ కంపెనీని హెచ్చరించిన కొన్ని గంటలకే దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శామ్‌సంగ్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. శామ్‌సంగ్ సహా అమెరికా వెలుపల తయారయ్యే ఏ కంపెనీ ఫోన్ అయినా వాటికి టారిఫ్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఓవల్ కార్యాలయం వెలుపల ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ 'మరిన్ని కంపెనీలూ సుంకాలు చెల్లించాల్సిందే. అది శామ్‌సంగ్ కావచ్చు. ఐఫోన్‌ను ఉత్పత్తి చేసే మరో కంపెనీ కావచ్చు. ఆ కంపెనీలు తమ ఫోన్లను ఇక్కడ తయారు చేస్తే సుంకం ఉండదు' అని చెప్పారు. ఆపిల్ కంపెనీ భారత్‌కు వెళ్లి అక్కడ ప్లాంట్లు నిర్మిస్తే తనకేమీ అభ్యంతరం లేదని, అయితే అది టారిఫ్ లేకుండా అమెరికాలో తన ఉత్పత్తులను అమ్మలేదని ఓవల్ కార్యాలయం వద్ద ట్రంప్ స్పష్టం చేశారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో ఎల్ఐసి

న్యూఢిల్లీ : లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులకెక్కింది. 24 గంటల్లో 5,88,107 జీవిత బీమా పాలసీలు జారీ చేయడం ద్వారా ప్రపంచ రికార్డు సృష్టించినట్లు ఎల్ఐసి ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సంవత్సరం జనవరి 24న దేశవ్యాప్తంగా 4,52,839 మంది ఎల్ఐసి ఏజెంట్లు కలిసి 24 గంటల్లో 5,88,107 జీవిత బీమా పాలసీలను జారీ చేశారని తెలిపింది. ఈ ఘనత తమ ఏజెంట్ల అంకితభావం, నైపుణ్యం, అవిశ్రాంత కృషికి నిదర్శనమని ఎల్ఐసి ఎమ్‌డి, సిఇఒ సిద్ధార్థ్ మొహంతి తెలిపారు.

పాక్ ఏజెంటుకు బిఎస్ఎఫ్, నేవీ సమాచారం పంపిన వ్యక్తి అరెస్టు

గాంధీనగర్ : సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్), నౌకాదళానికి సంబంధించిన కీలక సమాచారాన్ని వాట్సప్ ద్వారా పాకిస్తాన్ మహిళా ఏజెంటుకు చేరవేసిన వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. గుజరాత్‌కు చెందిన 28 సంవత్సరాల కాంట్రాక్ట్ హెల్త్ వర్కర్ సహదేవ్ సింగ్ గోహిల్‌ను అరెస్ట్ చేశామని రాష్ట్ర ఉగ్రవాద నిరోధక దళం (ఎటిఎస్) ఎస్ఐ ఆర్ఆర్.గార్చల్ తెలిపారు. కచ్ జిల్లా లఖ్‌పట్ తాలూకా నారాయణ్ సరోవర్‌కు చెందిన గోహిల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్ట్ వర్కర్‌గా పనిచేస్తున్నాడని, ఆయన కీలకమైన రక్షణ సమాచారాన్ని ఓ విదేశీ ఏజెంటుకు చేరవేస్తున్నాడని నిఘా వర్గాలు సమాచారం అందించాయి. తనకు సమీపంలో ఉన్న బిఎస్ఎఫ్, నౌకాదళ స్థావరాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను గోహిల్ పాకిస్తాన్ ఏజెంటుకు వాట్సప్‌లో పంపాడని గుజరాత్ ఎటిఎస్ ఎస్పీ సిద్ధార్థ్ అహ్మదాబాద్‌లో విలేకరులకు చెప్పారు. అదితి భరద్వాజ్ అని పిలవబడే పాకిస్తాన్ మహిళా ఏజెంటుతో 2023 జూలై నుండి వాట్సప్ ద్వారా సంప్రదింపులు జరుపుతున్నాడని, ఆమె చెప్పడంతో బిఎస్ఎఫ్ పోస్టులు, నౌకాదళ కార్యాలయాల ఫొటోలు, వీడియోలను పంపినట్లు గోహిల్ అంగీకరించాడని తెలిపారు.

జీవితాలకు, జీవనోపాధులకు ముప్పుగా

వాతావరణ మార్పులు

- గతేడాది కాలంలో 71శాతం మంది భారతీయులపై వడగాలుల ఎఫెక్ట్
- అంతర్జాతీయ అధ్యయనంలో వెల్లడి



ముంబయి : ప్రజల జీవితాలకు, వారి జీవనోపాధులకు వాతావరణ మార్పులు తీవ్రమైన హాని కలిగిస్తున్నాయి. గతేడాది కాలంలో 71 శాతం మంది భారతీయులు తీవ్ర వడగాలుల ప్రభావాన్ని ఎదుర్కొన్నట్లు ఒక అంతర్జాతీయ సంస్థ తన అధ్యయనంలో వెల్లడించింది. యేల్ ప్రోగ్రాం ఆన్ క్లైమేట్ చేంజ్ కమ్యూనికేషన్ (వైపిసిసిసి), సి-ఓటర్ గతేడాది డిసెంబర్ 5వ తేదీ నుండి ఈ ఏడాది ఫిబ్రవరి 18వ తేదీ వరకు దాదాపు పది వేలమందికి పైగా ప్రజలపై సర్వే చేశాయి. ఇటీవల కాలంలో భారతీయులు తీవ్రమైన వడగాలులు, వరదలు, నీటి కొరతలు, అకాల రుతుపవనాలను ఎదుర్కొన్నట్లు సర్వే వెల్లడించింది. ఈ సంఘటనలు ప్రజల జీవితాలకు, వారి జీవనోపాధులకు తీవ్రమైన హాని కలిగించడమే కాకుండా వాతావరణ మార్పులు, తీవ్రమైన వాతావరణ పరిస్థితుల పట్ల ప్రజలు చూసే దృష్టిని, దృక్పథాన్ని మారుస్తున్నాయని అధ్యయన నివేదిక పేర్కొంది.

క్షేత్రస్థాయి సర్వేలో పాల్గొన్న వారిలో చాలా మంది గత 12 నెలల్లో తీవ్రమైన వాతావరణ ప్రభావాన్ని అనుభవించినట్లు తెలిపారు. 71శాతం మంది తీవ్రమైన వేడి గాలులను ఎదుర్కొన్నామని చెప్పగా, 60 శాతం మంది వ్యవసాయ తెగుళ్లను, 59 శాతం మంది విద్యుత్ అంతరాయాలను, 53 శాతం మంది నీటి కాలుష్యాన్ని, 52 శాతం మంది తీవ్రమైన వాయు కాలుష్యాన్ని ఎదుర్కొన్నట్లు చెప్పారని రీసర్చ్ స్కాలర్ మారిజా వెర్నర్ తెలిపారు.

ఎక్కువ మంది తీవ్రమైన వాతావరణం, సంబంధిత ప్రభావాలు స్థానికంగా తలెత్తే ముప్పుల గురించి ఆందోళన చెందుతున్నారని సర్వే పేర్కొంది. సగం కంటే ఎక్కువ మంది ప్రజలు వృక్ష, జంతు జాతుల అంతరించిపోయే పరిస్థితులు, తీవ్రమైన వేడి గాలులు, వ్యవసాయ తెగుళ్లు, వ్యాధులు, కరువులు, నీటి కొరత, నీటి కాలుష్యం, తీవ్రమైన వాయు కాలుష్యం, కరువులు, ఆహార కొరత గురించి చాలా ఆందోళన చెందుతున్నట్లు ఆ సర్వే వెల్లడించింది. దేశంలో తీవ్ర వాతావరణ పరిస్థితులపై గ్లోబల్ వార్మింగ్ ప్రభావం చాలావుందని మెజారిటీ ప్రజలు భావిస్తున్నారని మరో రీసెర్చ్ స్కాలర్ జగదీష్ థాకర్ అన్నారు. అదనంగా, గ్లోబల్ వార్మింగ్ విద్యుత్ అంతరాయాలపై ప్రభావితం చూపుతోందని 43 శాతం మంది భావిస్తున్నారు.

తీవ్రమైన వాతావరణం, సంబంధిత ప్రభావాలనేవి దేశంలోని చాలామందికి తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని మరో పరిశోధకులు ఎమిలీ రిచర్డ్స్ తెలిపారు. ఈ మార్పులనేవి దైనందిన జీవితంలో భాగంగా మారిపోతున్నాయన్నారు. దాంతో ఎక్కడికక్కడ స్థానికంగా వీటిగురించి ఆందోళన విస్తృతంగా నెలకొందన్నారు. అదే సమయంలో భారతదేశంలో 32శాతం మంది ప్రజలు గ్లోబల్ వార్మింగ్ గురించి ఎప్పుడూ వినలేదని కూడా నివేదిక పేర్కొంది. వాతావరణ మార్పులు, స్థానిక వాతావరణ ప్రభావాల గురించి ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని తమ పరిశోధనల్లో తేలిందని స్కాలర్ జెన్నిఫర్ మార్లన్ అన్నారు. కార్బన్ కాలుష్యాన్ని తగ్గించాలని, లేని పరిస్థితుల్లో భవిష్యత్తులో తలెత్తే తీవ్ర పరిణామాల ముప్పు మరింతగా వుంటుందని నివేదిక హెచ్చరించింది.

నంబాల, సజ్జా మృతదేహాల కోసం ఛత్తీస్‌గఢ్ వెళ్లండి

- పిటిషనర్లకు హైకోర్టు ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి

మావోయిస్టు పార్టీ అగ్రనేత నంబాల కేశవరావు, మరో నేత సజ్జా వెంకట నాగేశ్వరరావు మృతదేహాల కోసం ఛత్తీస్‌గఢ్ పోలీసులను సంప్రదించాలని వాళ్ల బంధువులైన పిటిషనర్లను హైకోర్టు ఆదేశించింది. నారాయణపూర్‌లో ఇటీవల జరిగిన ఎన్ కౌంటర్‌లో 27 మంది మరణించగా, వారిలో 21 మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయ్యిందని, మిగిలిన ఆరు మృతదేహాలకు శనివారం అంటే ఈ నెల 24న సాయంత్రంలోగా పూర్తవుతుందని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర అడ్వకేట్ జనరల్ ప్రఫుల్ భరత్ హైకోర్టుకు చెప్పారు. ఈ వివరాలను నమోదు చేసిన జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ యడవల్లి లక్ష్మణరావుతో కూడిన డివిజన్ బెంచ్ పైవిధంగా పిటిషనర్లకు శనివారం ఆదేశాలు జారీ చేసింది.

తన సోదరుడు నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ మృతదేహాన్ని అప్పగించేలా అధికారులకు ఆదేశాలివ్వాలంటూ నంబాల ఢిల్లేశ్వరరావు, తన సోదరుడు సజ్జా వెంకట నాగేశ్వరరావు మృతదేహాన్ని తమకు అప్పగించేలా ఉత్తర్వులు వెలువరించాలని కోరుతూ సజ్జా శ్రీనివాసరావు మరో పిటిషన్ వేశారు. సీనియర్ అడ్వకేట్ ఎ సత్యప్రసాద్, న్యాయవాది యుడి జై భీమారావు వాదిస్తూ, కేశవరావు మృతదేహం కోసం ప్రయత్నిస్తే అధికారుల నుంచి స్పందన లేదన్నారు. పిటిషనర్లు జబల్పూర్ వెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. మృతదేహాల కోసం ప్రయత్నం చేయడాన్ని శ్రీకాకుళం ఎస్‌పి తీవ్రంగా అడ్డుకుంటున్నారని చెప్పారు.

ఛత్తీస్‌గఢ్ ఎజి ప్రఫుల్ భరత్ ప్రతివాదన చేస్తూ, మృతదేహాల కోసం పిటిషనర్లు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించాలన్నారు. రాష్ట్ర ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్ వాదిస్తూ, ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ జరిగితే రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ వేయడం చెల్లదన్నారు. కేంద్ర భద్రతా దళాల తరపున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు వాదిస్తూ, మృతదేహాల అప్పగింతకు సిఆర్‌పిఎఫ్‌కు సంబంధం లేదన్నారు. వాదనల తర్వాత హైకోర్టు, వ్యాజ్యాలను విచారించే పరిధి అంశంలోకి తాము వెళ్లడం లేదని చెప్పింది. శనివారం సాయంత్రం కల్లా పోస్టుమార్టం ప్రక్రియ పూర్తవుతుందన్న ఛత్తీస్‌గఢ్ ఎజి చెప్పిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నట్లు ప్రకటించింది. మృతదేహాల కోసం సంబంధిత అధికారులను ఆశ్రయించాలని పిటిషనర్లను ఆదేశించింది. విచారణ ముగిసినట్లు ప్రకటించింది.

రేపు అంత్యక్రియలు

మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతదేహాన్ని ఛత్తీస్‌గఢ్ పోలీసులు అప్పగిస్తే సోమవారం ఆయన స్వగ్రామం జియన్నపేటలో అంత్యక్రియలు నిర్వహించడానికి కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలిసింది. మృతదేహం కోసం ఛత్తీస్‌గఢ్ అధికారులను సంప్రదించాలన్న హైకోర్టు ఆదేశాల మేరకు ఆయన సోదరుడు శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుండి శనివారం సాయంత్రం అక్కడకు బయలు దేరినట్లు సమాచారం. ఆయన ఆదివారం తెల్లవారుజామున ఛత్తీస్‌గఢ్ ఆస్పత్రికి చేరుకుంటారని, అన్ని సజావుగా జరిగితే పది గంటల తరువాత ఎప్పుడైనా భౌతిక కాయాన్ని ఇచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. శ్రీకాకుళం నుండి కోటబొమ్మాళి కొత్తపేట జంక్షన్‌కు, అక్కడి నుండి మరో ఆరు, ఏడు కిలోమీటర్ల దూరం ఉండే జియ్యన్నపేటకు భౌతిక కాయాన్ని తీసుకురావడానికి ఆదివారం అర్ధరాత్రి దాటుతుందని భావిస్తున్నారు. దీంతో సోమవారం ఉదయం 8 గంటలకు అంత్యక్రియలు నిర్వహించే అవకాశం ఉందని సమాచారం.

పోలవరం ఎత్తిపోతలకు తెలంగాణ అభ్యంతరం

- పిపిఎ, జిఆర్ఎంబికి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలవరం నీటిపారుదల డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనల పట్ల తెలంగాణ సర్కారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు గోదావరి బోర్డుతో పాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పిపిఎ)కి తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (జనరల్) జి అనిల్‌కుమార్ లేఖ రాశారు. ఎత్తిపోతల పనులు ఆపినట్టు ఏప్రిల్ ఎనిమిదిన జరిగిన పిపిఎ సమావేశంలో పోలవరం చీఫ్ ఇంజనీర్ తెలిపినా, ఈ ఆర్థిక సంవత్సరంలోనే పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఆంధ్రప్రదేశ్ సన్నాహాలు చేపట్టిందని లేఖలో పేర్కొన్నారు. కేంద్ర జలసంఘం (సిడబ్ల్యుసి) అనుమతి లేకుండా ఈ ప్రాజెక్టు చేపడుతున్నారని వివరించారు. దీంతో గోదావరి డెల్టా వ్యవస్థ ప్రయోజనాలకు కూడా నష్టం వస్తుందని లేఖలో తెలియజేశారు. ప్రధానంగా పోలవరం డెడ్‌స్టోరేజీ నుంచి నీటిని పోత్తిపోయడం సబబు కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ చేపడుతున్న ప్రతి ప్రాజెక్టుకు నీటి లభ్యత లేదంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం చెబుతూనే మరోవైపు ఆంధ్రప్రదేశ్ మాత్రం డెడ్‌స్టోరేజీ నుంచి కొత్తగా ఎత్తిపోతల పథకాన్ని ప్రతిపాదించడం ఎంతవరకు సమంజసమని అభ్యంతరం చెప్పారు. డెడ్‌స్టోరేజీ నుంచి ఎత్తిపోతల చేపట్టడం సిడబ్ల్యుసి మార్గదర్శకాలు, అనుమతులకు విరుద్ధమని పేర్కొన్నారు. సిడబ్ల్యుసి వెంటనే జోక్యం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌ను అడ్డుకోవాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు గతంలో కేంద్ర జల సంఘం ఇచ్చిన అనుమతులకు ప్రతిపాదిత ప్రాజెక్టు వ్యతిరేకంగా ఉందని లేఖలో వివరించారు. తక్షణమే గోదావరి నదీ యాజమాన్య బోర్డుతోపాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ జోక్యం చేసుకుని ఈ ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ముందుకు పోకుండా ఆపాలని విజ్ఞప్తి చేశారు.

తీవ్రవాదానికి మద్దతు ఆపితేనే 'సింధు' జలాల ఒప్పందం

- ఐరాసలో భారత రాయబారి

పర్వతనేని హరీష్

ఐక్యరాజ్య సమితి : సింధు నదీ జలాల ఒప్పందాన్ని నిలుపుచేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయంపై పాకిస్తాన్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఐక్యరాజ్య సమితిలో భారత్ శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ విమర్శించారు. 'సాయుధ సంఘర్షణల్లో నీటికి, పౌరుల ప్రాణాలకు రక్షణ' అనే అంశంపై న్యూయార్క్ ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఒప్పందం కుదుర్చుకున్న గత ఆరున్నర దశాబ్దాల్లో పాకిస్తాన్ మూడు యుద్ధాలకు పాల్పడిందని, భారత్‌పై వేలాదిగా తీవ్రవాద దాడులు జరిపిందని విమర్శించారు. అమాయకుల ప్రాణాలను బలిగొంటూ, మత సామరస్యతను, ఆర్థిక సంక్షేమాన్ని దెబ్బతీయాలని చూసిందని అన్నారు. 65ఏళ్ల క్రితం పాకిస్తాన్‌పై విశ్వాసంతో, సుహృద్భావంతో ఈ ఒప్పందాన్ని భారత్ కుదుర్చుకుందని చెప్పారు. పాకిస్తాన్ ప్రతిసారీ ఈ ఒప్పంద స్ఫూర్తిని ఉల్లంఘిస్తూనే వచ్చిందన్నారు. నాలుగు దశాబ్దాల కాలంలో పాక్ జరిపిన తీవ్రవాద దాడుల కారణంగా 20వేల మందికి పైగా అమాయకులు మరణించారని చెప్పారు. ఇటీవల జరిగిన పహల్గాం ఉగ్ర దాడిని ప్రస్తావించారు. భారత్ అసాధారణ రీతిలో సహనాన్ని, సంయమనాన్ని ప్రదర్శిస్తూ వచ్చిందన్నారు. సుదీర్ఘకాలంలో ప్రాథమికస్థాయిలో అనేక మార్పులు సంభవించినందున ఒప్పందంలో కొన్ని సవరణలు అవసరమని, అందుకు చర్చలు జరుపుదామని రెండేళ్లుగా కోరుతున్నా, పాకిస్తాన్ అంగీకరించలేదని చెప్పారు. అందువల్ల భారత్ తన చట్టబద్ధమైన హక్కులను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోలేక పోయిందన్నారు. సీమాంతర ఉగ్ర వాదానికి తోడ్పాటునిస్తున్న పాకిస్తాన్ తన వైఖరిని మార్చుకోనంతవరకు సింధు జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు భద్రతామండలిలో 'సాయుధ ఘర్షణల్లో సామాన్యులకు రక్షణ' అనే అంశంపై జరిగిన చర్చ సందర్భంగానూ హరీష్ మాట్లాడారు. ఉగ్రవాదులకు, సామాన్యులకు మధ్య తేడా చూపని దేశానికి పౌరుల రక్షణ గురించి మాట్లాడే హక్కు లేదని అన్నారు. తొలుత పాక్ రాయబారి అసిమ్ ఇఫ్తికర్ కాశ్మీర్ అంశాన్ని లేవదీసి ఇటీవల జరిగిన ఘర్షణల గురించి మాట్లాడారు. దానిపై హరీష్ స్పందిస్తూ పాక్ చేసిన నిరాధార ఆరోపణలను తోసిపుచ్చారు.

వాస్తవాలను వక్రీకరిస్తున్న ట్రంప్

- ఖండించిన దక్షిణాఫ్రికా మంత్రి

జోహాన్నెస్‌బర్గ్ : శ్వేత జాతీయులైన రైతులను హతమార్చేందుకు దక్షిణాఫ్రికాలో పెద్ద ఎత్తున కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ఆరోపణలను దక్షిణాఫ్రికా లా ఎన్‌ఫోర్స్‌మెంట్ మంత్రి షెంజో చును ఖండించారు. ఓవల్ కార్యాలయంలో ఈ నెల 21న దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసాతో భేటీ సందర్భంగా ట్రంప్ ఒక వీడియోను చూపిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. వెయ్యి మందికి పైగా శ్వేత జాతీయులైన రైతులను ఊచకోత కోసి వారిని ఖననం చేసిన ప్రదేశాలంటూ ఓ వీడియో చూపించారు. దారి పొడుగునా పాతిన శిలువలను చూపిస్తూ, తమ ప్రియతములకు నివాళి అర్పించేందుకు వచ్చిన వారి కార్లు అంటూ అక్కడ దారికి ఇరువైపులా వున్న వాహనాలను ఉద్దేశిస్తూ ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. వాటిని దక్షిణాఫ్రికా మంత్రి ఖండించారు. వాస్తవాలను ట్రంప్ వక్రీకరిస్తున్నారని విమర్శించారు. ఆ ప్రదేశంలో వున్న శిలువలు, సమాధులు అవన్నీ 2020 నాటి నిరసనలకు గుర్తుగా పాతినవని చెప్పారు. ఆ క్రాస్‌లు వున్నవన్నీ సమాధులు లేదా ఖననం జరిగిన ప్రాంతాలు కాదు, దక్షిణాఫ్రికావ్యాప్తంగా రైతులపై జరిగిన కాల్పులకు నిరసనగా ఏర్పాటుచేసిన తాత్కాలిక స్మారకమని మంత్రి స్పష్టం చేశారు. తమ పొలంలో దొంగతనం సందర్భంగా మరణించిన శ్వేత జాతి దంపతుల అంతిమయాత్ర సందర్భంగా వాటిని వుంచారని ఆయన వివరించారు. ఆ జంట కుమారుడు, ఆనాటి ప్రదర్శనలో పాల్గొన్న స్థానిక కమ్యూనిటీ సభ్యుడు కూడా ఈ విషయాన్ని ధృవీకరించారు.

బాంబు బెదిరింపులు

- విజయవాడ, విశాఖ రైల్వే స్టేషన్‌లకు ఫోన్ కాల్స్
- అప్రమత్తమైన సిబ్బంది
- ఫేక్ కాల్స్‌గా గుర్తింపు

ప్రజాశక్తి - విజయవాడ/ ఎంవిపి.కాలనీ (విశాఖ)

వరుస బాంబు బెదిరింపులు విశాఖ, విజయవాడ వాసులను హడలెత్తించాయి. పలు ప్రాంతాల్లో బాంబులు పెట్టామంటూ ఆగంతకుల ఫోన్ కాల్స్‌తో బాంబు స్క్వాడ్, పోలీసులు ఉరుకులు పరుగులు తీశారు. ఆయా ప్రాంతాల్లో విస్తతంగా తనిఖీలు నిర్వహించారు. చివరకు ఎలాంటి బాంబు ఆనవాళ్లు లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ రైల్వేస్టేషన్‌కు, బీసెంట్ రోడ్డులోని ఎల్ఐసి కార్యాలయాలకు శనివారం బాంబు బెదిరింపులు రావడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ముందుగా బీసెంట్ రోడ్‌లోని ఎల్ఐసి కార్యాలయంలో బాంబు పెట్టినట్లు పోలీసు కంట్రోల్ రూమ్‌కు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బెదిరించాడు. అప్రమత్తమైన పోలీసులు, బాంబ్ స్క్వాడ్ బీసెంట్ రోడ్‌లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టాయి. షాపులు, తోపుడు బండ్లను బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేసింది. ఎక్కడా బాంబు ఉన్న ఆనవాళ్లు లేకపోవడంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం విజయవాడ రైల్వే స్టేషన్‌కు బాంబు బెదిరింపు కాల్ రావడంతో అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల లగేజీలను, ప్లాట్‌ఫారాలను క్షుణ్ణంగా తనిఖీలు చేసి ఎలాంటి బాంబు లేదని నిర్ధారించుకున్నారు. ఎక్కడా అనుమానాస్పద వస్తువులేవీ కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఫోన్ కాల్‌ను ట్రేస్ చేసిన సాంకేతిక సిబ్బంది దానిని ఫేక్ కాల్‌గా నిర్ధారించుకున్నారు. విజయవాడ రైల్వే స్టేషన్‌లో బాంబు పెట్టామని కంట్రోల్ రూమ్‌కు కాల్ చేసిన అగంతకుడు.. ఆ తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఆ కాల్ మహారాష్ట్ర లాతూర్ నుంచి వచ్చిందని, ఆగంతకుడు హిందీలో మాట్లాడాడని తెలిపారు. జిఆర్‌పి, సిఎస్‌డబ్ల్యు, బాంబు స్క్వాడ్ బృందాలు తనిఖీలు జరిపాయి. ఈ రెండు ప్రాంతాల్లోనూ బాంబు పెట్టినట్లు ఫోన్ చేసింది ఒక్కరేనా? వేర్వేరు వ్యక్తులా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

విశాఖ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ముంబై - విశాఖపట్నం మధ్య నడిచే లోకమాన్య తిలక్ టెర్మినల్ ఎక్స్‌ప్రెస్ (18520)కు బాంబు బెదిరింపు రావడంతో అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్‌లో బాంబు ఉందని శనివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో విశాఖపట్నం రైల్వే స్టేషన్‌కు అగంతకుడు ఫోన్ చేయడంతో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. రైలు విశాఖపట్నం స్టేషన్‌కు చేరుకోగానే ప్రయాణికులందరినీ అధికారులు సురక్షితంగా దించేసి రైలులో సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఎస్-2 కోచ్‌లో ఒక అనుమానిత బ్యాగును గుర్తించారు. దాన్ని తెరవగా ఆ బ్యాగులో బట్టలు, సబ్బులు, ఆధార్ కార్డు లభించాయి. ఆ బ్యాగు ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్రీరామ్ తివారి అనే వ్యక్తిదిగా గుర్తించారు. ఈ తనిఖీల్లో ఎటువంటి పేలుడు పదార్థాలు లభించలేదని అధికారులు తెలిపారు. ఫేక్ ఫోన్ కాల్‌గా నిర్ధారించుకున్నారు. అంగంతకుడు ఎవరనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ తనిఖీలను జిఆర్‌పి, టాస్క్‌ఫోర్స్, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, లా అండ్ ఆర్డర్ విభాగాలు సంయుక్తంగా చేపట్టాయి.

ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

బ్లాక్ బర్లీ పొగాకు చివరి ఆకూ కొనేవరకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- ధరల స్థిరీకరణ నిధికి రూ.130 కోట్లు కేటాయింపు
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- బాపట్ల జిల్లా

పొగాకు రైతులు పండించిన బ్లాక్ బర్లీని చివరి ఆకూ కొనేవరకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు అన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు రైతులతోనూ, బయ్యర్లుగా ఉన్న కంపెనీ ప్రతినిధులతోనూ ముఖాముఖి కార్యక్రమం బాపట్ల జిల్లా మార్టూరు మండలం పర్చూరు శాసనసభ్యులు క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగింది. సుదీర్ఘ చర్చ అనంతరం బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలుపై రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను మంత్రి ప్రకటించారు. బ్లాక్ బర్లీ పొగాకును రెండు గ్రేడ్లతో కొనుగోలు చేస్తామని తెలిపారు. క్వింటాలు కామన్ వెరైటీని రూ.12 వేలకు, లో గ్రేడ్ రకాన్ని రూ.6 వేలకు కొనుగోలు చేయాలని ధరలను నిర్ణయించారు. అంతర్జాతీయ మార్కెట్ ధరలలో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ నిర్ణయించిన ధరను అమలు చేయాలని కంపెనీలకు సూచించారు. పొగాకు కొనుగోలులో ప్రాసెసింగ్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. అవసరమైతే మార్క్‌ఫెడ్ ద్వారా బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు ప్రారంభిస్తామని ప్రకటించారు. రైతులు పండిం,చిన చివరి ఆకు వరకు కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇందుకోసమే ఆరు సబ్‌కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంపెనీలు కథలు చెప్పడం మాని రైతులకు మేలు చేసేందుకు స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. బయ్యర్లుగా ఉన్న కంపెనీలు ఫోన్ చేసినా స్పందించడం లేదని, ఇలా వ్యవహరిస్తే ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. సంక్షోభంలో ఉన్న రైతులకు ధైర్యం కల్పించాలని, వారి కోసం కంపెనీలు బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. ధరల స్థిరీకరణ నిధికి రూ.130 కోట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇటీవల సంక్షోభంలోకి వెళ్లిన టమోటా రైతులను ఆ నిధి నుంచి ఆదుకున్నామని తెలిపారు. బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలును బయ్యర్లు ఆదివారం నుండే ప్రారంభించాలన్నారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యలు అనేమాట వినపడరాదని, అలాంటి ఆలోచన రైతులకు రాకూడదని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, కలెక్టర్ జె.వెంకటమురళి, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు, టుబాకో బోర్డు ఛైర్మన్ యశ్వంత్, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి సురేష్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్.విజయకుమార్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి రామకృష్ణ, మార్కెటింగ్ శాఖ అధికారి రమేష్‌బాబు, మార్క్ ఫెడ్ అధికారి కరుణ, ఉద్యాన శాఖ ఎడి జెన్నమ్మ, 20 కంపెనీల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

జార్ఖండ్‌లో మరో ఎన్‌కౌంటర్

- మావోయిస్టు అగ్రనేత పప్పూ లోహరాసహా ఇద్దరు మృతి

రాంచీ : జార్ఖండ్‌లోని లతేహార్ జిల్లా ఇచాబార్ అడవిలో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య శనివారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, జార్ఖండ్ జన ముక్తి పరిషత్ (జెజెఎంపి) అధినేత పప్పూ లోహరాతోపాటు మరో కీలక నాయకుడు ప్రభాత్ గంజ్ మరణించారు. ఈ ఘటనలో భద్రతా దళ సిబ్బంది ఒకరు గాయపడినట్లు అధికారులు చెప్పున్నారు. మృతి చెందిన పప్పూ లోహరాపై రూ.10 లక్షల రివార్డు, ప్రభాత్ గంజ్‌పై రూ.5 లక్షల రివార్డు ఉన్నది. ఈ కాల్పుల్లో తీవ్ర గాయాలపాలైన ఇంకో మావోయిస్టు సజీవంగా పట్టుబడ్డాడు. పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోనూ మావోయిస్టులకు వ్యతిరేకంగా భద్రతా బలగాల చర్యలు కొనసాగుతున్నాయి. బీజాపూర్ జిల్లాలో 24 మంది, బస్తర్ ప్రాంతంలో 33 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారని అధికారులు తెలిపారు. వీరిలో 24 మందిపై రూ.91 లక్షల రివార్డు ఉన్నదని చెప్పారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్ భారీ ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మృతి చెందగా, వారిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ కూడా ప్రాణాలు కోల్పోయిన సంగతి విదితమే. శుక్రవారం మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లోనూ నలుగురు మావోయిస్టులు చనిపోయిన విషయం తెలిసిందే.

బంగ్లా ప్రధానిగా కొనసాగనున్న యూనస్

ఢాకా : బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా మహమ్మద్ యూనస్ పదవిలో కొనసాగుతారని ఆయన క్యాబినెట్ సలహాదారు వహియుద్దీన్ మహమూద్ శనివారం తెలిపారు. 'రాజీనామా చేస్తానని ఆయన చెప్పలేదు. మనకు అప్పగించిన పనులు, బాధ్యతలను నెరవేర్చడంలో అనేక అవరోధాలు ఏర్పడుతున్నాయని మాత్రమే ఆయన అన్నారు. వాటిని అధిగమిస్తున్నామని కూడా తెలిపారు' అని సలహా మండలి సమావేశం అనంతరం వహియుద్దీన్ చెప్పారు. తాత్కాలిక ప్రభుత్వంలోని సలహాదారులెవ్వరూ ఎక్కడికీ వెళ్లలేదని, తమకు అప్పగించిన విధులను వారు విస్మరించబోరని అన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేస్తానని యూనస్ కొద్ది రోజుల క్రితం హెచ్చరించారు.

మత సామరస్యం, దేశ సమగ్రత కోసం.. ఐక్యంగా ఉద్యమించాలి

(మొదటి పేజీ తరువాయి)

మూడు రోజుల పాటు కాల్పులు జరిపి ఉన్నట్టుండి కాల్పుల విరమణ చేసేశారని అన్నారు. యుద్ధ విరమణ తన ఘనతగా ట్రంప్ ప్రచారం చేసుకోవడమంటే మన దేశ ప్రజాస్వామ్యాన్ని, సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టడం కాదా? అని ప్రశ్నించారు. ఉగ్రవాద మూలాలను నిర్మూలించకుండా కొంతమందిపై ఉగ్రవాద ముద్ర వేసి హతమార్చాలనుకోవడం పరిష్కారం కాదన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ఏ చిన్న అవకాశం దొరికినా దానికి మతం రంగు పులుముతోందని, దేశంలో పలుచోట్ల 108 మంది ముస్లిములపై దాడులకు పాల్పడిందని తెలిపారు. యుపి, మధ్యప్రదేశ్‌లో ముస్లిములను చంపడంతోపాటు కొట్టి తరిమేసిన ఘటనల వెనుక ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర ఉందన్నారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలోనూ ఈ దేశంలో హిందూ ముస్లింలు ఐక్యంగా కలసి ఉన్నారని, జాతీయోద్యమంలో పాల్గొని దేశాన్ని విముక్తి చేయగలిగిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బి.పద్మ, జిల్లా నాయకులు బి.జగన్, పి.మణి, వి.కృష్ణారావు పాల్గొన్నారు.

'టీం ఇండియాలా' కలిసి పనిచేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

పాలనా సంస్కరణలపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా రాష్ట్రాలు ఈ లక్ష్యాలను సాధించగలవని తెలిపింది. దేశవ్యాప్తంగా యువతకు నైపుణ్యాల్లో శిక్షణను అందించడం, వ్యాపారవేత్తలకు అనుకూలమైన వాతావరణం కల్పించడం, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడం వంటి వ్యూహాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్రాలు తమ ప్రత్యేకతలను ఉపయోగించుకుని ఈ లక్ష్యాల సాధనకు సమర్థవంతమైన విధానాలను రూపొందించాలని నీతి ఆయోగ్ సూచించింది. దేశం ఎదుర్కొంటున్న అభివృద్ధి సవాళ్లను పరిష్కరించడానికి, సమగ్రమైన, సుస్థిరమైన అభివృద్ధి కోసం కేంద్రం, రాష్ట్రాల మధ్య సహకారం అత్యంత కీలకమని పేర్కొంది. ఏటా నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ పూర్తి స్థాయి సమావేశం జరుగుతుంది. ఈ ఏడాది సమావేశానికి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి హాజరు కాలేదు. కేరళ ముఖ్యమంత్రి విజయన్ తరపున ఆయన మంత్రివర్గ సభ్యుడు కెఎన్ బాలగోపాల్ హాజరయ్యారు.

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY ANANTAPUR
ANANTHAPURAMU-515002 (A.P.) INDIA

e-Procurement Tender Notices

1 Supply of outsourcing employees in JNT University, Ananthapuramu, OTPRI, JNTUA College of Engineering, Ananthapuramu, JNTUA College of Engineering, Pulivendula and JNTUA College of Engineering Kalikiri. With Tender ID No. 813739

Further Details can be seen at e-procurement market place i.e., www. tender.apeprocurement.gov.in.

Sd/- REGISTRAR

విజ్ఞానం పెంచే కథలివి!

హాయ్ ఫ్రెండ్స్,

నా పేరు సహస్ర. ఈ సెలవుల్లో ఒక పుస్తకం చదివాను. దాని పేరు 'మంత్రదండం'. ఇందులో కథలన్నీ పిల్లలే రాశారు. ఒక్కో కథ భలే ఉంది. కథలన్నీ శాస్త్రీయ దృక్పథంతో కూడుకున్నవే.

గుండ్రంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిల్లలచే ఈ చక్కటి కథలు రాయించిన సంపాదకులు డాక్టర్ ఉప్పల పద్మ అభినందనీయులు.

కథల విషయానికొస్తే.. రిత్విక్ గౌడ్ రాసిన 'బయటపడ్డ నిజం' కథలో 'ఎవరినీ గుడ్డిగా నమ్మకూడదు' అనే నీతిని చాలా బాగా వివరించాడు. 'నిమ్మ కాయలకు జ్వరం రాదు' కథలో 'అతి భయం పనికిరాదు' అనే నీతిని అక్షిత బాగా చెప్పింది. ఇది ప్రతి ఒక్కరూ చదవదగిన కథ. 'భయం లేదు గియం లేదు' కథలో మూఢ నమ్మకాలను నమ్మకూడదు అనే నీతిని సురేష్, అఖిల్, సంజయ్, అక్షయ్ అనే పాత్రల ద్వారా అక్షిత చాలా చక్కగా వివరించింది. 'అత్త కోడళ్ళు'. కథలో మూఢ నమ్మకాలు నమ్మకూడదని సత్తెమ్మ తెలుసుకున్నది. తన కోడలికి తనను చూసి భయపడ వద్దని చెప్పింది. ఈ కథను రిషిక చాలా బాగా రచించింది.

ఇలా ఇందులో చక్కటి సందేశాత్మకంతో కూడిన కథలు మొత్తం 19 ఉన్నాయి. దేనికదే ప్రత్యేకం. పుస్తక ముఖ చిత్రం కూడా చాలా అందంగా ఉంది. మొత్తం పేజీల సంఖ్య 48. పుస్తకం వెల 95 రూపాయలు. ఇలాంటి పుస్తకాలు, కథలు మరెన్నో చిన్నారుల కలం నుండి జాలువారాలని కోరుకుంటూ అభినందనలు, శుభాకాంక్షలు.

– యాదవరం సహస్ర గౌడ్,
10వ తరగతి,
శ్రీ చైతన్య స్కూలు,
తెలంగాణ,
94417 62105.

చిట్టి తల్లి



చేబ్రోలులో రాజు, రాణి, వాళ్ల కూతురు కావ్య ఉన్నారు. కావ్యని వాళ్లు చిట్టితల్లీ అని ముద్దుగా పిలుస్తారు. భార్యభర్తలిద్దరూ కూలీ పనికి వెళతారు. వాళ్లు ఎంత కష్టపడుతున్నా కావ్యకి ఏ లోటూ లేకుండా పెంచుతున్నారు. పిల్లకి బడి ఈడు వచ్చింది. దగ్గర్లో ఉన్న స్కూల్లో వేశారు. ఆ స్కూలు ముందు నుండి రోజూ టౌను బడికి ఒక బస్సు వెళుతుంది. అందులో ఆ ఊరి పిల్లలు కొంతమంది వెళతారు. కావ్యకి ఆ స్కూల్లో చదవాలని ఉంది. బస్తీ బడి తనకి నచ్చలేదు. ఒక రోజు అమ్మానాన్నతో ఆ విషయం చెప్పింది. 'టౌను స్కూల్లో చదివించే స్థోమత మాకు లేదమ్మా' అని రాజు చెప్పాడు. 'నాకు అవన్నీ తెలియవు. ఆ స్కూల్లో చేర్పిస్తేనే చదువుతాను. లేకపోతే బడి మానేస్తాను' అని మొండిపట్టు పట్టింది. చేసేదేమీ లేక కావ్యని ఆ స్కూల్లో చేర్పిస్తారు. ఫీజుల కోసం రాణి ఇంటికొచ్చాక ఓ అపార్ట్‌మెంట్లో బట్టలుతికే పనిని అదనంగా కుదుర్చుకుంది. రాజు కూడా మరో రెండు గంటలు కష్టపడుతున్నాడు. కావ్య ఇవేమీ పట్టించుకోలేదు.

రోజురోజుకి కావ్య కోరికలు ఎక్కువయ్యాయి. టౌను స్కూల్లో పిల్లలు వాడే వస్తువులు, బట్టలు లాంటివే తనకూ కావాలని పేచీ పెట్టింది. పిల్లకి ఇంటి విషయాలు అర్థమయ్యేలా చెప్పాలని రాజు, రాణి అనుకున్నారు. ఒక రోజు కావ్యని తీసుకుని బస్తీకి వెళ్లారు. అక్కడ కొంతమంది పిల్లలు ఆకలితో బాధపడుతున్నారు. వారికి ఎవరో దూరం నుండి వచ్చి ఆహారపొట్లాలు, బట్టలు ఇస్తున్నారు. వాళ్ల అమ్మానాన్న చాలా పేదవారని, పిల్లలను స్కూల్లో చదివించే స్థోమత కూడా లేక ఇంటిదగ్గరే వదిలి పనికి వెళ్లారని రాజు, కావ్యతో చెప్పాడు. ఇలా చాలా విషయాలు బస్తీలో కావ్య చూసింది. తన కోసం అమ్మానాన్న పడుతున్న కష్టం అర్థమై కళ్లల్లో నీళ్లు వచ్చాయి. ఆ రోజు నుండి కావ్య ఎప్పుడూ అమ్మానాన్నని ఇబ్బంది పెట్టలేదు.

– ఎస్.సహస్ర,
10వ తరగతి,
శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూలు,
లిటిల్‌హోప్ ట్రస్ట్,
విజయవాడ.

బొమ్మల కొలువు



సిహెచ్ కేశవ నాగ కౌశల్,
4వ తరగతి,
నారాయణ ఒలింపియాడ్ అండ్ టెక్నో స్కూల్,
మార్కాపూర్.



కె.మనోజ్ఞ
5వ తరగతి,
విశాఖపట్నం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

JEEVANA
జీవన the family

జీవన సౌరభం

ఆలోచించి తీసుకున్న నిర్ణయం, కష్టపడి తెచ్చుకున్న అవకాశం, ఓటమి తర్వాత వచ్చే అనుభవం, గొప్ప వ్యక్తిత్వం వల్ల వచ్చే అభిమానం ఎప్పటికీ వృథా పోవు.

ప్రతికూల ఆలోచనలను పారదోలండి!

ఏమిటి ఈ నెగిటివ్ ఆలోచనలు? ఎక్కడ నుండి వస్తున్నాయి? వీటిని ఏ విధంగా ఎదుర్కోవాలి? ప్రతి మనిషిని వేధించి వెంబడించి బాధపెట్టే ఈ నెగిటివ్ ఆలోచనల పుట్టుక, పరిణామం, పర్యవసానాలు ఏ విధంగా ఉంటాయి? ఈ నెగిటివ్ ఆలోచనల ప్రభావం మనిషి అభివృద్ధికి ఏ విధమైన ఆటంకాలు కలిగిస్తున్నాయి? ఈ విషయాలని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.

మనిషి ప్రతిరోజూ ప్రతి నిమిషం ప్రతి క్షణం ఎన్నెన్నో ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరి అవుతూ ఉంటాడు. ఈ ఆలోచన తరంగాలలో ముఖ్యంగా మనసును ఆనందింప చేసే విధానాల కంటే కూడా వ్యధకు గురిచేసే నెగిటివ్ ఆలోచన ప్రవాహాలే ఎక్కువగా ఉంటాయి. దీనివల్ల తీవ్ర మానసిక వేదనకు గురై శారీరకంగానూ బలహీనపడుతున్నాడు.

మనిషి ప్రతిరోజూ దాదాపుగా 60 వేల నుండి 70 వేల ఆలోచనల ప్రభావానికి లోనౌతూ ఉంటాడు. ఇందులో దాదాపుగా 75 శాతం ఆలోచనలు నెగిటివ్‌గా అంటే ప్రతికూలంగానే ఉంటాయి. అందులో 95 శాతం ప్రతికూల ఆలోచనలు ఎక్కువగా పాత విషయాలే పునరావృతమై ఉంటాయి. మొదటిగా తమకు సంబంధించిన విషయాల మీద, రెండవదిగా ఇతరులకు సంబంధించినవిగా, మూడవదిగా భవిష్యత్తులో జరగబోయే విషయాల మీద ఉంటాయి. అంటే మనిషి తన జీవితంలో పొందిన అనుకూలమైన అంశాల కంటే కూడా ప్రతికూలంగా విన్న విషయాలు, చదివిన విషయాలు, చూసిన విషయాలకు సంబంధించిన ప్రభావాలకు లొంగిపోతుంటాడు. ఈ ప్రతికూల ఆలోచనలకు మూలాలను పరిశీలిస్తే సహజంగా బాల్యం నుంచే ఈ తరహా ఆలోచనలు ఉంటాయి. బాల్యం నుంచి ఎదిగే ప్రతి దశలో ఎదురయ్యే ఎన్నెన్నో సంఘటనలు ముఖ్యంగా ప్రతికూల సంఘటనల తాలూకా భావనలను మనసులో నిక్షిప్త పరచుకొనే అవకాశలుంటాయి.

- శరీర ఆరోగ్యాలకు సంబంధించిన భయాలు
- జీవితంలో చేసిన తప్పుల పట్ల అపరాధ భావనలు
- శాస్త్రీయతకు అందని మూఢ విశ్వాసాలకు సంబంధించిన భయాలు
- అపజయం తాలూకా భయాలు
- తమను తక్కువ చేసుకునే ఆత్మన్యూనత భయాలు లేదా భావనలు
- ఇతరుల నుండి తిరస్కరణలకు గురవుతామనే భయాలు
- అతిగా ఊహల నుంచి కలిగే భయాలు
- సత్యానికి దూరంగా జరిగే విషయాల పట్ల ఆందోళనలు
- నూతనంగా చేపట్టబోయే పనుల పట్ల భయాలు
- సామాజిక సాంఘిక అంశాల పైన కలిగే ఆందోళనలు

ఇవే భవిష్యత్తులో అనేకానేక మానసిక, శారీరక అనారోగ్యాలకు కారణాలుగా ఉంటున్నాయి. మానసిక సమస్యలకి కారణాలుగా ఉంటున్న కుంగుబాటుతనం, ఆందోళనలకు సంబంధించిన అనవసర భయాలు వంటివన్నీ ఇలాంటివే.

మన దేశంలో ...
పపంచవ్యాప్తంగా ...

ప్రపంచ దేశాలలో అనేకమంది ఈ నెగిటివ్ ఆలోచనల ప్రభావంలో కొట్టుమిట్టాడుతున్నారు. మన దేశంలో దాదాపు 30 సంవత్సరాల క్రితం కేవలం 2.5 శాతం ఉన్న మానసిక సమస్యల సంఖ్య అనూహ్యంగా నేడు దాదాపుగా 20 శాతానికి చేరుకుంది. ప్రపంచవ్యాప్తంగా గాని మనదేశంలో గానీ ఈ మానసిక సమస్యల సంఖ్య గత ఐదు సంవత్సరాలుగా అనూహ్యమైన సంఖ్యలో పెరుగుతూ వస్తున్నాయని మానసిక విశ్లేషకుల అభిప్రాయం. కోవిడ్ ప్రారంభ దశ, ఆ తర్వాత కూడా ఈ మానసిక సమస్యల సంఖ్య అనూహ్యంగా పెరుగుతూ వచ్చింది.

ఇలా తరిమికొట్టండి!

అప్రమత్తత : నెగిటివ్ ఆలోచనల పట్ల అప్రమత్తంగా ఉండటమే కాకుండా మనకు కలిగే ఇటువంటి ఆలోచనలలో ప్రతిదీ మనకు అన్వయించుకోకుండా మానసిక విశ్లేషణ ద్వారా మనల్ని మనం పరిశీలించుకుంటూ జాగ్రత్త వహించాలి.

జీవనశైలిలో మార్పులు : దైనందిన జీవితంలో కచ్చితంగా మార్పులు చేసుకోవాలి. సకాలంలో ఆహారం, నిద్ర తీసుకోవాలి. వ్యాయామంపై దృష్టి పెట్టాలి.

ఆశావాద దక్పథం : జీవితం పట్ల ఆశావాద దృక్పథాన్ని అలవరచుకోగలగాలి. నిరాశ నిస్పృహ కలిగించే ఆలోచనలను పారద్రోలాలి.

ఆత్మవిశ్వాసం : మన పట్ల మనకు నమ్మకాన్ని పెంచుకుంటూ సానుకూల ఆలోచనల వలన కలిగే ఆత్మవిశ్వాసంతో అడుగులు కదపాలి.

ఆలోచనల మళ్లింపు : నెగిటివ్ ఆలోచనలను పక్కదోవ పట్టించటం. దీనినే డైవర్షన్ మెథడ్స్ అంటారు. ఇందులో భాగంగా ఏదో ఒక మంచి వ్యాపకాన్ని అలవరచుకోవాలి. సంగీతం వినటం, సాధన చేయడం, సానుకూల దృక్పథాన్ని పెంపొందించే విషయాలను చదవటం, వినటం, చూడటంలాంటి పద్ధతులను అలవర్చుకోవాలి.

భావోద్రేకాల అదుపు : భావోద్రేకాలను రెచ్చగొట్టే ఏ కార్యక్రమాల పట్లనైనా అత్యంత జాగ్రత్తతో విచక్షణతో వ్యవహరించాలి.

ఆత్మన్యూనతా భావాల కట్టడి : ఆత్మన్యూనతా భయాలను గతంలో మనం పొందిన విజయాలను జ్ఞప్తిలోకి తెచ్చుకోవడం ద్వారా పారదోల వచ్చు.

గతకాలపు ముద్రల కట్టడి : గతంలో జరిగిన చేదు అనుభవాలే తిరిగి పదే పదే జరుగుతాయని భ్రమల నుండి బయటికి వచ్చి స్వశక్తి, ఆత్మవిశ్వాసంతో నూతన కార్యాచరణ రూపొందించుకోవాలి.

జీవితంలో ఏ మనిషికైనా సాధించలేని విషయాలు అంటూ ఏవీ ఉండవు. ఏ విజయానికైనా సరైన కార్యాచరణ, నిరంతర సాధన ముఖ్యం. ప్రతికూల ఆలోచనల స్థానంలో అనుకూల ఆలోచనల వృద్ధి మన అభివృద్ధికి దోహదంగా ఉంటుందని వాస్తవాన్ని గ్రహించాలి.



– అమర్‌నాథ్ జగర్లపూడి,
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్,
98495 45257.

ఫస్ట్ షెడ్యూల్ పూర్తి చేశారు

వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న హారర్–కామెడీ సినిమా నుంచి తాజా అప్‌డేట్ వచ్చింది. 'కొరియన్ కనకరాజు' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి తొలి షెడ్యూల్ అనంతపురంలో పూర్తయినట్లు మేకర్స్ ప్రకటించారు. అనంతపురంలో జరిగిన ఈ షెడ్యూల్‌లో చిత్రబృందం ఒక పాటను చిత్రీకరించింది. ప్రధాన తారాగణంపై కొన్ని కీలకమైన, ఆసక్తికరమైన సన్నివేశాలను షూట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్ పూర్తైనట్లు ప్రకటించడానికి మేకర్స్ వరుణ్ తేజ్ ఉన్న ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమా తదుపరి షెడ్యూల్ జూన్‌లో కొరియాలో ప్రారంభం కానుందని సమాచారం. ఇది ఒక ఇండో–కొరియన్ ప్రాజెక్ట్ కావడంతో, కొరియాలో చిత్రీకరణ కీలకమైన భాగంగా ఉంది. ఈ చిత్రంలో రితిక నాయక్ కథానాయికగా నటిస్తుండగా, సత్య కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు.



థియేటర్ల బంద్ లేదు..

జూన్ 1వ తేదీ నుంచి తెలుగు రాష్ట్రాల్లో సినిమా థియేటర్ల బంద్ ఉండదని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రకటించింది. థియేటర్లకు కూడా పర్సంటేజీ విధానం అమలు చేయాలని డిమాండ్ చేసిన నేపథ్యంలో శనివారం ఫిల్మ్ ఛాంబర్‌లో డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లతో నిర్మాతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం సమావేశానికి సంబంధించిన వివరాలను ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్ వెల్లడించారు. 'థియేటర్ల బంద్ అనేది తప్పుగా చిత్రీకరించారు. చర్చలు జరగకపోతే, జూన్ 1వ తేదీ నుంచి అలాంటి నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందన్నది మాత్రమే నిజం. కానీ, అందరూ థియేటర్లు మూసి వేస్తారన్న సమాచారాన్నే ప్రచారం చేశారు. ప్రస్తుతం అలాంటిదేమీ లేదు. కేవలం ఒక్క సినిమాను దృష్టిలో పెట్టుకుని థియేటర్‌లను బంద్ చేస్తున్నామనడం సరికాదు. థియేటర్ల పర్సంటేజీ విషయమై కొన్నేళ్లుగా ఎలాంటి చర్చ జరగలేదు. ప్రస్తుతం జరుగుతోంది. నిర్ణీత సమయంలోగా సమస్యలు పరిష్కరించుకుంటాం. ఈనెల 30న జరిగే సమావేశంలో కమిటీ ఎవరనేది నిర్ణయిస్తాం' అన్నారు.

విక్రమ్ సినిమాలో మీనాక్షి

'మండేలా', 'మావీరన్' చిత్రాల దర్శకుడు మడోన్నే అశ్విన్, విక్రమ్‌తో ఓ సినిమా చేయనున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో మీనాక్షి చౌదరి నటిస్తోంది. అతి త్వరలోనే దీనికి సంబంధించిన ప్రకటన వెలువడనుంది.

స్పోర్ట్స్ కోర్ట్ డ్రామాగా 'గుర్తింపు'

కేజేఆర్ హీరోగా తెన్‌పతియాన్ దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోన్న చిత్రం 'గుర్తింపు'. స్పోర్ట్స్, కోర్ట్ డ్రామాగా, యథార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను తాజాగా విడుదల చేశారు. గతంలో అశ్విన్ బాబు 'శివం భజే' చిత్రాన్ని నిర్మించిన, శివ కార్తికేయన్ 'వరుణ్ డాక్టర్' చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేసిన గంగా ఎంటర్టైన్మెంట్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఇప్పటికి 85 శాతం షూటింగ్ పూర్తయింది. స్పోర్ట్స్, కోర్ట్ డ్రామాగా రానున్న ఈ చిత్రంలో కేజేఆర్, సింధూరి విశ్వనాథ్, విజి వెంకటేష్, రంగరాజ్ పాండే, మన్సూర్ అలీ ఖాన్, రమా, మోహన్ రామ్, ఆంటోనీ, అజిత్ ఘోషి, విమల్, ఇజబెల్లా, షాన్, దీపిక, జానకి, అరుల్ జ్యోతి వంటి వారు ముఖ్య పాత్రలను పోషిస్తుండగా జిబ్రాన్ సంగీతం అందించారు. పీటర్ మెయిన్స్ యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు.

బాలీవుడ్ నటుడు ముకుల్ దేవ్ మృతి



బాలీవుడ్, టాలీవుడ్‌లో నటించిన ప్రముఖ నటుడు ముకుల్ దేవ్ శుక్రవారం రాత్రి (54) మరణించారు. రవితేజ, వినాయక్ కాంబినేషన్‌లో వచ్చిన 'కృష్ణ' సినిమాతో మంచి గుర్తింపు పొందిన ఈ నటుడు ఆ తర్వాత ఏక్ నిరంజన్, కేడీ, అదుర్స్ వంటి సినిమాల్లో ప్రతినాయక పాత్రల్లో నటించి మెప్పించారు. తెలుగులో ఆయన చివరి చిత్రం 2013లో నాగార్జున హీరోగా నటించిన 'భాయ్'. పాతికేళ్ల క్రితం పైలట్ వృత్తికి మధ్యలోనే గుడ్‌బై చెప్పి 1996లో 'దస్తక్' సినిమాతో బాలీవుడ్‌లో రంగప్రవేశం చేశారు. ఈ చిత్రంలో సుస్మితసేన్‌కు జంటగా ఆయన నటించారు. హిందీ, పంజాబీ, బెంగాలీ, గుజరాతీ, మలయాళంలో అనేక సినిమాలు, సీరియల్స్‌లో నటించారు. సింహాద్రి, సీతారాముడు, నాయక్, ఎవడు వంటి సినిమాల్లో విలన్‌గా నటించిన రాహుల్ దేవ్‌కు ముకుల్ దేవ్ స్వయానా సోదరుడు. తల్లిదండ్రుల మరణంతో కొంతకాలంగా ఒంటరిగా ఉంటున్న ఆయన అనుకోకుండా అనారోగ్యం పాలై ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందారు. ఆయన మరణంపై పలువురు సినీ ప్రముఖులు విచారం వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు.

టెస్ట్ సారధిగా శుభ్‌మన్

- వైస్ కెప్టెన్‌గా రిషబ్ పంత్
- సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్‌కు చోటు
- ఇంగ్లాండ్ టూర్‌కు భారత టెస్టు జట్టు ఎంపిక

ఐదు రోజుల ఆటలో టీమిండియా యువ శకంలోకి అడుగుపెట్టింది. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, రవిచంద్రన్ అశ్విన్ వీడ్కోలుతో భారత టెస్టు జట్టును యువ నాయకత్వం ముందుండి నడిపించనుంది. భారత టెస్టు జట్టుకు 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా, 27 ఏళ్ల రిషబ్ పంత్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యారు. ఇంగ్లాండ్ పర్యటనలో ఐదు టెస్టుల సిరీస్ గిల్, పంత్ నాయకత్వానికి తొలి పరీక్ష కానుంది. దేశవాళీ సర్క్యూట్‌లో నిలకడగా రాణిస్తున్న బి.సాయి సుదర్శన్, వైట్‌బాల్‌లో అద్భుత ప్రదర్శన చేస్తున్న అర్ష్‌దీప్ సింగ్‌కు టెస్టు జట్టులో తొలిసారి చోటు దక్కింది. అభిమన్యు ఈశ్వరన్‌ను సైతం సెలక్షన్ కమిటీ ఎంపిక చేయగా.. తెలుగు తేజం నితీశ్ కుమార్ రెడ్డి వరుసగా రెండో విదేశీ పర్యటనకు వెళ్లనున్నాడు.

ముంబయి : ఇంగ్లాండ్‌లో పర్యటించే భారత టెస్టు జట్టును బిసిసిఐ సీనియర్ సెలక్షన్ కమిటీ శనివారం ప్రకటించింది. యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ (25)ను సెలక్షన్ కమిటీ కెప్టెన్‌గా ఎంచుకోగా.. టెస్టుల్లో సూపర్‌స్టార్ రిషబ్ పంత్ వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. రోహిత్ శర్మకు డిప్యూటీగా వ్యవహరించి, ఆసీస్ పర్యటనలో రెండు టెస్టులకు నాయకత్వం వహించిన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ కారణాలతో కెప్టెన్సీ అవకాశం కోల్పోయాడు!. జూన్ 20 నుంచి షురూ కానున్న ఇంగ్లాండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు 18 మందితో కూడిన జట్టును అజిత్ అగార్కర్ ప్యానల్ ఎంపిక చేసింది.

సాయి సుదర్శన్, అర్ష్‌దీప్‌లకు పిలుపు

దేశవాళీలో నిలకడగా రాణిస్తున్న సాయి సుదర్శన్ సహా వైట్‌బాల్ ఫార్మాట్‌లో మెరుస్తున్న అర్ష్‌దీప్ సింగ్‌లను సెలక్షన్ కమిటీ గుర్తించింది. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌కు సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్‌లను తొలిసారి టెస్టు జట్టులోకి తీసుకుంది. బ్యాటర్ కరుణ్ నాయర్, ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ జాతీయ జట్టులో అడుగుపెట్టారు. ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికైన సర్ఫరాజ్ ఖాన్, హర్షిత్ రాణాలను సెలక్టర్లు ఇంగ్లాండ్ టూర్‌కు పక్కనపెట్టారు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ప్రత్యామ్నాయ ఆటగాళ్లుగా జట్టులోకి వచ్చిన తనుశ్ కొటియన్, దేవదత్ పడిక్కల్‌లు సైతం ఇంగ్లాండ్‌తో సిరీస్‌కు ఎంపిక కాలేదు.

యువ నాయకత్వం

విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ వీడ్కోలుతో భారత టెస్టు జట్టులో నాయకత్వ శూన్యతతో పాటు బ్యాటింగ్ లైనప్‌లో రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఇంగ్లాండ్‌తో సిరీస్‌తో 2025–27 ఐసిసి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ రేసు ఆరంభం కానుండగా.. శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్‌లు భారత్‌ను నడిపించనున్నారు. శుభ్‌మన్ గిల్ టి20 ఫార్మాట్‌కు కెప్టెన్సీ వహించినా.. వన్డేలు, టెస్టులకు ఎన్నడూ నాయకత్వ బాధ్యత చేపట్టలేదు. శుభ్‌మన్ గిల్ 32 టెస్టుల్లో 35.05 సగటుతో 1893 పరుగులు చేశాడు. స్వదేశంలో గిల్ బ్యాటింగ్ సగటు 40 ప్లస్ కాగా.. విదేశీ టెస్టుల్లో 30లోపే ఉండటం గమనార్హం. రిషబ్ పంత్ 43 టెస్టుల్లో 42.11 సగటుతో 3948 పరుగులు చేశాడు.

జట్టు ఎలా ఉందంటే

యువ ఆటగాళ్లతో కూడిన టెస్టు జట్టు అంచనాలను పెంచేలా కనిపిస్తోంది!. బ్యాటింగ్ లైనప్‌లో యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, అభిమన్యు ఈశ్వరన్ సహా శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్, సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్ ఉన్నారు. రెండో వికెట్ కీపర్‌గా జురెల్ ఎంపికయ్యాడు. జట్టులో నలుగురు ఆల్‌రౌండర్లను ఎంపిక చేశారు. రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ స్పిన్ ఆల్‌రౌండర్లు కాగా నితీశ్ కుమార్ రెడ్డి, శార్దూల్ ఠాకూర్ పేస్ ఆల్‌రౌండర్లు. కుల్‌దీప్ యాదవ్ ఒక్కడే స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా జట్టులో నిలిచాడు. పేస్ విభాగంలో జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, ప్రసిద్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్‌లు నిలిచారు.

ఇదీ షెడ్యూల్

ఇంగ్లాండ్ పర్యటనలో భారత్ ఐదు టెస్టులు ఆడనుంది. జూన్ 20 నుంచి తొలి టెస్టు హీడింగ్లేలో ఆరంభం కానుండగా.. ఎడ్జ్‌బాస్టన్‌లో రెండో టెస్టు (జులై 2 నుంచి), లార్డ్స్‌లో మూడో టెస్టు (జులై 10 నుంచి), ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో నాల్గో టెస్టు (జులై 23 నుంచి), ఓవల్‌లో ఐదో టెస్టు (జులై 31 నుంచి) జరుగనున్నాయి. ఐపిఎల్18 ఫైనల్ అనంతరం లండన్‌కు చేరుకోనున్న టీమిండియా క్రికెటర్లు జూన్ 13–16న భారత్–ఎతో నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది.

భారత టెస్టు జట్టు : శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, రిషబ్ పంత్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, ప్రసిద్ కృష్ణ, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, అర్ష్‌దీప్ సింగ్.

కెప్టెన్‌గా గిల్ రాణిస్తాడు

శుభ్‌మన్ గిల్ టెస్టు కెప్టెన్‌గా రాణిస్తాడని సెలక్షన్ కమిటీ భావిస్తోంది. కొత్త కెప్టెన్‌కు మా శుభాకాంక్షలు. డ్రెస్సింగ్‌రూమ్ సహా పలువురి అభిప్రాయాలను తీసుకోవటంతో పాటు గత రెండేండ్లుగా గిల్‌ను నిశితంగా పరిశీలిస్తున్నాం. గిల్ యువకుడు. నాయకుడిగా పరిణితి చూపిస్తున్నాడు. సారథిగా సరైన వ్యక్తినే ఎంచుకున్నామని అనుకుంటున్నాం. గత కొన్నేండ్లుగా టెస్టుల్లో గొప్పగా రాణిస్తున్న ఆటగాళ్లలో పంత్ ఒకడు. పంత్ అనుభవం గిల్‌కు ఉపయోగపడుతుంది. జస్‌ప్రీత్ బుమ్రా సహా పలు ఇతర ఆప్షన్లను సైతం కెప్టెన్సీ కోసం పరిశీలించాం. ఇంగ్లాండ్ పర్యటనలో గిల్ ఐదు టెస్టులు ఆడతాడని అనుకోవటం లేదు. వైద్య బృందం, ఫిజియోలు సూచనలతో బుమ్రా ఫిట్‌నెస్ ముఖ్యమని భావించాం. కెప్టెన్‌గా కంటే ఆటగాడిగా బుమ్రా జట్టుకు ఎంతో అవసరం. ఆ విషయాన్ని అతడితో చర్చించాం. ఇంగ్లాండ్‌తో ఎన్ని టెస్టుల్లో ఆడినా.. కచ్చితంగా విజయంలో బుమ్రా పాత్ర కీలకం కానుంది. బుమ్రా పని భారం తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం'

– అజిత్ అగార్కర్, చీఫ్ సెలక్టర్.

స్లో ఓవర్‌రేట్..పాట్ కమిన్స్, రజత్ పటీదార్‌కు ఫైన్

న్యూఢిల్లీ: ఐపిఎల్–2025 సీజన్‌లో భాగంగా ఈనెల 23వ తేదీన లఖ్‌నవూ వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర, సన్ రైజర్స్ హైదరాబాద్ తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో స్లో ఓవరేట్ కారణంగా పాట్ కమిన్స్, రజత్ పటీదార్‌కు ఫైన్ పడింది. ఈ మ్యాచ్‌లో ఆర్‌సిబికి తాత్కాలిక కెప్టెన్‌గా జితేశ్ శర్మ వ్యహరించాడు. అయినప్పటికీ ఐపిఎల్ రూల్స్ ప్రకారం నియమిత కెప్టెన్ అయిన రజత్ పటీదార్‌కే ఫైన్ పడింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68